www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



జగన్ సరేనంటే ప్రభుత్వ కార్యాలయమే!

కాదంటే పర్యాటకానికే ఉపయోగిస్తాం

రుషికొండ భవనంపై మంత్రి రోజా వ్యాఖ్యలు

శారదాపీఠాధిపతితో కలిసి ప్రారంభోత్సవం

12

శుక్రవారం | 1-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 316 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి పూర్తి; నక్షత్రం: స్వాతి మ. 12.49 తదుపరి విశాఖ; వర్జ్యం: రా. 6.51-8.35; దుర్ముహూర్తం: ఉ. 8.58-9.44, మ. 12.51-1.38; అమృతఘడియలు: తె. 5.13 మొదలు; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 6.19 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాక్షస కక్ష!

ఎన్నికల ముందు మరో వికృత క్రీడ

బడ్డీ కొట్టు నుంచి బడా కంపెనీల దాకా ఎవరినైనా లక్ష్యం చేసుకునేలా వ్యూహం

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కొత్త కోరలు

ఏకంగా 12 శాఖలు, 13 చట్టాలపై పట్టు

ఏకపక్షంగా తనిఖీలు, జప్తులకు వీలు

వారెంట్ లేకున్నా అరెస్టు చేసే అధికారం

అపరిమిత అధికారాలు కోరిన ఐపీఎస్ కొల్లి

ఫైల్ కదిపిన ప్రభుత్వం.. ప్రస్తుతం న్యాయ శాఖ వద్ద



పురాణాల్లో బకాసురుడికి రోజుకొక నరుడిని తింటేగానీ తీరని ఆకలి!

ఇప్పుడు అధికార వైసీపీకి విపక్ష నేతలను వేధించుకు తింటేగానీ తీరని ఆకలి!

పోలీసు, సీఐడీ, ఏసీబీ, గనులు, ఔషధ నియంత్రణ... ఇలా అనేక విభాగాల అధికారులను విపక్షాల మీదికి ఉసిగొల్పుతూ వారి ఆర్థిక మూలాలను దెబ్బతీయడం, కేసుల్లో ఇరికించడం! దాదాపు ఐదేళ్లుగా ఇదే 'రాక్షసత్వం'! ఇలా విడివిడిగా పంపే రాక్షసులు సరిపోవడంలేదంటూ... ఇప్పుడు ఎన్నికల ముందు ఒక 'బ్రహ్మ రాక్షసి'ని సృష్టిస్తున్నారు. అదే... కొత్త కోరలు, అస్త్రాలతో కూడిన రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం'. దీనికి సంబంధించిన ఫైలు ఇప్పటికే ప్రాణం పోసుకుంది. న్యాయశాఖ ఆమోదం కోసం ఎదురు చూస్తోంది. వారు అనుకున్నది జరిగితే... 'బ్రహ్మ రాక్షసి' రెడీ! రోడ్డుపక్కన బడ్డీ కొట్టు నుంచి బడా కంపెనీల దాకా ఎవరినైనా లక్ష్యంగా చేసుకుని, వేధించుకుని తినొచ్చు. ఈ కొత్త ప్రతిపాదనలు చేసింది ఎవరో కాదు! ఐపీఎస్ అధికారి కొల్లి రఘురామిరెడ్డి!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కొల్లి రఘురామిరెడ్డి, ఐపీఎస్.. రాజధాని అమరావతి భూములపై జగన్ వేసిన 'సిట్' అధిపతి ఆయనే. 'స్కిల్ డెవలప్‌మెంట్' కేసులో విపక్ష నేత చంద్రబాబును అరెస్టు చేసింది ఆయనే. రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం అధిపతి హోదాలో ఇటీవల టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పి.నారాయణ నివాసంపై విరుచుకుపడిందీ ఆయనే. రాష్ట్ర

మిగతా 12వ పేజీలో...



మోసం గురూ!

ముగ్గురు ఐఏఎస్‌లకు ఓపీఎస్!

ఇటీవల గుట్టుగా జీవో విడుదల

10 వేల మందికి పైగా ఉద్యోగులపై జగన్ సర్కారు కాఠిన్యం

అమరావతి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు జగన్ సర్కారు అడుగడుగునా అన్యాయం చేస్తోందని మరోసారి తేలిపోయింది. ప్రస్తుతం సీపీఎస్‌లో ఉన్నప్పటికీ కేంద్రం ధ్రువీకరించిన నిబంధనల మేరకు అర్హులైన ముగ్గురు ఐఏఎస్ అధికారులను తాజాగా ఓపీఎస్ పరిధిలోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఇటీవల జీవో 2140ను రహస్యంగా జారీ చేసింది. ఈ ఉత్తర్వులతో ఐఏఎస్ అధికారులు రేవు ముత్యాలరాజు, కాటమనేని భాస్కర్, ప్రవీణ్‌కుమార్ ఓపీఎస్‌లోకి రానున్నారు. ముత్యాలరాజు సీఎంవోలో కార్యదర్శిగా పని చేస్తున్నందుకే ప్రభుత్వం వీరికి ఈ అవకాశం ఇచ్చిందని ఉద్యోగులు భావిస్తున్నారు. ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా ఓపీఎస్‌లోకి రావడానికి అర్హులైన ఉద్యోగులు 10వేల మందికి పైగా ఉన్నారని, తమను కూడా పట్టించుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఉద్యోగ సంఘాలతో

మిగతా 11వ పేజీలో...

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

లేకుంటే మే 1 నుంచి సమ్మె

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల హెచ్చరిక

2

రోత మురా..

ఫేక్ రాత!

పదేపదే 'ఆంధ్రజ్యోతి' లోగోతో ఫేక్ వార్తల సృష్టి

నీలి మీడియాకు విశ్వసనీయత లేదని ఒప్పుకొన్నట్లే!

పవన్‌కు నాలుగో భార్య అంటూ తప్పుడు కథనం

'జెండా' సభపైనా వైసీపీ ఫేక్ వీడియోలు

12

మాజీ మంత్రి పుల్లారావు

కుమారుడి అరెస్టు

జీఎస్టీ ఎగవేశారని ఎస్డీఆర్ఐ ఫిర్యాదు

కేసు నమోదు చేసిన మాచవరం పోలీసులు

గుంటూరులో అరెస్టుచేసి బెజవాడ తరలింపు

పొద్దుపోయేదాకా ఆచూకీ చెప్పకపోవడంతో సీపీ ఆఫీసు వద్ద టీడీపీ శ్రేణుల నిరసన

అర్ధరాత్రి వేళ న్యాయాధికారి ఎదుట హాజరు



విజయవాడ పోలీసు కమిషనర్ ఆఫీసు ఎదుట ప్రత్తిపాటి పుల్లారావు, ఇతర నేతల ఆందోళన

11

ఓట్లెందుకు తీసేశారు?

పిటిషనర్ల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నారా?

అవి 'మూస' ఉత్తర్వులు.. పరుచూరు కేసులో హైకోర్టు వ్యాఖ్య

వివరాలతో అఫిడవిట్ వేయాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశం



12

రూ. 1.26 లక్షల కోట్లతో

3 సెమీకండక్టర్ యూనిట్లు

గుజరాత్, అసోంలో ఏర్పాటుకు ఓకే

ఖరీఫ్‌లో రూ.24,420 కోట్ల ఎరువుల రాయితీకి పచ్చజెండా

రూ.75 వేల కోట్లతో 'సూర్యఘర్' అమలుకు గ్రీన్‌సిగ్నల్

7 రకాల బిగ్ క్యాట్స్ సంరక్షణకు ఐబీసీఏ

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

2

మే 1 నుంచి నిరవధిక సమ్మె

» ఓపీఎస్ పునరుద్ధరణకు ఉద్యోగ సంఘాల డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: పాత పింఛన్ పథకం(ఓపీఎస్)ను పునరుద్ధరించకుంటే కార్మిక దినోత్సవం(మే 1) నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు హెచ్చరించాయి. ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు కలిసి దీనికోసం జేఎఫ్ఆర్ఓపీఎస్(ది జాయింట్ ఫోరం ఫర్ రీస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీం)గా ఏర్పడ్డాయి. మార్చి 19 నుంచే సమ్మె నోటీసులు ఇవ్వడం ప్రారంభిస్తామని జేఎఫ్ఆర్ఓపీఎస్ కన్వీనర్ శివ్ గోపాల్ మిశ్రా గురువారం ఓ ఆంగ్ల పత్రికకు తెలిపారు. కాగా, ఓపీఎస్ స్థానంలో ప్రభుత్వం ఎన్పీఎస్(జాతీయ పింఛన్ పథకం)ను అమల్లోకి తీసుకొచ్చింది. ఎన్పీఎస్ కింద ఉద్యోగి మూల వేతనంలో 10 శాతాన్ని, అలాగే ప్రభుత్వం నుంచి మరో 14 శాతాన్ని పింఛన్ నిధికి జమచేస్తారు. ఆ నిధులను వివిధ రూపాల్లో పెట్టుబడులు పెడతారు. ఉద్యోగి రిటైర్మెంట్ ప్రయోజనాలు ఈ పెట్టుబడులపైనే ఆధారపడి ఉంటాయి. ఎన్పీఎస్ అనేది రిటైరయ్యే ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని జేఎఫ్ఆర్ఓపీఎస్ కన్వీనర్ శివ్ గోపాల్ మిశ్రా విమర్శించారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని చర్చల్లో అనేకసార్లు డిమాండ్ చేశామని, కేంద్ర ప్రభుత్వానికి లేఖలు కూడా రాశామని చెప్పారు. కాగా, ఓపీఎస్‌ను పునరుద్ధరించే ఆలోచన ఏమీ లేదని గతేడాది డిసెంబరులో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది.

మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

» వాహనం లోయలోపడి 14 మంది మృతి

దిండోరి, ఫిబ్రవరి 29: మధ్యప్రదేశ్‌లో గురువారం ఘోర ప్రమాదం జరిగింది. ఓ కార్యక్రమానికి వెళ్లి వస్తున్న పికప్ వాహనం బోల్తా పడిన ఘటనలో 14 మంది మరణించారు. మరో 20 మంది గాయపడ్డారు. "దిండోరి జిల్లా బందర్ఝర్ ఘాట్ మూల మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ దుర్ఘటన జరిగింది. వాహనం 50 అడుగుల లోయలో బోల్తా పడింది. తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనలో 14 మంది చనిపోయారు. క్షతగాత్రుల్లో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది" అని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు 50వేల రూపాయలను పరిహారంగా ప్రధాని మోదీ ప్రకటించారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం చనిపోయిన ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 4 లక్షల ఆర్థిక సాయం ప్రకటించింది.

గాజాలో ఇజ్రాయెల్ కాల్పులు..

104 మంది శరణార్థుల దుర్మరణం

» 750 మందికి తీవ్ర గాయాలు.. పిండి పంపిణీలో దారుణం

సెంట్రల్ గాజా, ఫిబ్రవరి 29: ఆహారం దొరక్క.. కలుపు మొక్కల్ని తింటున్న గాజా వాసులపై మరో పిడుగు పడింది. ఈజిప్టు నుంచి రఫా సరిహద్దు మీదుగా గురువారం ఉదయం ఆహార సరఫరా ట్రక్కులు రాగా.. పిండి కోసం ఆ వాహనాలను చుట్టుముట్టిన పాలస్తీనీయులపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ ఘటనలో 104 మంది మృత్యువాత పడ్డారు. మరో 750 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఉన్నారు. దక్షిణ గాజాలోని 'రషీద్ స్ట్రీట్' వద్ద మానవతాసాయం కోసం ఎదురు చూస్తున్నవారిపై ఇజ్రాయెల్ దారుణంగా కాల్పులు జరిపిందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి అష్రఫ్ అల్-ఖుద్రా ఆరోపించారు. ఇజ్రాయెల్ తొలుత ఈ ఆరోపణలను ఖండించింది. పిండి పంపిణీలో జరిగిన తొక్కిసలాటలో మరణాలు సంభవించినట్లు పేర్కొంది. మధ్యాహ్నానికి కాల్పులకు తమ వైమానికదళమే కారణమని అంగీకరించినట్లు 'రాయిటర్స్' ఓ వార్తను ప్రచురించింది. అయితే మరణాల సంఖ్యను 70గా ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) పేర్కొన్నట్లు తెలిపింది.

6 నుంచి హెచ్1బీ వీసా రిజిస్ట్రేషన్లు: యూఎస్‌సీఐఎస్

వాషింగ్టన్, ఫిబ్రవరి 29: అమెరికాలో తాత్కాలికంగా ఉద్యోగం చేయడానికి విదేశీయులకు జారీ చేసే హెచ్1బీ వీసా కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లను త్వరలోనే ప్రారంభించనున్నట్లు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ప్రకటించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి గాను హెచ్1బీ ఎలక్ట్రానిక్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మార్చి 6న ప్రారంభమై అదే నెల 22 వరకూ కొనసాగుతుందని వెల్లడించింది. మరోవైపు, ఒక సంస్థలోని బహుళ వ్యక్తులు, వారి చట్టబద్ధమైన సంబంధీకుల హెచ్1బీ వీసా రిజిస్ట్రేషన్లు, దరఖాస్తుల ప్రక్రియలో సహకరించడానికి ఒక కొత్త వ్యవస్థను సిద్ధం చేసినట్లు యూఎస్ ఇమిగ్రేషన్ ఏజెన్సీ బుధవారం ప్రకటించింది. దీనిలో భాగంగా సంస్థాగత ఖాతాలను ప్రారంభించినట్లు తెలిపింది. వీసా దరఖాస్తు ప్రక్రియలో సహకారాన్ని పెంపొందించడంతో పాటు ఇతర ప్రక్రియలను క్రమబద్ధీకరించడమే దీని లక్ష్యమని పేర్కొంది. ప్రీమియం ప్రాసెసింగ్ సర్వీసులు ప్రారంభించడానికి ఐ-907, దాని అనుబంధ దరఖాస్తుల విషయంలో సహకరించడానికి ఈ ఖాతాలు అనుమతిస్తాయని వివరించింది.

FORM IV

(Rule 8)

UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867 STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT NEWSPAPER ANDHRA JYOTHI

1. Place of Publication	: Hyderabad, Vijayawada, Visakhapatnam, Tirupathi, Karimnagar, Ananthapur, Tadepalligudem, Warangal, Guntur, Kurnool, Nellore, Srikakulam, Rajamahendravaram, Khammam, Kadapa, Ongole, Nalgonda, Nizamabad, Mahaboobnagar.
2. Periodicity of its Publication	: DAILY
3. Printer's name	: KOGANTI VENKATA SESHAGIRI RAO
1 (a) Whether a citizen of india	: YES
(b) If a foreigner, The country of origin:	-
Address	: Door No.: 8-2-293/82/J/68-B, Journalist Colony, Jubilee Hills, Hyderabad - 500 033, Telangana.
4. Publisher's Name	: KOGANTI VENKATA SESHAGIRI RAO
1 (a) Whether a citizen of India	: YES
(b) If a foreigner, The country of origin	: -
Address	: Door No.: 8-2-293/82/J/68-B,, Journalist Colony, Jubilee Hills, Hyderabad - 500 033, Telangana.
5. Editor's Name	: K.SRINIVAS
Nationality	: INDIAN
1 (a) Whether a citizen of India	: YES
(b) If a foreigner, the country of origin:	-
Address	: 301, Sai Surabi Apartments Durgabhai Deshmuki Colony, Hyderabad - 500 007. Telangana.
6. Name's and Addresses of individuals : Who own the Newspaper and partners of Shareholding more than one percent of the total capital	
(a) Aamoda Publications Pvt. Ltd	Plot No.76, Road No.70, Ashwini Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad - 500 033.
(b) V.Radhakrishna	8-3-293/82/J III/211-1, Road No 76, Phase-III, Jubilee Hills Hyderabad - 500 033
(c) M.Prabhakara Rao	H.No. 8-2-293/82/A, Plot No.543, Road No.26, Jubilee Hills, Hyderabad - 500 033.
(d) D.Jai Ramesh	Plot No.173, Road No.13, Jubilee Hills, Hyderabad - 500 033.
(e) V.Aditya	8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.
(f) Ch.Shruthi Keerthi	8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.
(g) M/s Active Power Corporation Pvt Ltd	Plot No.76, Road No.70, Ashwini Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad - 500 033.
(h) Vemuri Anusha	8-3-293/82/J III/211-1, Road No.76, Phase-III, Jubilee Hills, Hyderabad - 500 033.

I, **KOGANTI VENKATA SESHAGIRI RAO,** here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
KOGANTI VENKATA SESHAGIRI RAO
Publisher

Date: 29.02.2024

ఇంటెల్ పెంటియం రూపకర్త అవతార్ సింగ్ దుర్మరణం

» సైక్లింగ్ చేస్తుండగా ఢీకొన్న ట్యాక్సీ

» ముంబై పాలమ్ బీచ్‌రోడ్‌లో ఘటన



ముంబై, ఫిబ్రవరి 29: ఐదోతరం కంప్యూటర్లకు నాందిపలికిన ఇంటెల్ పెంటియం ప్రాసెసర్ రూపకర్త అవతార్‌సింగ్ సైనీ (68) రోడ్డు ప్రమాదంలో దుర్మరణంపాలయ్యారు. ఇంటెల్ ఇండియా, ఇంటెల్ దక్షిణాసియా విభాగాలకు చీఫ్‌గా వ్యవహరించిన ఆయన అమెరికాలో స్థిరపడ్డారు. ఇటీవలే తన స్వస్థలం ముంబైకి వచ్చారు. బుధవారం ఉదయం పాలమ్ బీచ్‌రోడ్‌లో సైక్లింగ్ చేస్తుండగా ఓ ట్యాక్సీ అతణ్ని ఢీకొంది. ఈ ఘటనలో ముందు చక్రాల కింద తల నలిగిపోయి కొన ఊపిరితో ఉన్న అవతార్‌సింగ్‌ను ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందేలోపు మృతిచెందినట్లు పోలీసులు వివరించారు. "అవతార్‌సింగ్ కుమారుడు, కుమార్తె అమెరికాలోనే స్థిరపడ్డారు. వారు భారత్‌కు వస్తున్నారు"అని ముంబై పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారకుడైన ట్యాక్సీ డ్రైవర్‌ను అరెస్టు చేశామని, అవతార్‌సింగ్ బంధువులకు మృతదేహాన్ని అప్పగించామన్నారు.

కంప్యూటర్ వేగంలో మార్పు..

భారీ సైజులో ఉండే కంప్యూటర్లు.. ఆలస్యంగా ఔట్‌పుట్‌నిచ్చే ప్రాసెసర్లు..! ఇదీ మూడున్నర దశాబ్దాల క్రితం సంగతి. అప్పట్లో 8085, 8086 ప్రాసెసర్ల పనితీరు అలా ఉండేది. అప్పుడే సైజులో చిన్నగా ఉండి వేగంగా పనిచేసే ప్రాసెసర్ల రూపకల్పనకు ఇంటెల్ నడుంబిగించింది. 1993 మార్చిలో అవతార్‌సింగ్.. పెంటియం ప్రాసెసర్‌కు రూపకల్పన చేశారు. అలా పెంటియం-1(ఎక్స్86) ప్రాసెసర్లు అందుబాటులోకి వచ్చి కంప్యూటర్ల వేగం పెరిగింది. ఐదోతరంకంప్యూటర్ల నాందికి పెంటియం-1 దోహదపడింది. తర్వాత పెంటియం-2,3,4 వచ్చాయి. పెంటియంలో 64- బిట్ మైక్రోప్రాసెసర్ల రూపకల్పనలోనూ అవతార్ సింగ్‌ది కీలక భూమిక. ఇంటెల్ డ్యూయల్ కోర్, కోర్-2 డ్యూయో.. ఐ3, ఐ5, ఐ7..ఇలా కొంగొత్త ప్రాసెసర్లను తెచ్చింది. 2004లో ఇంటెల్‌ను అవతార్ వీడారు.

1.26 లక్షల కోట్లతో 3 సెమీకండక్టర్ యూనిట్లు

గుజరాత్, అసోంలో ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం.. ఖరీఫ్‌లో 24,420 కోట్ల ఎరువుల రాయితీకి ఓకే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: ఎలక్ట్రానిక్స్ రంగంలో అత్యంత కీలకమైన సెమీకండక్టర్ల విషయంలో ఆత్మనిర్భరత సాధించే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1.26 లక్షల కోట్లతో మూడు సెమీకండక్టర్ తయారీ యూనిట్ల ఏర్పాటుకు.. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోద ముద్ర వేసింది. దీంతోపాటు.. ఫాస్ఫాటిక్, పొటాష్ ఎరువులకు రూ.24,420 కోట్ల సబ్సిడీ నిధుల విడుదల, 'పీఎం సూర్యఘర్: ఉచిత విద్యుత్ పథ కం' కింద సౌరఫలకలను అమర్చుకున్న ప్రతి ఇంటికీ రూ.78 వేల సబ్సిడీ, 12 వ్యూహాత్మక ఖనిజాల రాయల్టీకి సంబంధించి ఎంఎండీఆర్ చట్టాన్ని సవరించడం వంటి కీలక ప్రతిపాదనలకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. రక్షణ, ఆటోమొబైల్స్, టెలీకమ్యూనికేషన్స్ రంగాల్లో అత్యవసరమైన 'చిప్'ల కోసం భారతదేశం దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో.. దేశీయంగా చిప్‌ల తయారీని ప్రోత్సహించేందుకు 'డెవలప్‌మెంట్ ఆఫ్ సెమీకండక్టర్స్ అండ్ డిస్‌ప్లే మాన్యుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్' ప్రోగ్రామ్ కింద టాటా గ్రూప్, జపాన్‌కు చెందిన రెనెసాస్ భాగస్వామ్యంతో మూడు యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో రెండింటిని గుజరాత్‌లో, ఒక యూనిట్‌ను అసోంలో ఏర్పాటు చేస్తామని.. వచ్చే 100 రోజుల్లో వీటి నిర్మాణం ప్రారంభమవుతుందని, ఈ యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం రూ.76 వేల కోట్ల సాయం అందిస్తుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.



క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

ఏవేవి ఎక్కడంటే..

గుజరాత్‌లోని ధోలేరాలో ఒక యూనిట్‌ను టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తైవాన్‌కు చెందిన పవర్‌చిప్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్‌తో కలిసి రూ.91 వేల కోట్లతో ఏర్పాటు చేస్తుంది. నెలకు 50 వేల వేఫర్స్‌ను తయారు చేసే సామర్థ్యం ఈ యూనిట్‌కు ఉంటుంది. సీజీ పవర్ అనే మరో సంస్థ జపాన్, థాయ్ సంస్థలతో కలిసి గుజరాత్‌లోనే సనంద్‌లో రూ.7,600 కోట్లతో ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇక.. టాటా సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ (టీశాట్) సంస్థ అసోంలోని మోరిగావ్‌లో రూ.27 వేల కోట్లతో ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. వీటిలో ధోలేరాలో టాటా సంస్థ ఏర్పాటు చేసే ప్లాంట్ అత్యంత శక్తిమంతమైన 28 నానోమీటర్ చిప్స్‌ను తయారుచేస్తుందని అశ్వినివైష్ణవ్ తెలిపారు. అసోం యూనిట్‌లో రోజుకు 4.8 కోట్ల చిప్‌లు.. సనంద్ యూనిట్‌లో రోజుకు 1.5 కోట్ల చిప్‌లు తయారవుతాయని వెల్లడించారు. ఈ మూడు యూనిట్ల వల్ల నేరుగా 20 వేల మందికి ప్రత్యక్షంగా.. మరో 60 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని వివరించారు. చిప్‌ల లభ్యత అధికంగా ఉండడంతో.. ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, టెలికం, ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ఉద్యోగాల సంఖ్య భారీగా పెరుగుతుందని పేర్కొన్నారు. ఇక.. ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 దాకా సాగే ఖరీఫ్ సీజన్‌కు రూ.24,420 కోట్ల ఎరువుల సబ్సిడీని అందించేందుకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. రైతులు ప్రస్తుతం డీఏపీ (డై అమ్మోనియం ఫాస్ఫేట్) ఎరువును క్వింటా సబ్సిడీ ధర అయిన రూ.1350కి కొనుగోలు చేస్తున్నారు. ఈ రేటు కొనసాగుతుందని, ఫాస్ఫాటిక్, పొటాష్ ఎరువుల రిటైల్ ధరలు కూడా అలాగే కొనసాగుతాయని కేంద్రం స్పష్టం చేసింది. డీఏపీ దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించేందుకుగాను.. పోషకాల ఆధారిత రాయితీ పథకంలో ఉన్న 25 ఎరువుల శ్రేణికి మరో మూడు కొత్త ఎరువుల గ్రేడ్‌లను చేర్చాలన్న ప్రతిపాదనకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది.

ఇంటింటా సౌర శక్తి..

'పీఎం సూర్యఘర్: ఉచిత విద్యుత్ యోజన' పేరిట రూ.75,021 కోట్లతో చేపట్టిన పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ పథకం కింద ఇళ్లపై సౌరశక్తి ఫలకాలు అమర్చుకునేవారికి.. విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని బట్టి ఇంటికి రూ.30 వేల నుంచి రూ.78 వేల దాకా ఇస్తారు. అలాగే దాన్నుంచి వచ్చే విద్యుత్తులో నెలకు 300 యూనిట్ల దాకా ఉచితంగా వినియోగించుకోవచ్చు. మిగతా విద్యుత్‌ను ప్రభుత్వం తీసుకుంటుంది. కోటి ఇళ్లకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో 2024 ఫిబ్రవరి 13న ప్రధాని మోదీ ఈ పథకాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. వీటితోపాటు.. అంతరించే ముప్పు ఎదుర్కొంటున్న పులి, సింహం, చిరుత, మంచు చిరుత, ప్యూమా, జాగ్వార్, చీతా సంరక్షణ కోసం గతంలో భారతదేశం ప్రతిపాదించిన 'అంతర్జాతీయ బిగ్ క్యాట్ అలయన్స్ (ఐబీసీఏ)' ఏర్పాటుకు కూడా క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. 96 దేశాల్లో ఈ 'బిగ్ క్యాట్స్' ఉండగా.. మనదేశంలో పులి, సింహం, చిరుత, మంచు చిరుత, చీతా కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో ఐబీసీఏ ప్రధాన కార్యాలయం భారత్‌లోనే ఏర్పాటు చేయనున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి 2027-28 దాకా దీని కోసం రూ.150 కోట్లు అందించనున్నారు.

లోకం తీరు



ఆరుగురు కాంగ్రెస్

ఎమ్మెల్యేలపై వేటు

» అనర్హులుగా ప్రకటించిన హిమాచల్‌ప్రదేశ్ స్పీకర్

» పార్టీ విప్ ధిక్కరించినందుకే!

సిమ్లా/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: బడ్జెట్‌పై ఓటింగ్ సందర్భంగా విప్‌ను ధిక్కరించిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ కుల్దీప్‌సింగ్ పఠానియా గురువారం అనర్హత వేటు వేశారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రకటించారు. రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినందుకు అనర్హులుగా తేల్చలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు రాజిందర్ రాణా, సుధీర్‌శర్మ, ఇందర్‌దత్ లఖన్‌పాల్, దేవిందర్ కుమార్ భుటూ, రవితాకూర్, చైతన్యశర్మలు బడ్జెట్‌పై ఓటింగ్‌లో పాల్గొనలేదని, ఆర్థిక బిల్లుపై ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేయనందున అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌ను అధికార కాంగ్రెస్ కోరింది. వీరంతా మంగళవారం రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు ఓటు వేయడం గమనార్హం. కాగా, విప్‌ను ఉల్లంఘించినందుకు ఎమ్మెల్యేలపై చర్యలు కోరుతూ స్పీకర్‌కు శాసనసభా వ్యవహారాల మంత్రి హర్షవర్ధన్ మంగళవారం పిటిషన్ సమర్పించారు. ఎమ్మెల్యేలు బుధవారం స్పీకర్ ఎదుట హాజరయ్యారు. గురువారం ఇరుపక్షాల వాదనల అనంతరం స్పీకర్ నిర్ణయం ప్రకటించారు. విప్‌ను ధిక్కరించిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి వచ్చారని.. దీంతో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కాగా, తమ క్లయింట్‌లకు షోకాజ్ మాత్రమే జారీ చేశారని, 7 రోజులకు గాను 2 రోజుల సమయమే ఇచ్చారని రెబల్ ఎమ్మెల్యేల తరఫు న్యాయవాది పేర్కొన్నారు. అయితే, రెబల్ ఎమ్మెల్యేలు హాజరు పట్టికలో సంతకం చేశారని.. బడ్జెట్‌పై ఓటింగ్‌కు గైర్హాజరయ్యారని స్పీకర్ పఠానియా వివరించారు.

ఎట్టకేలకు షాజహాన్ షేక్ అరెస్ట్

10 రోజుల పోలీసు కస్టడీకి ఇచ్చిన కోర్టు.. సందేశ్‌ఖాలీలో సంబరాలు



బసిర్హాత్/కోల్‌కతా, ఫిబ్రవరి 29: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో మహిళలపై లైంగిక వేధింపులు, భూ ఆక్రమణల కేసుల్లో ప్రధాన నిందితుడు, అధికార టీఎంసీ నేత షాజహాన్ షేక్‌ను ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని మినాఖా ప్రాంతంలో ఓ ఇంట్లో దాక్కొన్న షేక్‌ను గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. 'రేషన్ బియ్యం కుంభకోణం' కేసులో నిందితుడిగా ఉన్న షాజహాన్ ఇంట్లో తనిఖీలకు వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులపై గత నెల 5న అతని అనుచరులు దాడి చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి షేక్ కనిపించకుండా పోయారు. షాజహాన్ షేక్, అతడి అనుచరులు తమపై అకృత్యాలకు పాల్పడుతున్నారంటూ ఇక్కడి మహిళలు రోడ్డెక్కారు. అతన్ని అరెస్టు చేయాలంటూ సందేశ్‌ఖాలీ ప్రాంత ప్రజలు దాదాపు 55 రోజులుగా హింసాత్మక నిరసనలు చేస్తున్నారు. ఈ క్రమం లో షేక్‌ను 72 గంటల్లోగా అరెస్టు చేయాలని.. లేకపోతే కారణాలను తనకు నివేదించాలని బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనందబోస్ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. మరోవైపు కలకత్తా హైకోర్టు కూడా సీబీఐ, ఈడీ, బెంగాల్ పోలీసుల్లో ఎవరైనా షేక్‌ను అరెస్టు చేయొచ్చని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు, గవర్నర్ ఆదేశాల నేపథ్యంలో పోలీసులు స్పందించారు. సందేశ్‌ఖాలీకి 30 కిలోమీటర్ల దూరంలోని మినాఖా ప్రాంతంలో ఓ ఇంట్లో ఉన్న షేక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అదనపు డీజీపీ సుప్రతిమ్ సర్కార్ గురువారం వెల్లడించారు. అనంతరం అతన్ని బసిర్హాత్ కోర్టులో హాజరుపర్చగా.. 10 రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించినట్లు చెప్పారు. తర్వాత అతన్ని కోల్‌కతాలోని పోలీసు ప్రధాన కార్యాలయానికి తరలించారు. మమత సర్కారు ఈ కేసును సీఐడీకి అప్పగించడంతో షేక్‌ను అక్కడికి తీసుకెళ్లినట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు. షాజహాన్ షేక్ అరెస్టు వార్త తెలియగానే సందేశ్‌ఖాలీ ప్రజలు సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచుకున్నారు.

హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు..

షాజహాన్ షేక్‌కు బెయిలు ఇవ్వాలని కోరుతూ అతని తరఫు న్యాయవాదులు కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. 'నా క్లైంట్ ముందస్తు బెయిల్ తిరస్కరణకు గురైంది. ఆయన్ను అరెస్టు చేశారు. పిటిషన్‌పై సత్వరమే విచారణ చేపట్టండి' అని నిందితుడి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటున్న షేక్‌పై ఎలాంటి సానుభూతీ లేదని సీజే జస్టిస్ టీఎస్ శివజ్ఞానం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఈ వ్యక్తిపై 43 కేసులు ఉన్నాయి. మరో 10 ఏళ్ల ఆయన మిమ్మల్ని బిజీగా ఉంచుతారు. మరే కేసు పరిశీలించే అవకాశం ఉండకపోవచ్చు. షేక్ కేసు విచారణకే పెద్ద లీగల్ టీమ్‌ను పెట్టుకోవాల్సి వస్తుందేమో!' అని వ్యాఖ్యానించారు.

షాజహాన్‌పై సస్పెన్షన్ వేటు..

పోలీసులు అరెస్టు చేసిన షాజహాన్ షేక్‌పై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కఠిన చర్యలు తీసుకుంది. అతన్ని పార్టీ నుంచి ఆరేళ్లపాటు సస్పెండ్ చేసినట్లు టీఎంసీ నేత డెరెక్ ఒబ్రెయిన్ చెప్పారు. ప్రస్తుతం అతను సందేశ్‌ఖాలీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా, ఉత్తర 24 పరగణాల జిల్లా పరిషత్ సభ్యుడిగా ఉన్నారు. మరోవైపు షాజహాన్ మంగళవారం రాత్రి నుంచి బెంగాల్ పోలీసుల 'సురక్షిత కస్టడీ'లోనే ఉన్నారని బీజేపీ పేర్కొంది. తాజా అరెస్టు కేవలం వారి ముందస్తు ప్రణాళికలో భాగమేనని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సుకాంత్ మజుందార్ ఆరోపించారు. షాజహాన్ లాంటి అసాంఘిక శక్తులు టీఎంసీకి ఆస్తులన్న విషయం మరోసారి రుజువైందని బెంగాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అధీర్‌రంజన్ చౌధరి అన్నారు. ఆయన అరెస్టు కేవలం డ్రామా అని ఆరోపించారు. 43 కేసులు నమోదైనా షాజహాన్‌ను అరెస్టు చేయడానికి ఇంత సమయం ఎందుకు పట్టిందని సీపీఎం ప్రశ్నించింది.

ప్రత్యేక దక్షిణాది దేశం ఆలోచన ప్రమాదకరం

» కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్



బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక దక్షిణ భారత అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ డీకే సురేష్ లేవనెత్తడాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తప్పుబట్టారు. ఇది అత్యంత ప్రమాదకరమైన పోకడ అని వ్యాఖ్యానించారు. దేశాన్ని బీజేపీ ఏకం చేస్తుంటే కాంగ్రెస్ నోట ఇలాంటి విభజన మాటలు పదేపదే వినిపిస్తున్నాయని ఆమె విమర్శించారు. బెంగళూరులోని ఆదాయపన్నుల శాఖ కార్యాలయంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాలకు నిధుల విడుదలలో కేంద్రం నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. నిధుల విడుదలలో ఫైనాన్స్‌కమిషన్‌ను కాదని కేంద్రం వ్యవహరించడం లేదన్నారు. కర్ణాటకలో వసూలయ్యే పన్నులను ఎక్కడికీ తరలించడం లేదని, ఆ రాష్ట్ర అభివృద్ధికే వినియోగిస్తున్నామని ఆమె చెప్పారు.

మెట్రోలో అన్నదాతకు అవమానంపై జాతీయ మానవహక్కుల కమిషన్ నోటీసు

బెంగళూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): మాసిన బట్టలతో వచ్చిన రైతును మెట్రోస్టేషన్‌లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడంపై మానవహక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వివాదంపై కమిషన్ తీవ్రంగా స్పందించింది. నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని బెంగళూరు మెట్రో కార్పొరేషన్‌కు నోటీసు జారీ చేసింది. ఫిబ్రవరి 26న రాజాజీనగర్ మెట్రోస్టేషన్‌లోకి వచ్చిన రైతును మెట్రో సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్న విషయం తెలిసిందే. తోటి ప్రయాణికులు సిబ్బందిని మందలించి, ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అది వైరల్ కావడంతో ఇప్పటికే సంబంధిత సెక్యూరిటీ సిబ్బందిని విధుల నుంచి తొలగించారు.

వీల్‌చైర్ లేక వృద్ధుడి మృతి ఘటనలో ఎయిర్ ఇండియాకు రూ.30 లక్షల జరిమానా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: ఇటీవల ముంబై విమానాశ్రయంలో వీల్‌చైర్ అందుబాటులో లేకపోవడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటనకు సంబంధించి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) తీవ్రంగా స్పందించింది. వృద్ధుడికి వీల్‌చైర్ సమకూర్చడంలో విఫలమైనందుకు ఎయిర్ ఇండియాకు రూ.30 లక్షల జరిమానా విధించినట్లు డీజీసీఏ గురువారం తెలిపింది. ఈనెల 12న ఓ 80 ఏళ్ల వ్యక్తి తన భార్యతో కలిసి ఎయిర్‌ఇండియా విమానంలో న్యూయార్క్ నుంచి ముంబైకు వచ్చారు. విమానం దిగిన తర్వాత వీల్‌చైర్ అందుబాటులో లేకపోవడంతో ఆయన టెర్మినల్ వరకు నడుచుకుంటూ వెళ్లి గుండెపోటుకు గురై మరణించిన సంగతి తెలిసిందే. విమానాశ్రయాల్లో ప్రయాణికులకు సరిపడా వీల్‌చైర్‌లు అందుబాటులో ఉండేలా చూడాలని అన్ని విమానయాన సంస్థలకు డీజీసీఏ గురువారం అడ్వైజరీ జారీ చేసింది.

జైళ్లలో కుల, మత వివక్ష చెల్లదు

» నిబంధనలు సవరించండి.. రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

చెన్నై, ఫిబ్రవరి 29: కులం, మతం ఆధారంగా జైళ్లలో ఖైదీల పట్ల వివక్ష చూపిస్తుండడాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఇలాంటివాటికి వెంటనే స్వస్తి పలకాలని తెలిపింది. ఇందుకు వీలుకలిగించే నిబంధనలు కొన్ని రాష్ట్రాల జైళ్ల మ్యాన్యువల్‌లలో ఉన్నాయని, వాటిని తక్షణమే రద్దు చేయడమో, సవరించడమో చేయాలని ఆదేశించింది. ఖైదీలను వారి కులం, మతం ఆధారంగా వేరు చేయడంతో పాటు అందుకు అనుగుణంగా వారికి జైళ్ల పనులు అప్పగించడం కొన్ని రాష్ట్రాల్లో అమలవుతోంది. ఇది రాజ్యాంగానికి వ్యతిరేకమని కేంద్ర హోం శాఖ స్పష్టం చేసింది. 2016నాటి మోడల్ ప్రిజన్ మాన్యువల్‌లోనూ ఈ విషయాన్ని స్పష్టం చేసినట్టు గుర్తు చేసింది. వంటశాల నిర్వహణ, ఆహారం తయారీ తదితర పనుల్లో కులం, మతాన్ని చూడకూడదని; సామాజిక, ఆర్థిక హోదాల ఆధారంగా ఖైదీలను విభజించకూడదని, అందర్నీ ఒకేలా చూడాలని స్పష్టంగా ఉంది. ఈ నిబంధనలు అన్ని రాష్ట్రాల జైళ్ల మాన్యువల్‌లలో పొందుపరచాలని సూచించింది. ఖైదీల శారీరక, మానసిక ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలిపింది.

ప్రభుత్వ ఉద్యోగానికి సంతాన పరిమితి నిబంధన సబబే: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: ప్రభుత్వ ఉద్యోగం పొందేందుకు విధించిన అర్హతల్లో సంతాన పరిమితిని పేర్కొనడం సబబేనని, అది రాజ్యాంగ విరుద్ధం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇద్దరు కన్నా ఎక్కువ మంది పిల్లలు ఉంటే ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి అర్హులు కారంటూ రాజస్థాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనను సమర్థించింది. ఈ మేరకు గురువారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం తీర్పు చెప్పింది. రాజస్థాన్ వేరియస్ సర్వీస్ అమెండ్‌మెంట్ రూల్స్-2001లో ఇద్దరు కన్నా ఎక్కువ మంది పిల్లలు ఉంటే ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి అనర్హులన్న నిబంధన ఉంది. రాజస్థాన్ పోలీసు సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1989లోని రూల్ నెంబరు 24(4)లో కూడా 2002 జూన్ ఒకటో తేదీ తరువాత ఇద్దరు కన్నా ఎక్కువ మంది పిల్లలు కలిగిన వారు ఉద్యోగాలకు అర్హులు కారని స్పష్టంగా పేర్కొంది. ఈ నిబంధనలను సవాలు చేస్తూ రామ్‌జీ లాల్ జాట్ తొలుత హైకోర్టును ఆశ్రయించారు. 2017లో మిలటరీ నుంచి రిటైరయిన ఆయన 2018లో పోలీసు కానిస్టేబుల్ పోస్టుకు దరఖాస్తు చేశారు. అధిక సంతానం కలిగి ఉన్నారన్న కారణంతో ఆ దరఖాస్తును తిరస్కరించారు. దీంతో హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ నిబంధనలో జోక్యం చేసుకోలేమంటూ హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. దీనిపై ఆయన సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం ఈ నిబంధనలు కుటుంబ నియంత్రణను ప్రోత్సహించేవే తప్ప వివక్ష చూపేవి కాదని తెలిపింది. అప్పీలును తిరస్కరించింది.

కేసుల విచారణపై గడువు విధించలేం

» 6 నెలలు గడిచినంత మాత్రాన 'స్టే' ఆటోమేటిక్‌గా రద్దు కాదు: సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: మధ్యంతర స్టే ఉత్తర్వుల విషయమై గతంలో ఇచ్చిన తీర్పును తోసిపుచ్చుతూ గురువారం సుప్రీంకోర్టు కీలక నిర్ణయాన్ని వెలువరించింది. సివిల్, క్రిమినల్ కేసుల్లో ఇచ్చే మధ్యంతర స్టే ఉత్తర్వులు ఆరు నెలల అనంతరం ఆటోమేటిక్‌గా రద్దేమీ కావని స్పష్టంచేసింది. ప్రత్యేక పరిస్థితుల్లో మినహాయిస్తే ఫలానా సమయంలోగా కేసులు పరిష్కరించాలంటూ సుప్రీంకోర్టుగానీ, హైకోర్టుగానీ ట్రయల్ కోర్టులకు ఎలాంటి నిర్దేశాలు ఇవ్వలేవని తెలిపింది. కేసులోని అంశాల ఆధారంగా అవే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఈమేరకు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ అంశంపై 2018లో త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును తోసిపుచ్చుతూ తాజా నిర్ణయం వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ ఎ.ఎస్.ఓకా, జస్టిస్ జె.బి.పార్డీవాలా, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. ఒకే అభిప్రాయాన్ని పేర్కొంటూనే జస్టిస్ మిశ్రా, జస్టిస్ ఓకా విడివిడిగా తీర్పులు రాశారు. జస్టిస్ మిశ్ర వ్యక్తిగతంగా, జస్టిస్ ఓకా తనతోపాటు మిగిలిన ముగ్గురితరఫున తీర్పు రాశారు. ఆసియన్ రీసర్ఫేసింగ్ ఆఫ్ రోడ్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ వర్సెస్ సీబీఐ కేసుపై 2018లో త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఇస్తూ ప్రత్యేకంగా పొడిగించకపోతే ట్రయల్ కోర్టుల్లో జరిగే విచారణలపై వచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులు ఆటోమేటిక్‌గా రద్దవుతాయని తెలిపింది.

తక్కువ జాతి... కొడకా!

మామూళ్లు వసూలు చేయనంటావా?

- నిన్ను ఉద్యోగంలో లేకుండా చేస్తా..
- కానిస్టేబుల్‌పై తిరుమల ట్రాఫిక్ డీఎస్పీ బూతుపురాణం
- డీఎస్పీతో ప్రాణహాని ఉంది: ఎస్పీకి కానిస్టేబుల్ ఫిర్యాదు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్, వాచిపోయిన కాలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 29 : "మా డీఎస్పీ అక్రమంగా డబ్బులు వసూలు చేయమంటున్నారు. అలా చేయలేనన్నందుకు నాపై కక్ష కట్టారు. వేధింపులకు గురిచేస్తున్నారు. రోజుకు 16 గంటలు పనిచేయిస్తున్నారు. కులం పేరుతో దూషించారు. ఆరోగ్యం చెడిపోయి ఆస్పత్రి పాలయ్యాను. నాకు న్యాయం చేయండి" అంటూ తిరుమల ట్రాఫిక్ డీఎస్పీ కొండప్పపై ఎస్పీ మలిక గర్గ్‌కు ట్రాఫిక్ కానిస్టేబుల్ కె.లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. "తిరుమల ట్రాఫిక్ డీఎస్పీగా కొండప్ప 6నెలల క్రితం బాధ్యతలు తీసుకున్నారు. కొంతమందిని తన అనుయాయులుగా పెట్టుకుని అక్రమ వసూళ్లు ప్రారంభించారు. తిరుమలలో 22 టాక్సీ స్టాండ్లు ఉన్నాయి. ఒక్కోదానిలో 30 నుంచి 50 వరకూ వాహనాలు ఉంటాయి. ప్రతి వాహనం నుంచి నెలకు రూ.వెయ్యి చొప్పున వసూలుచేసి ఇవ్వాలి" అని డీఎస్పీ తనను ఆదేశించారని లక్ష్మీనారాయణ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ వసూళ్లు చేయలేనని చెబితే తన చాంబర్‌కు పిలిచి.. 'మీది ఏ ఊరు, మీ నాన్న ఉన్నాడా, చచ్చాడా? నీ కులం ఏందిరా?' అని అడిగారు. మాది పంబల(ఎస్సీ) కులం అని చెప్పడంతో అసభ్య పదజాలంతో దూషించారు. తక్కువ జాతి కొడకా.. నేను చెప్పిన పని చేయనంటావా... నిన్ను ఉద్యోగంలో లేకుండా చేస్తానని నోటికి వచ్చినట్టు తిట్టారు. వీడిని కంటిన్యూ డ్యూటీ చేయించండి, నాకు చెప్పకుండా సెలవు ఇవ్వొద్దంటూ కింది స్థాయి అధికారులను ఆదేశించారు. ఆయన సూచనల మేరకు వారు 8 పనిగంటలకు బదులుగా 16గంటలు నన్ను రోడ్డుపై నిలబెట్టారు. దీంతో నా ఆరోగ్యం దెబ్బతింది. కుడికాలు నరాల్లో రక్తం గడ్డకట్టి వాచిపోయి నడవలేని స్థితికి వచ్చాను. మెడికల్ లీవ్ ఇవ్వాలని డీఎస్పీని అభ్యర్థించేందుకు ఆయన ఇంటికి వెళ్లాను.. 'తక్కువ జాతి వాడివి నా ఇంటికి వస్తావా' అని దూషిస్తూ, నన్ను సస్పెండ్ చేసేవరకు వదలనని హెచ్చరించారు. నా ఆరోగ్యం మరింత విషమించడంతో నారాయణాద్రి హాస్పిటల్లో చికిత్స చేయించుకున్నానని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. 'నాకు డీఎస్పీ కొండప్ప నుంచి ప్రాణహాని ఉంది... ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయండి' అని ఎస్పీని లక్ష్మీనారాయణ కోరారు.

రాజధాని పేదలకు

ఎన్నికల పెన్షన్

- పదవీకాలం ముగిసేవేళ మరో జగన్నాటకం
- రైతుల భూముల సమీకరణతో ఉపాధి కోల్పోతున్న నిరుపేదలకు 2500 పెన్షన్ ఇచ్చిన చంద్రబాబు
- రూ.5వేలు చేస్తానని నాలుగేళ్ల క్రితం అసెంబ్లీలో జగన్ హామీ
- ఎన్నికలవేళ గుర్తొచ్చిన పేదలు.. 5వేలకు పెంచుతూ జీవో

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం రాజధాని అమరావతిలో మరో జగన్నాటకానికి తెరతీసింది. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో రాజధానివాసులను ఆకట్టుకునే ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాజధాని గ్రామాల పరిధిలో ఉండే భూమి లేని పేదలపై సరిగ్గా ఎన్నికల ముందు ప్రేమను కురిపించింది. వారిని ఆకట్టుకునేందుకు వారికి ప్రభు త్వం ఇస్తున్న రూ.2,500 పెన్షన్‌ను రూ. 5 వేలకు పెంచుతూ హడావుడిగా జీవో విడుదల చేసింది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన పింఛను మొత్తం రూ. 5వేలు మార్చి ఒకటో తేదీన అందిస్తున్నట్లు ఆ జీవోలో పేర్కొంది. వాస్తవానికి, ఇది మూడు రాజధానుల బిలు ్లను అసెంబ్లీలో ప్రవేశపెడుతూ దాదాపు నాలుగేళ్ల క్రితం ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ. గత ఎన్నికల్లోనూ ఇదే హామీని ఆయన ఇచ్చారని కొందరు చెబుతున్నారు. అయితే, ఈ హామీని ఆయన నిలబెట్టుకునే సమయానికి జగన్ పదవీకాలం కూడా ముగింపునకు చేరుకోవడం గమనార్హం. రాజధాని నిర్మాణం కోసం రైతుల నుంచి అప్పటి చంద్రబాబు ప్రభుత్వం భూము లు సమీకరించింది. మొత్తం 29 గ్రామాలకు చెందిన 29వేల మంది రైతుల నుంచి 34 వేల ఎకరాల భూములు సమీకరించింది. భూమి స్వభావాన్ని బట్టి వారికి పదేళ్లపాటు కౌలు ఇచ్చేందుకు నిర్ణయించింది. భూములు రాజధానికోసం ఇచ్చిన కారణంగా ఆ గ్రామాల్లో ఉన్న వేలాదిమంది భూమి లేని పేదలు ఉపాధి కోల్పోయే అవకాశం ఉన్నట్టు గుర్తించి.. వారికి ఉపశమనం కలిగించేలా ప్రతి నెలా రూ.2,500 పెన్షన్ ఇవ్వడం మొదలుపెట్టింది. పదేళ్లపాటు పెన్షన్ ఇచ్చేలా సీఆర్డీయే చట్టంలో పొందుపరిచింది. అయితే, పెన్షన్ మొత్తాన్ని రూ.2,500 నుంచి రూ.5వేలకు పెంచుతానని జగన్ హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని ఇన్నాళ్లుగా లబ్ధిదారులు వేడుకున్నారు. ఆందోళన చేశారు. కానీ ప్రభుత్వం మాత్రం ఒక్క రూపాయి కూడా పెన్షన్ పెంచలేదు. తీరా ఎన్నికలు సమీపించేటప్పటికి పేదలు గుర్తొచ్చి.. మరో నాటకం మొదలుపెట్టింది.

పెన్షనర్లలో భారీ కోత..

తెలుగుదేశం హయాంలో రాజధాని పరిధిలోని గ్రామాల్లో మొత్తం 21 వేలమంది భూమి లేని నిరుపేదలను లబ్ధిదారులుగా గుర్తించారు. వారికి ప్రతి నెలా పెన్షన్‌ను అందజేశారు. కానీ, జగన్ ప్రభుత్వం భారీగా కోతలు పెట్టి పెన్షనర్ల సంఖ్యను 17,200కు తగ్గించిందని రాజధాని ఉద్యమ నేతలు ఆరోపిస్తున్నారు. మూడు రాజధానుల పేరుతో గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేసిన విధ్వంసక కార్యక్రమాల కారణంగా ఉపాధి కోల్పోయిన కూలిజనం అనేక మంది ఇతర ప్రాంతాలకు వలస పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అదనుగా ప్రభుత్వం... పనుల కోసం వలసపోయినవారందరినీ అనర్హులుగా ప్రకటించి వేటు వేసింది. దీంతో దాదాపు నాలుగు వేల మంది దాదాపు నాలుగేళ్లలో పెన్షన్‌కు దూరమయ్యారు.

> 'ఎన్నికలకు ఆరునెలల ముందు టెంకాయ కొడితే అది మోసం, వంచన! అదే ఎన్నికలైపోయి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోపు టెంకాయ కొడితే అది చిత్తశుద్ధి".. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పదేపదే చెప్పే మాట ఇది! కానీ రాజధానిలోని నిరుపేదలకు పెన్షన్ పెంచుతానంటూ దాదాపు నాలుగేళ్ల క్రితం అసెంబ్లీలో ఇచ్చిన హామీని సరిగ్గా ఎన్నికలకు ముందు జగన్ నిలబెట్టుకున్నారు. అధికారంలోకి వచ్చిననాటినుంచీ రాజధానిని ధ్వంసం చేస్తూ, రైతులను వేధించుకు తింటున్న జగన్..భూమిలేని నిరుపేదలపైనా తన 'చిత్తశుద్ధి'ని ఇలా చూపించుకున్నారు!

ఏటా కౌలు వేధింపులు

రాజధాని కోసం భూములిచ్చిన 29వేల మంది రైతులకు అప్పటి ప్రభుత్వం కౌలు నిర్ణయించింది. ఈ కౌలు ప్రతి నెలా మే నెలలో రైతులకు అందజేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచీ రైతులకు కౌలు కష్టాలు మొదలయ్యాయి. హైకోర్టు తలుపు తట్టకుండా వారికి కౌలు ఇచ్చిన దాఖలాలు నాలుగున్నరేళ్లలో ఒక్కటి కూడా లేవంటే అతిశయోక్తి కాదు. కిందటేడాది మే నెలలో రావాల్సిన కౌలు ఇప్పటికీ రైతులకు దక్కలేదు. ఇప్పటికీ ఆ కేసు హైకోర్టు విచారణలోనే ఉంది.

తిరుమల ఆలయంపై ప్రయాణించిన జెట్

తిరుమల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంపై గురువారం ఓ జెట్ విమానం ప్రయాణించింది. ఆగమ శాస్త్రప్రకారం గర్భాలయ పైభాగంలో విమానాలు ప్రయాణించకూడదని టీటీడీ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా ఇటీవల ఆలయంపై తరచూ విమానాలు ప్రయాణిస్తున్నాయి. తిరుమలను నోఫ్లైయింగ్ జోన్‌గా ప్రకటించడం సాధ్యం కాదని కేంద్రం చెప్పినప్పటికీ కనీసం వీలైనంత వరకు తిరుమల క్షేత్రం మీదుగా విమానాలు ప్రయాణించకుండా చూడాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రధాన నగరాల్లో తూనికలు, కొలతలశాఖ దాడులు

అమరావతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తూనికలు, కొలతలశాఖ అధికారులు గురువారం విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు, గుంటూరు, నెల్లూరు, కడప, అనంతపురం నగరాల్లోని ఐరన్, స్టీల్ షాపులు, బియ్యం దుకాణాలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో ప్రత్యేక దాడులు నిర్వహించినట్టు పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా 154 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఈ దాడుల్లో మొత్తం 70 అధికార బృందాలు పాల్గొన్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకుందాం

- కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్



సదస్సులో మాట్లాడుతున్న మణిశంకర్ అయ్యర్

విశాఖపట్నం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించడం ద్వారా దేశాన్ని రక్షించుకుందామని కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం' అన్న అంశంపై మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన ఉత్తరాంధ్రస్థాయి ప్రాంతీయ సదస్సు గురువారం నిర్వహించారు. మణిశంకర్ అయ్యర్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలు ప్రజాస్వామ్య రక్షణ కంటే భారత రాజ్యాంగ రక్షణకు సంబంధించినవని పేర్కొన్నారు. సదస్సులో స్వరాజ్య ఇండియా పార్టీ వ్యవస్థాపకుడు యోగేంద్ర యాదవ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సీబీఐ మాజీ ఉన్నతాధికారి వీవీ లక్ష్మీనారాయణ, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల 'కిరాయి' దందా!

- లారీ అసోసియేషన్ ముసుగులో రుబాబు
- కిరాయి రూ.1.58 లక్షల నుంచి రూ.1.70 లక్షలకు పెంచాలని డిమాండ్
- తమ వల్ల కాదని ఎగుమతులు నిలిపేసిన ఎక్స్‌పోర్టర్లు
- బయటి లారీలొస్తే టైర్లు కోసేస్తామని బెదిరింపులు
- మిర్చియార్డు రోడ్డులో వేబ్రిడ్జి వద్ద టెంటు వేసుకొని మరీ మకాం

గుంటూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మిర్చి సీజన్ ఉచ్ఛస్థితికి చేరుకోవడంతో.. ఇదే అదనుగా లారీ అసోసియేషన్ ముసుగేసుకున్న కొందరు వైసీపీ నాయకులు దందాకు దిగారు. ఈశాన్య రాష్ట్రాలకు లారీ కిరాయిని పెంచాలని భీష్మించుకు కూర్చున్నారు. ఇప్పటికే ఉన్న కిరాయి బాగా ఎక్కువగా ఉందని ఎగుమతిదారులు వాపోతుంటే.. పులిమీద పుట్రలా.. తాజాగా లోడుకు రూ.12 వేల వరకు పెంచమని కోరుతుండటంతో తమ వల్ల కాదంటూ వారు చేతులెత్తేశారు. దీంతో గత ఐదు రోజుల నుంచి ఆయా రాష్ట్రాలకు ఎగుమతులు నిలిచాయి. దీని ప్రభావం మిర్చియార్డుపై ప్రత్యక్షంగా చూపిస్తోంది. తమ డిమాండ్‌కు విరుద్ధంగా బయట ఎక్కడి నుంచైనా లారీ తీసుకొచ్చి కిరాయికి పెడితే టైర్లు కోసేస్తామని కొంతమంది బెదిరింపులకు దిగుతున్నారని పేరు చెప్పడానికి ఇష్టపడని ఎక్స్‌పోర్టర్లు వాపోతున్నారు. బంగ్లాదేశ్, చైనా, తైవాన్ తదితర దేశాలకు మిర్చి ఎగుమతులు ఈశాన్య భారత దేశ రాష్ట్రాల నుంచి వెళుతుంటాయి. మిర్చియార్డుకు వచ్చే డిమాండ్‌లో దాదాపుగా 25 శాతం ఎగుమతులు ఈశాన్య రాష్ట్రాలకు జరుగుతుంటాయి. ఏ కారణం చేతనైనా ఎగుమతులు నిలిస్తే దాని ప్రభావం మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్ మార్కెట్ల నుంచి ఈశాన్య రాష్ట్రాలకు లారీ కిరాయి రూ. 1.35 లక్షలు మాత్రమే. ఆ మార్కెట్లతో పోల్చితే గుంటూరు నుంచి ఈశాన్య రాష్ట్రాలకు దూరం తక్కువైనప్పటికీ రూ.1.58 లక్షలు వసూలు చేస్తున్నారు. అది చాలదన్నట్లుగా ఇప్పుడు రూ. 1.70 లక్షలకు పెంచాలని హుకుం జారీ చేశారు. ఇప్పటికే అమలులో ఉన్న రూ.1.58 లక్షల కిరాయిని తగ్గించాలని ఎగుమతిదారులు అనేక సమావేశాల్లో కోరుతుండగా, తగ్గించకపోగా పెంచడంపై ఎగుమతిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం నాలుగైదు లారీలు ఎగుమతి చేసే పెద్ద ఎక్స్‌పోర్టర్లు ఇప్పటికే నిలిపేశారు. దీని వల్ల యార్డులో అమ్మకాలు మందకొడిగా సాగుతున్నాయి. రోజుకు 2.50 లక్షల టిక్కీలు వస్తుంటే అందులో సగం మాత్రమే విక్రయం జరుగుతున్నాయి. ఈ కారణంగా క్వింటాల్‌కు రూ. 5 వేల వరకు దేశవాళీ రకాల మిర్చి ధర పతనమైంది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ వారంలో ఎగుమతిదారులు సమావేశం ఏర్పాటు చేసుకొని ,చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. కాగా, ఎవరైనా తక్కువ కిరాయికి లారీ పెడితే అసోసియేషన్ పేరుతో కొంతమంది గుంపుగా వెళ్లి అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇందుకోసం మిర్చియార్డు రోడ్డులో ఒక వేబ్రిడ్జి వద్ద టెంటు వేసుకొని అక్కడే డ్యూటీలు వేసుకొని ఉంటున్నారు. విజయవాడ నుంచి ఎవరైనా లారీలు తీసుకొచ్చి కిరాయికి పెడితే టైర్లు కోసేస్తామని తమకు బెదిరింపులు వస్తున్నాయని లారీ యజమానులు తెలిపారు. కాగా.. ఎన్నికల కోడ్ ఎప్పుడెప్పుడు వస్తుందా, ఈ వైసీపీ నేతల పీడ ఎప్పుడు విరగడవుతుందా అని లారీ యజమానులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

చిన వెంకన్న సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు



శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న జస్టిస్ గోపాలకృష్ణారావు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 29: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి క్షేత్రాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు గురువారం ఉదయం సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని అందజేశారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

అరాచకాలే తప్ప అభివృద్ధి లేదు!

- వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించాలి
- బిడ్డల భవిష్యత్తు కోసం టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలి
- ప్రజలకు నారా భువనేశ్వరి పిలుపు
- అనకాపల్లి జిల్లాలో 'నిజం గెలవాలి' యాత్ర



అనకాపల్లి జిల్లాలో ఆర్.భీమవరంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

అనకాపల్లి/రోలుగుంట/రావికమతం/బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరాచకాలు తప్ప అభివృద్ధి లేదని, ప్రజలకు ప్రభుత్వం చేస్తున్నది ఏమీ లేదని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి విమర్శించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం అనకాపల్లి జిల్లాలో చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో పర్యటించారు. గతేడాది చంద్రబాబు అక్రమ అరెస్టుతో తీవ్రమనస్తాపానికి గురై మరణించినవారి కుటుంబాలను ఆమె పరామర్శించారు. రోలుగుంట మండలం జేపీ అగ్రహారంలో సుర్ల దేముడమ్మ, కొవ్వూరులో యర్రంశెట్టి సత్యనారాయణ, బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరంలో అప్పలబత్తుల అయ్యన్నాచారి, రావికమతం మండలం గంపవానిపాలెంలో పెద్దిమ్మ, మునగపాక మండలం అరబుపాలెంలో బడ్డేడ నాయుడు, వాడ్రాపల్లిలో ఉల్లూరి అప్పలనరస, ఊల్లూరి మంగయ్యమ్మ, గొల్లలపాలెంలో మొల్లి అప్పలనరస కుటుంబాలను ఓదార్చి, రూ.3 లక్షలు చొప్పున ఆర్థిక సాయం చెక్కులు అందజేశారు. వారి కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా రోలుగుంట మండలం కొవ్వూరులో ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలకులు ఆధారాలు లేకుండా చంద్రబాబుపై కేసులు పెట్టి, అక్రమంగా అరెస్టు చేసి, 53 రోజులు జైల్లో ఉంచారని, తొలుత రూ.3 వేల కోట్ల అవినీతి జరిగిందన్నారని, తరువాత రూ.300 కోట్లని, చివరిగా రూ.27 కోట్లని మాటమార్చి, అది కూడా నిరూపించలేకపోయారని తెలిపారు. గత ప్రభుత్వాలు కూడా చంద్రబాబుపై పెట్టిన కేసుల్లో ఒక్కటి కూడా నిరూపించలేకపోయాయని, చంద్రబాబు నిజాయతీకి ఇదే నిదర్శనమని వివరించారు. చంద్రబాబు నిరంతరం ప్రజల సంక్షేమం గురించే ఆలోచిస్తుంటారని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచాలన్నదే ఆయన ఆలోచన అన్నారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి పనులు చంద్రబాబు హయాంలో పరుగులు తీయగా, వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం తీరుతో అనేక మంది పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారని చెప్పారు. వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రం, ప్రజలు విముక్తి పొందాలంటే ప్రతి ఒక్కరూ సేవ్ ఆంధ్రా, సేవ్ డెమొక్రసీ నినాదంతో ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. ఒక తరం భవిష్యత్తును వైసీపీ పాలకులు నాశనం చేశారని, జగనాసుర పాలనకు మహిళలు తమ శక్తిని చూపించే తరుణం ఆసన్నమైందని చెప్పారు. పిల్లల, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని టీడీపీ-జనసేన కూటమికి ఓటు వేసి, వైసీపీ రాక్షస పాలనకు చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త మరో పది మందితో టీడీపీకి ఓట్లు వేయించాలన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో జగన్‌కు గుణపాఠం చెప్పాలి

- చంద్రబాబు హయాంలోనే దివ్యాంగులకు న్యాయం
- విభిన్న ప్రతిభావంతుల సింహగర్జన సభలో గోనుగుంట్ల కోటేశ్వరరావు



విభిన్న ప్రతిభావంతుల సింహగర్జన సభలో మాట్లాడుతున్న దివ్యాంగురాలు

కర్నూలు (అర్బన్), ఫిబ్రవరి 29: దివ్యాంగులను చిన్న చూపు చూస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర విభాగం గౌరవాధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో గురువారం విభిన్న ప్రతిభావంతుల సింహగర్జన సభ నిర్వహించారు. ఈ సభకు వివిధ జిల్లాల నుంచి వేలాది మంది దివ్యాంగులు తరలివచ్చారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ... గతంలో చంద్రబాబు అడక్కపోయినా విభిన్న ప్రతిభావంతులకు ఎన్నో సంక్షేమ పథకాలు ఇచ్చి ఆదుకున్నారన్నారు. కానీ నేడు ధర్నాలు, ఆందోళనలు చేసినా తమ ఆవేదనను పట్టించుకునే వారే కరువయ్యారని వాపోయారు. గతంలో రూ.500 ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.3వేలకు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జగన్ ప్రభుత్వం దివ్యాంగులను అన్ని రకాలుగా మోసం చేసిందన్నారు. విభిన్న ప్రతిభావంతుల పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని, దివ్యాంగులకు ఇంటి స్థలం ఇచ్చి, గృహ నిర్మాణాలు చేపట్టాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

హిమాచల్ చల్లబడినట్టేనా?

రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి అనుకూలంగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి, కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మనుసింఘ్వీ పరాజయానికి కారకులైన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలమీద హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ గురువారం అనర్హతవేటు వేశారు. రాష్ట్ర బడ్జెట్ ఓటింగులో విప్‌కు అనుగుణంగా వ్యవహరించని నేరంపై వారికి ఈ శిక్షపడింది. ఈ చర్యతో అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య 68నుంచి 62కు తగ్గింది, కాంగ్రెస్ బలం 34, ముగ్గురు స్వతంత్రులతో కలిపి బీజేపీ బలం 28అయింది. పతనం అంచుకు జారుకున్న హిమాచల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అనర్హత నిర్ణయం తరువాత ప్రస్తుతానికి ఓ పెద్ద గండంనుంచి బయటపడింది. స్పీకర్ స్థానంలో అస్మదీయులున్నప్పుడు అధికారపక్షాలకు ఎన్నెన్నో లాభాలుంటాయి మరి.

ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ ప్రభావం అభిషేక్ మనుసింఘ్వీ ఓటమికి మాత్రమే పరిమితం కాలేదు. వారి చర్యతో ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సభలో మెజారిటీ కోల్పోయిందని, ఆయన సభావిశ్వాసాన్ని నిరూపించుకోవాల్సిందేనని బీజేపీ డిమాండ్ చేసింది. కానీ, బుధవారం బడ్జెట్ ప్రవేశపెడుతున్న క్రమంలో పదిహేనుమంది బీజేపీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం, మర్నాడు ఈ ఆరుగురిమీదా ఆర్థికబిల్లుపై ప్రభుత్వానికి అనుకూలంగా ఓటుచేయలేదన్న ఆరోపణతో అనర్హతవేటువేయడం ద్వారా కాంగ్రెస్ తనకు అనుకూలంగా పరిస్థితిని మార్చుకుంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా జారీ చేసిన విప్‌ను ధిక్కరించినందుకు పార్టీ ఫిర్యాదుమేరకు స్పీకర్ వారిపై ఈ చర్య తీసుకున్నారు. ఈ ఆరుగురితోపాటు ఇంతకాలం కాంగ్రెస్‌కు అండగా ఉన్న ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులను కూడా బీజేపీ తనవైపు తిప్పుకోవడంతో సభలో దాని బలం పాతికనుంచి 34కు పెరిగి, కాంగ్రెస్ సరిసమానమైపోయిన విషయం తెలిసిందే. ఓట్లను ఇలా సమానం చేసి, ఆ తరువాత లక్కీడ్రా ముందుకు తెచ్చి తన రాజ్యసభ అభ్యర్థి హర్ష్ మహాజన్‌ను బీజేపీ గెలిపించుకుంది. అప్పటివరకూ 43మందితో నిక్షేపంగా ఉన్న కాంగ్రెస్ తన అభ్యర్థి ఓటమితో పాటు, ప్రభుత్వాన్నే కోల్పోయే ప్రమాదంలోకి జారుకుంది.

ప్రస్తుతానికి సమస్యనుంచి గట్టెక్కినా, ఉన్నవారిని నిలబెట్టుకుంటూ ఎవరూ జారిపోకుండా జాగ్రత్తపడుతూ కాంగ్రెస్ ఎంతకాలం నెట్టుకురాగలదన్నది అసలు ప్రశ్న. కర్ణాటక శివకుమార్, చత్తీస్‌గఢ్ భూపేష్‌భగల్, హర్యానా హుడా సహా చాలామంది కాంగ్రెస్ పెద్దలు, మేధావులు గురువారం శిమ్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో చర్చోపచర్చలు జరిపారు. సంక్షోభం సమసిపోయిందనీ, అంతా సవ్యంగా ఉన్నదని ప్రకటించారు. ముఖ్యమంత్రి సుఖూను మార్చాలన్న డిమాండ్ బలంగా ఉన్నా, ఆ పనిచేస్తే ఈసారి తిరుగుబాటు ఆయన వర్గంనుంచి వస్తుంది కనుక ప్రస్తుతానికి కొనసాగింపే శ్రేయస్కరమన్నది పర్యవేక్షకుల వ్యాఖ్యల సారాంశం. ఆరుసార్లు హిమాచల్ ముఖ్యమంత్రిగా పనిచేసిన వీరభద్రసింగ్ భార్య ప్రతిభాసింగ్ వర్గానికి, ముఖ్యమంత్రి సుఖూ వర్గానికి మధ్య నిరంతరపోరు పార్టీని ముంచుతోంది. మంత్రిగా ఉన్న ఆమె కుమారుడు సైతం ఇప్పుడు తన రాజీనామా విషయంలో రాజీపడినట్టుగా వార్తలు వస్తున్నాయి. కానీ, నేను బాహుబలిని అని నిరూపించుకోవడానికి గురువారం ముఖ్యమంత్రి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అల్పాహారానికి పిలిస్తే 31మంది మాత్రమే వచ్చారట.

అసెంబ్లీలో ఎంత బలం ఉన్నా, కాంగ్రెస్ నిద్రమత్తులోనే ఉంటుంది, ఇటువంటి ప్రమాదాలు వచ్చిపడుతూనే ఉంటాయి అంటూ సీపీఎం పత్రిక గురువారం ఓ వ్యాఖ్య చేసింది. బీజేపీ అవినీతికరమైన చర్యలను తప్పుబడుతూనే, పార్టీలో అంతర్గతవైరుధ్యాలను, లుకలుకలను పరిష్కరించడంలో కాంగ్రెస్ అధినాయకత్వం విఫలమవుతున్నదని అది వ్యాఖ్యానించింది. హిమాచల్‌లో పరిస్థితులు సవ్యంగా లేనందునే సోనియాగాంధీని రాజస్థాన్‌నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ పంపిందని వార్తలు వచ్చాయి. అభిషేక్‌మను సింఘ్వీ పరాజయం, ప్రభుత్వం పతనమయ్యే ప్రమాదం, ఒక మంత్రి రాజీనామా వంటి తీవ్ర పరిణామాలతో కానీ కాంగ్రెస్ అధినాయకత్వం సంక్షోభనివారణకు దిగకపోవడం విచిత్రం. పార్టీలో అంతర్గత పోరు కర్ణాటక, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు బీజేపీ పరం కావడానికి ఉపకరించింది. ఇప్పుడు ఉత్తరభారతంలో హిమాచల్ మాత్రమే కాంగ్రెస్ చేతిలో మిగిలింది. 2022లో బీజేపీని ఓడించి మంచి ఆధిక్యతతో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ పదిహేనునెలల్లోనే ప్రజలు అప్పగించిన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి అష్టకష్టాలూ పడుతోంది.

'రాప్తాడు'తో రగులుతున్న రాయలసీమ

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి కుమారుడు కాకుంటే రాజకీయంగా జీరో. రాయలసీమలో మరీనూ. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ధనయజ్ఞం సాగించారా లేక జల యజ్ఞం మొదలు పెట్టారా అన్న వివాదాస్పద అంశాలు పక్కన బెడితే మిగులు జలాలతో ప్రతిపాదించబడి దస్త్రాలకే పరిమితమైన రాయలసీమకు చెందిన పలు సాగునీటి ప్రాజెక్టులను పట్టాలెక్కించారు.

ఈ రోజుకూ గొంతెండిపోతున్న రాయలసీమ ప్రజల మనోభావాల్లో దివంగతుడై ఏళ్లు గడుస్తున్నా జల యజ్ఞం ద్వారా రాజశేఖరరెడ్డి సముచితం స్థానం పొందారు. రాయలసీమలో రాజశేఖర రెడ్డి పరపతే జగన్మోహన్ రెడ్డికి ఆలంబన అయింది. పరోక్షంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం జగన్మోహన్ రెడ్డి రాజకీయాలకు ఊపిరి లూదింది. రాజశేఖర రెడ్డి బిడ్డగా పాదయాత్ర సమయంలోనూ 2019 ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాలు సీమ ప్రజలు అమాయకంగా నమ్మారు. అయితే ఈ రోజు మోస పోయామని వగస్తున్నారు. మిగతా ప్రాంతాలకు భిన్నంగా రాయలసీమకు రాజశేఖర రెడ్డితో అనుబంధానికి ప్రాతిపదిక లేకపోలేదు. తరతరాలుగా రాయలసీమ వాసుల డియనఏలోనే నీటి తపన ఇమిడి వుంది. ఉపాధి కోసం లేక పట్టెడన్నం కోసం వలసలు పోవడం ఎరుగుదుం. అయితే రాయలసీమలో ఆఖరుకు గుక్కెడు తాగునీటి కోసం వలస బాట పట్టిన సందర్భాలున్నాయి.

కొన్ని చారిత్రక తప్పిదాలతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, అవశేష ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రాంతీయ అసమానతలు ఉన్నాయి. కాని రాయలసీమ ఇతర ప్రాంతాలకు భిన్నమైనది. ఎవరినైనా కదపండి. ముందు నీళ్ల గురించి వాపోతారు. బాగా వెనుకబడిన ఉత్తరాంధ్ర వాసులను కదిపితే నిరుపయోగంగా వున్న సముద్ర తీరం గురించి చెబుతారు. సామాజిక భౌతిక నైసర్గిక పరిస్థితులు ఇందుకు కారణం. రాయలసీమ పురోగతిని దృష్టిలో పెట్టుకొనే 1937 లో జరిగిన శ్రీ బాగ్ ఒడంబడికలో విద్యతో పాటు సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఆ కోవకు చెంది కృషి చేసిన రాజశేఖర రెడ్డి పరపతితో ఈ రోజు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం దక్కించుకున్నారు.

ఇంత కథనం ఎందుకంటే ఏ పునాదుల మీదైతే జగన్మోహన్ రెడ్డి ఆకాశ హర్మ్యాలు నిర్మించుకున్నారో ఇటీవల రాయలసీమ నడి బొడ్డున అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన 'సిద్ధం' ఎన్నికల సభలో వాటి ఛాయలు లేకుండా పునాదులతో సహా పెకలించి వేసి తన మార్క్ కొత్త రాజకీయం తెర మీదకు తెచ్చారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మచ్చుకు మాట మాత్రంగా కూడా రాప్తాడు సిద్ధం సభలో రాయలసీమ వాసుల చిరకాల వాంఛితమైన సాగునీటి ప్రాజెక్టుల గురించి ఒక్క ముక్క కూడా మాట్లాడ లేదు. అయిదేళ్ల కాలంలో రెండున్నర లక్షల కోట్లు పంపిణీ చేశానని చెప్పుకొచ్చారు. ఒక విధంగా క్రమేణా రాజశేఖర రెడ్డి ప్రాభవం నుండి బయటపడుతూ స్వంత ఇమేజ్ సృష్టికి శ్రీకారం చుట్టారేమోననిపిస్తోంది. ఈ క్రమంలోనే తనకు రాజకీయ జీవితం ప్రసాదించిన తండ్రి రాజశేఖర రెడ్డి వారసత్వానికే కాకుండా రాయలసీమ సమాజానికీ నిస్సిగ్గుగా వెన్నుపోటు పొడిచారు. పాదయాత్ర సమయంలోనూ, 2019 ఎన్నికల ప్రచారంలో తను చేసిన హామీలను కట్ట గట్టి అటకెక్కించారు. ఇది జగన్మోహన్ రెడ్డికి అనివార్యం కూడా. రాయలసీమ నడిబొడ్డున జరిగిన రాప్తాడు సిద్ధం సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి యధాలాపంగా సాగునీటి ప్రాజెక్టుల గురించి ప్రస్తావించ లేదని భావించేందుకు ఆస్కారం లేదు. ఒక పద్ధతి మేరకే దూరాలోచనతో స్వంత ఇమేజ్ పెంచుకొనేందుకు ఆ తరహా ప్రసంగం సాగించారనేందుకు ప్రాతిపదిక వుంది.



> రాప్తాడులో జరిగిన సిద్ధం ఎన్నికల సభలో ముఖ్యమంత్రి జగన్ తన మార్క్ కొత్త రాజకీయం తెర మీదకు తెచ్చారు. సీమ వాసుల చిరకాల వాంఛితమైన సాగునీటి ప్రాజెక్టుల గురించి ఆ సభలో ఆయన ఒక్క ముక్క కూడా మాట్లాడ లేదు. ఒక విధంగా క్రమేణా రాజశేఖర రెడ్డి ప్రాభవం నుండి బయట పడుతూ స్వంత ఇమేజ్ సృష్టికి శ్రీకారం చుట్టారేమోననిపిస్తోంది.

రాప్తాడు సభ జరిగిన పక్షం రోజుల్లోనే చిత్తూరు జిల్లా కుప్పంలో చంద్రబాబు నాయుడును కట్టడి చేసేందుకు హంద్రీనీవా జలాలు విడుదలకు సిద్ధం సభ నిర్వహించారు. ఇందుకు చేపట్టిన చర్యలు అతి క్రూరమైనవి. హంద్రీనీవా ఎత్తిపోతలు ద్వారా 40 టియంసిల నీళ్ళు తరలించ వలసి వుండగా దాదాపు పాతిక టియంసిలు మాత్రమే ఈ ఏడు తరలించారు. పైగా కర్నూలు, అనంతపురం జిల్లాల్లో హంద్రీనీవా ప్రాజెక్టు 400 కిలోమీటర్ల కాలువ వెంబడి రైతులు వేసిన పంటలు ఎండి పోతున్నా వారిని చుక్క నీరు తీసుకోనీయకుండా కట్టడి చేశారు. గత నెల రోజులుగా ఈ ప్రాంత రైతులు తమ పంటలు ఎండి పోతున్నాయని ఆందోళన చేసినా పట్టించుకున్న వారు లేరు. తుదకు రాప్తాడు సిద్ధం సభ సమయంలో అనంతపురం జిల్లా రైతులు నిరసనలకు దిగారు. కాని కుప్పం వరకు నామమాత్రంగా నీళ్లు తీసుకెళ్లి లాకులెత్తి నీళ్లు వదిలారు. ఈ ఎన్నికల స్టంట్ ముగింపునకు కాలువ ముంగిట వున్న రైతులను బలి పశువులను చేశారు. పైగా రెండు జిల్లాల ప్రజలు మధ్య వైషమ్యాలకు బీజం వేశారు. ఫిబ్రవరి 24వ తేదీకి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 816 అడుగులకు పడిపోయి కేవలం జలాశయంలో 38 టియంసిలు మిగిలాయి. పంపింగ్ చేసే అవకాశం లేదు. తుదకు కుప్పం లోనూ పంటలకు నీరు ఇచ్చే అవకాశం లేదు. కేవలం రాజకీయ దురద మాత్రం తీర్చుకున్నారు. సద్వినియోగం కావలసిన నీరు పారుదల నష్టం కింద పోయింది. ఇంతటి విపత్కర పరిస్థితిలో కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వేలాది రైతుల పొట్ట గొట్టి కుప్పంకు నీటి తరలింపునకు జగన్మోహన్ రెడ్డి సిద్ధ పడ్డాడంటే ఎంతటి గుండెలు తీసిన బంటు అయి వుండాలి! ముఖ్యమంత్రి సభ పూర్తి కాగానే మొత్తం కట్ట కట్టేస్తారు. ఈ చర్య రాయలసీమకు వెన్నుపోటు కాదా?

నాణేనికి మరో వేపు నిలువునా గొంతు కోసే విధంగా వుంది. గత అయిదేళ్ల ముచ్చట పక్కన పెట్టినా మున్ముందు అయినా తను పాదయాత్ర చేసిన సమయంలో చేసిన హామీలు వాగ్దానాల గురించి సిద్ధం ఎన్నికల సభల్లో పునశ్చరణ చేస్తారని నమ్మి ఆఖరుకు హతాశులు కావడం సీమవాసుల వంతైనది. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో రాయలసీమలోని పలు ప్రజా సంఘాలు వచ్చే ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల్లో రాయలసీమ వెనుకబాటుతనం నివారణకు కీలక మైన సాగునీటి ప్రాజెక్టుల అంశం పొందు పర్చాలనే ఉద్యమం చేపట్టాయి. ఈ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. రాయలసీమలోని పలు కేంద్రాల్లో యువకులు, రైతు నేతలు చురుగ్గా పాల్గొన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు నేతలతో సహా అన్ని పార్టీల వారికి విజ్ఞాపనలు ఇస్తున్న దశలో ముఖ్యమంత్రి రాప్తాడు సభ ప్రసంగంలో ఈ అంశాలు మాట మాత్రంగా రానీయకపోవడం శరాఘాతంగా మిగిలింది. కేవలం సంక్షేమ పథకాలే తన ప్రాధాన్యాలుగా వెల్లడించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు రాయలసీమ పురోగతికి కూడా అన్ని రోగాలకు జిందాతిలిస్మాత్ అన్నట్లు తను పంపకం చేసిన రెండున్నర లక్షల కోట్లు పథకాలు చాలన్నట్లు ప్రసంగం సాగించారు. ఫలితంగా రాయలసీమకు ప్రత్యేక అస్తిత్వాన్ని కోరే వారంతా రాప్తాడు సభ తర్వాత రగిలి పోతున్నారు. ఇందులో మరో ట్విస్ట్ కూడా వుంది. తెలుగుదేశం హయాంలో తీవ్ర అన్యాయం జరిగిందని చాలామంది కాలికి బలపం కట్టుకుని నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జగన్మోహన్ రెడ్డి ఒరగ బెడతారని ఆయన గెలుపే తమ గెలుపుగా భావించి 2019 ఎన్నికల్లో పని చేశారు. మంచు తెరలు తొలగి పోవడానికి ఎక్కువ కాలం పట్టలేదు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోనికి వచ్చిన రెండు సంవత్సరాలకే సీమలో జగన్మోహన్ రెడ్డి పర్యటన వుంటే ప్రతిపక్షాల వారితో పాటు ఇట్టి వారి ఇళ్లకు పోలీసులు హాజరై పహరా చేపట్టారు. మరీ ఒక నేత అయితే కుయ్యో మొర్రో అంటూ ఇంతలోనే తనకు ఈ దుర్గతి పడుతుందని ఊహించ లేదని అంతిమంగా జిల్లా పరిషత్ ఛైర్మన్ సిఫార్సుతో ఇంటి వద్ద గల పోలీసుల నుండి బయట పడి ముఖ్యమంత్రికి బారికేడ్ల ఆవల నుండి మెమోరాండం ఇచ్చుకున్నారు. మొన్న రాప్తాడు సిద్ధం సభ ముందు రోజు కూడా 2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి కోసం పని చేసిన వారి ఇళ్ల వద్ద పోలీసులు ప్రత్యక్షమైనారు. బొజ్జా దశరథరామి రెడ్డిని అయితే తెలుగుదేశం హయాంలో కేసు నమోదు అయిందని చెప్పి ఏకంగా అరెస్టు చేశారు. వీరంతా టీడీపీ వారు కానే కాదు. నిజాయితీగా సీమ అస్తిత్వం కోరే వారే. ఇలాంటి వారే తుపాకి నీడలో వుండాల్సి వస్తే రాయలసీమలో సాధారణ పౌరులు ఎంత మంది బలౌతున్నారో. ప్రస్తుతం రాయలసీమలో అనూహ్యమైన నిశ్శబ్దం నెలకొన్నది. ఒక్కటి మాత్రం నిజం. ఇది తుఫాను ముందు నెలకొనే ప్రశాంతత మాత్రమే.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

ఖర్చుదారీ సేద్యం కష్టాలు తీరేదెన్నడు?

'పొలంలో హలంతో రైతు /నిలుస్తా డివాళా రేపు'— ఇది, అన్నదాత మనుగడపై ఒక మహాకవి వ్యక్తం చేసిన నిండు విశ్వాసం. అయితే రైతులు ఇప్పుడు ఎల్లెడలా పొలంలో హలంతో నిలబడలేకపోతున్నారు. అలా నిలబడేందుకే వారు పొలాలు, పల్లెలు వదిలి తమ 'భాగ్య విధాతలు' ఉండే నెలవులకు మూకుమ్మడిగా కదులుతున్నారు. జరుగుతున్న అన్యాయాలపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే, సముద్రాల ఆవల ఐరోపాలోను, మన దేశంలోను ఇప్పుడు చోటు చేసుకొంటున్నది. దేశ రాజధాని న్యూఢిల్లీ బాట పట్టిన అన్నదాతలు తమ ట్రాక్టర్లతో హైవేలను దిగ్బంధం చేస్తున్నారు. వ్యవసాయ వ్యయాలు విపరీతంగా పెరిగిపోయాయి.. వాటికి తోడు వాతావరణ వైపరీత్యాలు అను నిత్యం కల్లోల పరుస్తున్నాయి. పంటపండించిన రైతుకే తిండిలేకుండా పోతున్న దుస్థితి దాపురించింది. కనుక సాగు వ్యయాలు తిరిగి దక్కేలా తమ ఫలసాయానికి చట్టబద్ధమైన కనీస మద్దతు ధర ఇవ్వాలని అన్నదాతలు ఆక్రోశిస్తున్నారు.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

వాతావరణ మార్పు వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలలో ప్రవేశపెట్టిన కొత్త చట్టాలు అక్కడ రైతులను ఆందోళనకు పురిగొల్పాయి. ఆ కొత్త చట్టాల ప్రకారం క్రిమిసంహారక మందుల వాడకాన్ని సగానికి, ఎరువుల వినియోగాన్ని 20 శాతం మేరకు తగ్గించాలి. సేంద్రియ సాగు ఉత్పత్తులను రెట్టింపు చేయాలి. వ్యవసాయేతర ఉపయోగాలకు, ముఖ్యంగా జీవ వైవిధ్య పరిరక్షణకు మరింత భూమిని వదిలివేయాలి. ఇందుకు అదనంగా నత్రజని కారక కాలుష్యాన్ని నివారించేందుకు పశుగణాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవాలని నెదర్లాండ్స్ సంకల్పించుకోగా శిలాజ ఇంధనమైన డీజిల్‌పై ఇస్తున్న సబ్సిడీని తగ్గించుకోవాలని జర్మనీ నిర్ణయించింది. వాతావరణ మార్పుతో మనుగడ ముప్పు నెదుర్కొంటున్న ప్రపంచం ప్రస్తావిత చర్యలను తీసుకోవడం అనివార్యమయింది.

యూరోపియన్ దేశాలలో వ్యవసాయ రంగం, ప్రపంచ వ్యాప్తంగా ఇతర ఖండాలలో వలే, హరిత గృహ వాయువుల ఉద్గారాలకు పెద్ద ఎత్తున కారణమవుతోంది. ఐరోపాలో వార్షిక ఉద్గారాలలో పదో వంతు వ్యవసాయ రంగానివే కావడం గమనార్హం. ఈ ఉద్గారాలను తగ్గించేందుకు అయ్యే వ్యయాలు యూరోపియన్ సంపన్న రైతులకు భరించరానివే అయినప్పుడు కేవలం జీవనాధార వ్యవసాయం చేస్తున్న ఆసియా, ఆఫ్రికా దేశాల రైతులు ఆ వ్యయాలను ఎలా భరించగలుగుతారు? అధునాతన సేద్య తీరుతెన్నులన్నీ యూరోపియన్ వ్యవసాయ రంగంలో మనకు కన్పిస్తాయి. భారీ సబ్సిడీల ఆలంబనగా ఆ వ్యవసాయం వర్థిల్లుతోంది. 1962 నుంచి యూరోపియన్ యూనియన్ ఉమ్మడి వ్యవసాయ విధానం రైతులకు విశేషంగా ఆర్థిక తోడ్పాటును సమకూరుస్తోంది. అయితే దీనిపై పలు విమర్శలు రావడంతో ఆ ఆర్థిక మద్దతును గణనీయంగా తగ్గించడం అనివార్యమయింది.

నేడు యూరోపియన్ యూనియన్ దేశాలు వ్యవసాయ రంగానికి సమకూరుస్తున్న ఆర్థిక మద్దతు ఈయూ బడ్జెట్‌లో 40 శాతం మేరకు ఉంటోంది. ఈ సహాయాన్ని రైతులకు నేరుగా చెల్లిస్తున్నారు. యూరోపియన్ కమిషన్ సమాచారం ప్రకారం ప్రతి రైతూ 2021లో 6700 యూరోలు (ఇంచుమించు రూ.50 వేలు) నేరుగా అందుకున్నాడు. ఈ సహాయంతో పాటు వ్యవసాయరంగ అభివృద్ధికి పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడం కూడ జరుగుతోంది.. అనేక సంవత్సరాలుగా వ్యవసాయ 'స్వరూప స్వభావాలు' మారుతూ వస్తున్నాయి. వ్యవసాయ కమతాలు విస్తీర్ణంలో పెరుగుతున్నాయి. మరింతగా సమీకృతమవుతున్నాయి. ఉత్పాదకాల ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో చిన్న రైతుల మనుగడ కష్ట సాధ్యమవుతోంది.

సాగు వ్యయాలు పెరిగిపోవడంతో పెద్ద రైతుల సైతం రుణగ్రస్తులు అవుతున్నారు. పైరు సగటు దిగుబడి పెరుగుదల లక్ష్యంగా సేద్యం జరుగుతోంది. ఇందుకు రసాయన ఎరువులను మరింతగా వినియోగించడం అనివార్యమవుతోంది. దీనికి తోడు వాతావరణ అవ్యవస్థతో పంటల సాగు ఖర్చులు తడిపిమోపెడవుతున్నాయి. పెరిగిన సాగు వ్యయాలలతో పాటు మరో రెండు వాస్తవాలను తప్పక ప్రస్తావించి తీరాలి. అవి : ఒకటి— ఆహార వినియోగ ధరలను అదుపులో పెట్టవలసిన ఆవశ్యకత; రెండు— వాతావరణ వైపరీత్యాలతో పంట నష్టాలు పెరిగిపోవడం. అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో సైతం ఆహార ధరలు అందరికీ అందుబాటులో ఉండడం లేదన్నది ఒక కఠోర వాస్తవం. అంతకంటే ముఖ్యమైన వాస్తవం ఆ దేశాలలో పర్యావరణ సమతౌల్యత తీవ్రంగా దెబ్బ తింటోంది.

దేశ రాజధాని ఢిల్లీ ముంగిట నిరసనలు తెలుపుతున్న రైతులు తమ పంట దిగుబడులకు అధిక కనీస మద్దత ధర (ఎమ్ఎస్‌పి)ను డిమాండ్ చేస్తున్నారు. సంపన్న యూరోప్‌లో రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లనే వీరూ ఎదుర్కొంటున్నారు. అయితే ఆహార ధాన్యాల సాగు విషయంలో యూరోపియన్ రైతులకు లభిస్తున్నట్టుగా భారతీయ రైతులకు ప్రభుత్వాల నుంచి ఎటువంటి ఆర్థిక మద్దతు లభించడం లేదు. దేశ ప్రజానీకానికి ఆహారాన్ని సమకూర్చేందుకై రైతుల నుంచి ఆహారధాన్యాలను ప్రభుత్వం సేకరించివలసివున్నది. ధరలను నియంత్రించేందుకు ఇది తప్పనిసరి ; ఆహార ధరల పెరుగుదలను ఎవరు కోరుకుంటారు? వినియోగదారులు ఎవరూ కోరుకోరు కదా. ఖర్చులు భరించేందుకు రైతులు ఒక పక్క ఇబ్బంది పడుతుండగా మరో పక్క వాతావరణ వైపరీత్యాలు, చీడ, తెగుళ్ల మూలంగా ఆర్థిక నష్టాలు, ఇతర చిక్కులకు లోనవుతున్నారు.

ఆహార ధరల పెరుగుదలను అరికట్టేందుకు చౌక దిగుమతులపై ఆధారపడాలి. వీటి వల్ల ధరలు తగ్గుతాయి. నిజమే. అయితే తమ ఉత్పత్తులకు సరైన ధర లభించక పోతే రైతులు నష్ట పోతారు. ఈ పరిస్థితుల్లో భూసార పెంపుదల, నీటి సదుపాయాల మెరుగుదల, జీవ వైవిధ్య పరిరక్షణకు రైతులు ఏమీ ఖర్చు చేయలేరు ఈ సమస్యను అధిగమించడమెలా అంటే పర్యావరణ భద్రతలకు అయ్యే వ్యయాలను మినహాయించుకోవడమే..వ్యవసాయం లాభదాయకంగా ఉండాలంటే ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరమున్నదని రైతులకు చెబుతున్నారు. అయితే విత్తనాలు, ఎరువుల మొదలైన ఉత్పాదకాల వ్యయం తక్కువేమీ కాదు కదా. కనుక రైతులు అధిక ఖర్చులను భరించవలసిస్తోంది. ఖర్చులకు తగ్గ ఆదాయం వారికి లభించడం



> ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరమున్నదని రైతులకు చెబుతున్నారు. విత్తనాలు, ఎరువుల మొదలైన ఉత్పాదకాల వ్యయం తక్కువేమీ కాదు. ఫలితంగా రైతులు పంటల సాగుకు అధిక ఖర్చులను భరించవలసి వస్తోంది. ఖర్చులకు తగ్గ ఆదాయం వారికి లభించడం లేదు. జనాభాలో అత్యధికులకు ఆహారం చౌకగా అందుబాటులో ఉండాల్సిన దేశంలో అధిక వ్యయాలతో కూడిన వ్యవసాయం అర్థవంతమైన, లాభదాయకమైన కార్యకలాపం కాదు, కాబోదనేది కూడా విస్మరించకూడని సత్యం.

లేదు. జనాభాలో అత్యధికులకు ఆహారం చౌకగా అందుబాటులో ఉండాల్సిన దేశంలో అధిక వ్యయాలతో కూడిన వ్యవసాయం అర్థవంతమైన, లాభదాయకమైన కార్యకలాపం కాదు, కాబోదనేది కూడా విస్మరించకూడని సత్యం.


ఐరోపాలో ఇచ్చిన స్థాయిలో మన దేశంలో రైతులకు సబ్సిడీలు ఇవ్వడం సాధ్యంకాదు. పెద్ద మొత్తంలో రైతులకు ఆర్థిక మద్దతు సమకూర్చడం సాధ్యంకాదనేది స్పష్టమే. సాగు వ్యయాలను తగ్గిస్తూనే రైతులకు ఆర్థిక లబ్ధి సమకూర్చడమెలా అనే విషయమై మనం చర్చించవలసి ఉన్నది. ఇక్కడే పునరుత్పాదక లేదా సహజ సేద్యం ప్రాధాన్యాన్ని గుర్తించవలసివున్నది. అయితే ఇందుకు పటిష్ఠ, ప్రగతిశీల విధాన నిర్ణయాలు, చిత్త శుద్ధితో వాటిని అమలుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

అన్ని ప్రాంతాలలోను ఆహార సేకరణకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తగు విధానాలను రూపొందించి, అమలుపరచడం కూడా ఎంతైనా అవసరం. తద్వారానే రైతుల ఉత్పత్తులకు మంచి మార్కెట్ సదుపాయం లభిస్తుంది. మధ్యాహ్న భోజన పథకానికి ఒడిషా ప్రభుత్వం చిరుధాన్యాలను సేకరిస్తోంది. ఇది రైతులకు విశేషంగా మేలు చేస్తుందనడంలో సందేహం లేదు.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

నిష్పాక్షికత లోపించిన చరిత్ర

చరిత్ర అంటే భూతకాలంలో ఏం జరిగిందో తెలియజెప్పే శాస్త్రం. అలాంటి చరిత్ర పరిశోధన నిష్పక్షపాతంగా జరగాలి. ఏదో ఒక సిద్ధాంతానికి లోబడి చేసే పరిశోధన నిష్పాక్షిక పరిశోధన అవ్వదు. ముఖ్యంగా భారతదేశ చరిత్ర పరిశోధన విషయానికి వస్తే, నిష్పక్షపాతంగా, ఏ సిద్ధాంతానికీ లోబడకుండా పరిశోధన చేసిన వారు తక్కువే. భారతదేశ చరిత్ర రచనలో మార్క్సిస్ట్ ధోరణితో రచన చేసిన చరిత్రకారులు ఒకవైపు ఉంటే, పురాణాలను యథాతథ చరిత్రగా అభివర్ణించేవారు మరొకవైపు ఉన్నారు. ఇంకోవైపు పాశ్చాత్యులు తమదైన దృక్పథంతో చేసిన చారిత్రక రచనలు, తీర్మానాలు భారతదేశ చరిత్ర పరిశోధనపై మిశ్రమ ఫలితాలు చూపించాయి. మరీ ముఖ్యంగా ప్రాచీన భారతదేశ చరిత్ర గురించి పాశ్చాత్యులు చేసిన కాలనిర్ణయాల విశ్వసనీయత ప్రశ్నార్థకం. ఎందుకంటే భారతదేశ చరిత్ర గురించి పాశ్చాత్యులు చేసిన కాలనిర్ణయాలకు పునాది మతపరమైనదేగానీ శాస్త్రీయమైనది కాదు.



బైబిలికల్ గ్రంథాల ప్రకారం క్రీపూ. 4004లో ప్రపంచం సృష్టించబడింది. దీన్ని అనుసరించే పాశ్చాత్యులు రామాయణ, మహాభారత కాలాలను తిరస్కరించడమే కాకుండా, ప్రాచీన కాలంలో సుమారు పన్నెండు వందల సంవత్సరాల భారతదేశ చరిత్రను కలగాపులగం చేసేశారు.

మనం ఇప్పుడు అకడమిక్‌గా చదువుతున్న చరిత్రపై పాశ్చాత్య చరిత్రకారుల, మార్క్సిస్టు చరిత్రకారుల ప్రభావమే ఎక్కువ. పురాణాలన్నీ హిందూ ధార్మిక గ్రంథాలుగా చెలామణి అవుతున్నాయి. మతం ముసుగేసుకోవడం వల్ల పురాణాలను చారిత్రక కోణం నుంచి పరిశీలించడమనేది జరగవలసినంతగా జరగలేదు. పురాణాలన్నిటిలోనూ చరిత్ర కల్పనలతో కలిసిపోయి ఉండటం వల్ల, అవన్నీ పూర్తి కల్పిత గాథలేనని కొట్టి పారేశారు. భారతదేశంలోని అనేక దేవాలయాల స్థల పురాణాల కింద పాతిపెట్టబడిన చారిత్రక వాస్తవాలను వెలికితీస్తే చరిత్రలో కొత్త కోణాలు ఆవిష్కృతమవుతాయి.

పురావస్తు ఆధారాలతో చరిత్ర రచన చేయాలనుకున్నప్పుడు అలాంటి రచన సాపేక్షికమైనదని చరిత్రకారుడు గుర్తుంచుకోవాలి. కొత్త ఆధారాలు దొరికినపుడు అవి తన నమ్మకాలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ పాత నిర్ణయాలు మార్చుకోవాలి. ముందుగా లిఖిత లేదా మౌఖిక ఆధారాలేమైనా ఉన్నాయేమో చూసుకుని, తరువాత వాటిని బలపరిచేందుకు ఏమైనా పురావస్తు ఆధారాలున్నాయేమో పరిశోధించడం మంచి పద్ధతి. మన దేశంలో 'ముస్లింల రాక మునుపటి భారతదేశపు గతం' ఉత్కృష్టమైనదని రుజువు చేయడానికి ఒక వర్గం, అలాంటిదేం లేదని రుజువు చేయడానికి మరొక వర్గం తాపత్రయపడుతున్నాయి. ఇదే మన చరిత్రలో నిష్పాక్షికత లోపించడానికి కారణం.

— గౌరాబత్తిన కుమార్ బాబు

మాకు యుద్ధ పరిహారం కావాలి

ప్రకాశం, నెల్లూరు జిల్లాల షెడ్యూల్ కులాల ప్రజల గురించి రాయడమంటే 'మా' గురించి, అందులో 'నా' గురించీ, మా బతుకు పోరాటాల గురించీ రాయడమే. నేను ఒంగోలు పట్టణంలో పుట్టకపోయినా, అక్కడ ఇల్లు—ఆస్తులు లేకపోయినా, నేను ఒంగోలియన్‌ని అని చెప్పుకోవడానికి చాలా సంతోషిస్తాను. ఈ ప్రాంతపు మట్టి, గాలి, నీరు పర్యావరణంతో, ఇక్కడి మనుషులతో నాకున్న ప్రాకృతిక అనుబంధాలు, బాల్యస్మృతులు అందుకు కారణం. అవి నన్ను ఎంతో ఉద్వేగానికి గురిచేస్తాయి. 1840లో క్రైస్తవ మిషనరీ అయిన శామ్యూల్ డే ఆధ్వర్యంలో నెల్లూరు గడ్డపై అమెరికన్ బాప్టిస్ట్ మిషనరీల సేవలు ప్రారంభమయ్యాయి. 1860లో క్రైస్తవ మిషనరీలుగా ఒంగోల్లో అడుగు పెట్టిన క్లౌ దంపతులు, తమకు పుట్టిన పాపకి ఒంగోలియా అని పేరు పెట్టారని తెలుసుకొని, వారు ఒంగోలు ప్రాంతాన్ని సొంతం చేసుకున్న తీరుకి ఎంతో సంభ్రమాశ్చర్యాలు, భావోద్వేగానికి లోనయ్యాను.

2011 జనాభా గణాంకాల ప్రకారం విభజనానంతర ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 13 జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రంలో మాదిగ అనుబంధ కులాల వారి జనాభా 35 లక్షలు. కాగా, మాల అనుబంధ కులాల వారి జనాభా 38 లక్షలు. (ఈ లెక్కల్లో మాదిగ జనాభాని సంఖ్య తక్కువ చేసి చూపించారనే అభిప్రాయం ఈ వ్యాస రచయితకుంది.) అనంతపురం, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎస్సీ కులాల జనాభాలో మాదిగ వారి జనాభా, మాలవారి కంటే అధికం. కాగా, మిగిలిన ఏడు జిల్లాల్లో మాలవారి జనాభా మాదిగవారి కంటే అధికం. ఈ జనాభా లెక్కల ప్రకారం పాత ప్రకాశం, నెల్లూరు — రెండు జిల్లాల మొత్తం ఎస్సీ జనాభా 14,54,449 మంది. నెల్లూరు జిల్లా మొత్తం ఎస్సీ జనాభా 6,66,588 మంది. ఇందులో మాదిగ వారి జనాభా 2,27,684 మంది. కాగా, మాల వారి జనాభా 4,14,654 మంది. ఇతర ఎస్సీ కులాల జనాభా 24,250 మంది. ఇక ప్రకాశం జిల్లా మొత్తం ఎస్సీ జనాభా 7,87,861 మంది. ఇందులో మాదిగ జనాభా 4,15,095 మంది. కాగా, మాల జనాభా 3,47,274 మంది. ఇతర ఎస్సీ కులాల జనాభా 25,492 మంది.

భారతదేశంలో బ్రిటిష్ పరిపాలన వచ్చేనాటికి, జంబూ ద్వీపంలోని వందలాది స్వదేశీ సంస్థానాలన్నింటా వున్న ఎస్సీలు... ఆస్తులు, ఆయుధాలు, తిండి, బట్ట, నివాసం, చదువులు, శుభ్రత, గౌరవం, హోదా నిరాకరించబడినవారు. సాంఘిక బానిసలుగా, సాంఘిక ఖైదీలుగానే నాడు జీవించారు, ఇప్పటి ఎస్సీ కులాల వారి పూర్వీకులు. మాదిగ వారు, మాల వారు, ఇతర షెడ్యూల్డ్ కులాల వారు బ్రిటీష్ ఇండియాలో ఆదిమ జాతులుగా జీవించారు. ఇప్పటి కొన్ని ఎస్సీ కులాలు, ఎస్టీ జాతులు నాడు నేరస్థ తెగలుగా పరిగణించబడినాయి. ఇది చరిత్ర.

ఎస్సీ కులాల ప్రజలు స్వాభావికంగా ఉన్నది ఉన్నట్టు చూసే హేతువాద దృక్పథం కలవారు. వీరు ప్రకృతివాదులు. కొందరు స్థానిక అమ్మదేవర్లను కొలుస్తారు. కొందరు లౌకిక భక్తి, లౌకిక మతావలంబకులు. ఎస్సీ కులాల వారు దీర్ఘకాలికంగా తమపై కొనసాగుతున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక వివక్షల యుద్ధాలకు విరుగుడుగా ఎన్నో రకాల తాత్విక, ఆధ్యాత్మిక యుద్ధాలు చేశారు. శాంతిదారుల్లో పయనించారు. వీరి అశక్తతను చూసి ప్రతి కాలంలో పాలకులు ఏ మతస్థులయితే, వారి పాలితులుగా ఉన్న ఎస్సీ సమూహాలను కూడా తమ మతాలను అనుసరించేటట్టు చర్యలు తీసుకున్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల దాకా వ్యాపించి ఉన్న నిజాం రాజ్యంలో ఇస్లాం మతాన్ని; ఇండియాలో బ్రిటిష్ వలస పాలనలో క్రైస్తవ మతాన్ని పుచ్చుకునేటట్టు పాలకులు కొందరు ఎస్సీలను ప్రేరేపించారు. ఇక 1947 తర్వాత ఎస్సీ కులాల వారందరినీ హిందూ మతం లెక్కల్లో వేశారు. తామెట్లు హిందువులయ్యారో ఆశ్చర్యపోయే ఎస్సీలను మనం ఇప్పటికీ తరచుగా చూడగలం.

మద్రాస్ రెసిడెన్సీలో తెలుగు మాట్లాడే చర్మకార మాదిగల గురించి క్రైస్తవ మిషనరీ అయిన డాక్టర్ ఎమ్మా రోషాంబు క్లౌ తను రాసిన While sewing sandals గ్రంథంలో "మాదిగల్లో ఆదిమ జాతి లక్షణాలన్నీ ఉన్నాయని, మాదిగలు ఆదిమ జాతేనని, త్రిపురాంతకం కేంద్రంగా ఉన్న నాసరయ్య మతాన్ని మొదట మాదిగలు అనుసరించారని, ఆ తర్వాత 1910లో గుండ్లకమ్మ నది వద్ద పదివేల మంది బాప్తిస్మం తీసుకున్నా"రనీ రాశారు. మరొక పుస్తకం "ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్తవ మిషనరీల సేవ" (తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రచురణ) ప్రకారం, వందేళ్ళ క్రితం క్రైస్తవ మతం తీసుకున్న మొదటి తెలుగు వ్యక్తి కనిగిరి ఏరియా వాస్తవ్యుడు ఎర్రగుంట్ల పేరయ్య అనే మాదిగ వ్యక్తి అని చరిత్ర నమోదు చేసింది.

> ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని మాదిగల్లో ఎక్కువగా, మాల వారిలో కొంత తక్కువగా నిరుద్యోగం, నిరక్షరాస్యత తాండవిస్తోంది. అంటరానితనం, అత్యాచారాలు, దాడులు, రూపాలు మార్చుకుంటూ ఈ రెండు కులాల ప్రజలపై, ఆ మాటకొస్తే నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని మొత్తం షెడ్యూల్ కులాల ప్రజలపై ఆధిపత్య కులాల వివక్షల యుద్ధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. మాదిగ వారు, మాల వారు, ఇతర ఎస్సీ కులాల వారిపై వివిధ రూపాల్లో జరుగుతున్న ఆధిపత్య కులాల వారి నిరంతర వివక్షల యుద్ధాన్ని వెంటనే ఆపివేయాలి.



బ్రిటిష్ పాలకుల నుంచి హిందూ ఆధిపత్య కులాల పాలకుల దాకా— అభివృద్ధి, స్వాతంత్ర్యం, సంస్కరణల ఫలాల పేరుతో ఎస్సీ కులాల ప్రజల కోసం వచ్చిన కొద్దిపాటి, పరిమిత విద్య, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ అవకాశాలు, ప్రాతినిధ్యాలన్నింటినీ మాల కులం వారు, వారి కులం జనాభా దామాషా కంటే అదనంగా తీసేసుకుంటున్నారు. ఎస్సీలలో ఈ అవకాశాలు పొందిన కులమే, పొందిన కుటుంబాలే, మళ్లీమళ్లీ అవకాశాలు పొందే అపసవ్య పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతున్నది. ఉదాహరణకు ఇప్పటి వరకూ నెల్లూరు ఎస్సీ పార్లమెంటు సీటుకు 15 సార్లు ఎంపికైన వారిలో కేవలం ఇద్దరే మాదిగలు. మిగిలిన 13 మందీ మాలవారే. అంతేకాదు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని గూడూరు, సూళ్లూరుపేట, సంతనూతలపాడు, కొండపి, ఎర్రగొండపాలెం — ఈ ఐదు ఎస్సీ రిజర్వుడు ఎమ్మెల్యే స్థానాల నుంచి ఇప్పటి వరకూ పదిమంది లోపే మాదిగలు ఎమ్మెల్యేలు అయ్యారు. కాగా, ఈ నియోజకవర్గాల్లో 50 మందికి పైగా మాలవారు ఎమ్మెల్యేలు, మంత్రులు అయ్యారు. ఇది కేవలం రాజకీయ రంగంలో కొనసాగుతున్న ఒక వ్యత్యాసం, ఒక అసమానత, ఒక వివక్ష.

కారంచేడు మాదిగ ఉద్యమం, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం, టంగుటూరు ఇందిర మహిళా ఉద్యమం, దళిత మహాసభ ఉద్యమం, అంబేడ్కర్ భావజాల ఉద్యమం, వామపక్ష విద్యార్థి, యువజన, రైతుకూలీ ఉద్యమాలు, సారా వ్యతిరేక ఉద్యమం, అక్షరాస్యతా ఉద్యమం— ఇలా ఎన్నో ఉద్యమాలు ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచే ప్రారంభమయ్యాయి. ఒకవైపు చైతన్యం పెరుగుతున్నా, మరోవైపు వ్యతిరేక చైతన్యమూ కమ్ముకుంటున్నది. ఇప్పటికీ ఈ రెండు జిల్లాల్లోని మాదిగల్లో ఎక్కువగా, మాల వారిలో కొంత తక్కువగా నిరుద్యోగం, నిరక్షరాస్యత తాండవిస్తోంది. అంటరానితనం, అత్యాచారాలు, దాడులు, రూపాలు మార్చుకుంటూ ఈ రెండు కులాల ప్రజలపై, ఆ మాటకొస్తే నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని మొత్తం షెడ్యూల్ కులాల ప్రజలపై ఆధిపత్య కులాల వివక్షల యుద్ధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

పాలక కులాలు మాదిగ వారిని — మాల వారిని ప్రత్యర్థి శిబిరాలుగా విడదీసి, సాపేక్షికంగా ఎక్కువ జీవనోపాధి, అధికార అవకాశాలు, ప్రాతినిధ్యాలు మాల వారికి కల్పిస్తున్నాయి. జనాభా దామాషా ప్రకారం పంపిణీ న్యాయం అడుగుతున్న మాదిగ వారిని కొందరు మాల వారు హీన భావంతో చూస్తున్నారు. ద్వేషిస్తున్నారు. ఆధిపత్య కులాల వ్యవస్థల ముందు, కేవలం సమాన అవకాశాలు, సహోదరత్వం మాత్రమే మా డిమాండ్లు కావు. అంతకు మించినవి ఉన్నాయి. మాదిగవారు, మాలవారు, ఇతర ఎస్సీ కులాల వారిపై వివిధ రూపాల్లో జరుగుతున్న ఆధిపత్య కులాల వారి నిరంతర వివక్షల యుద్ధాన్ని వెంటనే ఆపివేయాలి. ఆధిపత్య కులాల ప్రభుత్వాలు మాకు యుద్ధ పరిహారం చెల్లించాలి. మాల వారి నుంచి మాదిగలకు కలిసి పోరాడే అంత నమ్మకమైన సమానత, సహోదరత లభించాలి.

• కృపాకర్ మాదిగ



అంబరాన్నంటిన శిడి సంబరం

సిరులనిచ్చే వీరమ్మతల్లి శిడిబండి వేడుక వైభవంగా జరిగింది. తిరునాళ్లలో 11వ రోజైన గురువారం శిడిబండి వేడుకను వీక్షించేందుకు భక్తులు అశేషంగా ఉయ్యూరు తరలారు. కొబ్బరితోట సమీపం నుంచి డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ శిడిబండి బయల్దేరింది. మహిళలు హారతులతో స్వాగతం పలకగా, శివాలయం రోడ్డు, ప్రధాన సెంటర్ మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుంది. ఆచారం ప్రకారం స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ఓ కుటుంబంలో వివాహానికి సిద్ధంగా ఉన్న యువకుడికి పూజలు చేసి ఊరేగింపుగా శిడిబండికి కట్టిన ఉట్టి బుట్టలో కూర్చోబెట్టారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆ తర్వాత పురవీధుల్లో ఊరేగింపు జరిగింది. ఈ ఉత్సవాన్ని చూసేందుకు మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలిరాగా ఆలయ ప్రాంగణంతో పాటు ప్రధాన రహదారులు జనసంద్రమయ్యాయి. గన్నవరం డీఎస్పీ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

- ఉయ్యూరు







టీడీపీ ఆందోళన

తన కుమారుడు శరత్ ఆచూకీ తెలపాలని డిమాండ్ చేస్తూ మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావుతో పాటు టీడీపీ నేతలు, కార్యకర్తలు గురువారం రాత్రి పోలీసు కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. టీడీపీ నేతలు పట్టాభి, పిల్లి మాణిక్యాలరావు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పలువురు మహిళా నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. గంటకు పైగా నిరసన జరిగింది.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

రేపటి నుంచి సెకండ్ ఇంటర్.. ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు - 6లో..

డెల్టా ఉల్టా

మూడేళ్లుగా రబీకి సాగునీరు ఇవ్వని ప్రభుత్వం





పూడికతీతకు నోచుకోని శివగంగ డ్రెయిన్ (ఇన్‌సెట్‌లో) కృష్ణానదిలో నుంచి ఇసుక అక్రమ తరలింపు

'రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం.. వ్యవసాయాన్ని పండగ చేస్తాం' అని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లుగా కృష్ణాడెల్టాను ఉల్టా చేసేసింది. సాగునీటి ప్రధాన కాల్వల ఆధునికీకరణను జగన్ సర్కారు అటకెక్కించింది. గతేడాది డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫాను వల్ల కోల్పోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించకుండా చేతులెత్తేసింది. మూడేళ్లుగా రబీలో సాగునీటి విడుదలను ఆపేసింది. ప్రకాశం బ్యారేజీకి దిగువన రెండు మినీ బ్యారేజీలు కట్టి వృథా జలాలను ఒడిసిపట్టుకుంటామని చెప్పిన మాటలన్నీ నీటి మూటలేనని నిరూపించింది. జిల్లాలో కరకట్టల అభివృద్ధిని మరిచిపోయింది. ఇలా జిల్లాకు ఇచ్చిన హామీలు, చేయాల్సిన అభివృద్ధి పనులు అనేకం పెండింగులోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శుక్రవారం పామర్రులో విద్యాదీవెన కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తుండటంతో ప్రధాన సమస్యల పరిష్కారంపై ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. - ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

నేడు పామర్రులో సీఎం వైఎస్ జగన్ పర్యటన

- కృష్ణానదిపై రెండు బ్యారేజీల నిర్మాణానికి రూపాయి విదల్చలేదు
- సాగునీటి కాల్వల ఆధునికీకరణను అటకెక్కించింది..
- పంట నష్టపరిహారం శూన్యం

● కృష్ణాడెల్టా ఆధునికీకరణను పక్కన పెట్టేశారు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2021లో మాత్రమే రబీ సీజన్ (దాళ్వా)కు సాగునీరు విడుదల చేశారు. మూడేళ్లుగా రబీ సీజన్‌లో పంటల సాగుకోసం సాగునీటిని విడుదల చేయలేదు. కృష్ణాజిల్లాలోని ప్రధాన పంటకాల్వలు, డ్రెయిన్ల ఆధునికీకరణకు గతంలో రూ.2,180 కోట్లతో ఉన్న ప్రతిపాదనలను తుంగలో తొక్కేశారు. నిధులలేమి కారణంగా చూపి ఈ పనులను నిలిపివేశారు. రెండేళ్ల క్రితం జిల్లాలోని ప్రధాన పంటకాల్వలు, డ్రెయిన్లలో ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఓఅండ్ఎం) పనులకు రూ.57 కోట్లు కేటాయించారు. అయినా పనులు సక్రమంగా చేయలేదు. గతేడాది ఓఅండ్ఎం నిధుల కేటాయింపులో పొదుపు పాటించి రూ.27 కోట్లకు కుదించారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో ఓఅండ్ఎం పనులు సక్రమంగా చేయకపోవడంతో డ్రెయిన్లు పూడుకుపోయాయి. డిసెంబరులో సంభవించిన తుఫాను కారణంగా కురిసిన భారీవర్షాలకు పంట చేతికొచ్చే దశలో పొలాల్లో వర్షపునీరు రోజుల తరబడి నిలబడిపోయింది. జిల్లాలో 83,462 హెక్టార్లలో వరి దెబ్బతిన్నా పంట నష్టపరిహారం 57,777 హెక్టార్లకు మాత్రమే ఇచ్చేలా తుది జాబితాలను తయారు చేశారు. తొలుత తయారుచేసిన పంట నష్టపరిహారం రూ.141.56 కోట్లు వస్తుందని ఆశ చూపారు. ఏవేవో లెక్కలు సరిచేసి ఈ నగదు మొత్తాన్ని రూ.99 కోట్లకు కుదించారు. సంక్రాంతి పండుగ నాటికి పంట నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పినా ఇంతవరకు విడుదల చేసిన దాఖలాలు లేవు. పంట నష్టపరిహారం సంగతి అలా ఉంచితే, పంటబీమా విడుదలపై అధికారులు, పాలకులు పెదవి విప్పడం లేదు.

● నదీగర్భంలోని ఇసుక దోపిడీ

గత ఐదేళ్లుగా జిల్లాలోని రొయ్యూరు, శ్రీకాకుళం, పాపవినాశనం, మోపిదేవి, అవనిగడ్డ తదితర ప్రాంతాల్లోని ఇసుకరేవుల నుంచి ఇసుకను దోచేస్తూ కోట్లాది రూపాయలు అధికార పార్టీ నాయకులు వెనకేసుకున్నారు. కరోనా సమయంలో ప్రజలు, అధికారులు బయట తిరగకపోవడంతో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు వంతులవారీగా ఇసుకరేవులను పంచుకుని మరీ ఇసుకను తరలించేశారు. పెనమలూరు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మంత్రి జోగి రమేశ్ తన మనుషులను, తనకు అనుకూలంగా ఉన్న అధికారులను అడ్డుపెట్టుకుని ఇటీవల ఇసుకను యథేచ్ఛగా తరలించేస్తున్నారు. ఇసుక తరలింపులో ప్రభుత్వ పెద్దలకు ఎప్పటికప్పుడు వాటాలు పంపుతూ కృష్ణా నదిలోని ఇసుకను తరలిస్తూనే ఉన్నారు.

● రెండు మినీ బ్యారేజీలు ఏమయ్యాయి?

కృష్ణాజిల్లాకు సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు, వరదనీరు సముద్రంలో కలవకుండా ఒడిసిపట్టి నిల్వ ఉంచేందుకు ప్రకాశం బ్యారేజీ దిగువన రెండు నూతన బ్యారేజీలు నిర్మించేందుకు 2020, జనవరిలో ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం బ్యారేజీకి దిగువన 16 కిలోమీటర్ల దూరంలో చోడవరం వద్ద బ్యారేజీ నిర్మించేందుకు రూ.2,223.42 కోట్లతో, ప్రకాశం బ్యారేజీకి దిగువన 67 కిలోమీటర్ల దూరంలో మోపిదేవి వద్ద మరో బ్యారేజీ నిర్మాణానికి రూ.2,526.39 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ బ్యారేజీల నిర్మాణం ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ బ్యారేజీల నిర్మాణానికి నిధులే కేటాయించకుండా మొండిచేయి చూపారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు, నాగాయలంక మండలాల్లోని పంటపొలాల్లోకి సముద్రపునీరు చొచ్చుకురాకుండా ఉండేలా ఏడు అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల మరమ్మతులకు రూ.3,344.50 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలు నేటికీ కాగితాలను దాటలేదు. దివిసీమ ప్రాంతానికి సాగునీటిని అందిస్తూ జీవనాడిగా ఉన్న పులిగడ్డ అక్విడెక్టుకు కూడా ప్రభుత్వం కనీస మరమ్మతులు చేయలేదు. అయినా బిల్లులు చేసుకున్నారు.

● కృష్ణా కరకట్ట అభివృద్ధి మరిచారు!

విజయవాడ సమీపంలోని యనమలకుదురు నుంచి మోపిదేవి వార్పు వరకు కృష్ణానదీతీరం వెంబడి కృష్ణా కరకట్ట ఉంది. కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు వరదనీరు గ్రామాలను, పంట పొలాలను ముంచెత్తకుండా ఈ కరకట్టను రూపకల్పన చేశారు. ఈ కరకట్ట ప్రస్తుతం పూర్తిగా దెబ్బతింది. రూ.25 కోట్లతో కరకట్టను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చినా ఒక్క రూపాయి పని కూడా ఈ ఐదేళ్లలో చేయలేదు. నదిలో తవ్విన ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు మాత్రం కరకట్టను పాలకులు ఉపయోగించుకున్నారు.

● ధాన్యం బిల్లులు ఇస్తారా?

కృష్ణాజిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆఫ్‌లైన్‌లో 45 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ధాన్యం బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. రైతులు ధాన్యం బిల్లులు మంజూరు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఆన్‌లైన్ విక్రయించిన ధాన్యానికి బిల్లులను ఈ ఏడాది జనవరి 18వ తేదీ నుంచి విడుదల చేయడం లేదు. జిల్లాకు చెందిన రైతులకు రూ.280 కోట్ల బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. జిల్లాలో ఇంకా రెండు లక్షల టన్నుల ధాన్యం కుప్పలపై ఉంది. ఈ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందో లేదో తెలియని స్థితి నెలకొంది.

దేవాదాయం

రూ.కోట్ల విలువైన ఆస్తిపై వైసీపీ కన్ను

- సహకరిస్తున్న దేవదాయ అధికారులు
- ఎమ్మెల్యే అనుచరుల చేతిలో సీతారామ కల్యాణమండపం
- స్వాధీనానికి 2021లోనే హైకోర్టు ఉత్తర్వులు

దేవదాయ శాఖకు చెందిన కోట్ల రూపాయల విలువైన ఆస్తులు అధికార పార్టీ నేతల కబ్జాలో ఉన్నా అధికారుల్లో చలనం లేదు. వైసీపీ నాయకులతో కుమ్మక్కైన దేవదాయ శాఖ అధికారులు లక్షలాది రూపాయల ఆదాయాన్ని ఇచ్చే ఆస్తులను స్వాధీనం చేసుకోకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారు. అధికారుల తీరుకు సత్యనారాయణపురం శివాలయమే నిదర్శనం.



సీతారామ కల్యాణమండపం

విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్ : సత్యనారాయణపురంలోని శివాజీ కేఫ్ సెంటర్‌లో శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం ఉంది. ఈ ఆలయానికి 60 ఏళ్ల క్రితం తాడేపల్లి సీతమ్మ 600 గజాల స్థలాన్ని దానంగా ఇచ్చారు. విజయవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 1957లో దేవస్థానం పేరిట రిజిస్టర్ చేయించారు. ఈ స్థలానికి వెనుక మరికొందరు దాతలు 300 గజాలు దేవస్థానానికి ఇచ్చారు. ఈ మొత్తం 900 చదరపు గజాలు. దీని విలువ సుమారు రూ.12 కోట్ల పైమాటే. ఈ స్థలాన్ని కబ్జా చేయడానికి అధికార పార్టీకి చెందిన కొందరు ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నారు. 2008లో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా పనిచేసినవారు ఈ ఆస్తిపై పెత్తనం సాధించడం మొదలు పెట్టారు. 2010లో నాటి ఈవోను సంప్రదించకుండానే 900 గజాల స్థలాన్ని కొందరు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు తీర్మానం చేశారు. ఈ తీర్మానంపై ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్, శాశ్వత ధర్మకర్తలు సంతకాలు చేయలేదు. దీంతో ఈ తీర్మానానికి విలువ లేకపోవడంతో దేవదాయ శాఖ అధికారులు దాన్ని తోసిపుచ్చారు. 2015లో మరోసారి ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేయగా, ఈ స్థలం ఆలయానికి చెందినదని, దానిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం కుదరదని స్పష్టం చేశారు. అయితే, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవదాయ శాఖ మాజీ మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధి కన్ను దీనిపై పడింది. అప్పటికే ఆ స్థలంలో దాతలు సీతారాముల కల్యాణమండపాన్ని కూడా నిర్మించారు. వైసీపీ నాయకులు రికార్డులు తారుమారు చేసి అసలు ఆ స్థలం దేవదాయ శాఖకు చెందినదే కాదంటూ వాదనలు మొదలుపెట్టారు. ఎట్టకేలకు ఈ స్థలాన్ని, కల్యాణమండపాన్ని స్థానిక ఎమ్మెల్యే బంధుగణానికి అప్పగించారు. దీంతో వారు ఈ కల్యాణమండపం ద్వారా నెలకు రూ.20 లక్షల పైచిలుకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఈ మండపం దేవదాయ శాఖదేనంటూ అధికారులు 2020లో కోర్టుకు వెళ్లారు. 2021లో హైకోర్టు సానుకూలంగా ఉత్తర్వులిచ్చింది. కల్యాణమండపాన్ని స్వాధీనం చేసుకోవచ్చంటూ తీర్పు చెప్పింది. కానీ, రాజకీయ ఒత్తిళ్లతో దేవదాయ శాఖ అధికారులు రెండేళ్లు గడిచిపోతున్నా దాన్ని స్వాధీనం చేసుకోవడం లేదు.

న్యాయసలహా కోసం పంపాం: ఈవో

హైకోర్టు ఉత్తర్వులననుసరించి సంబంధిత స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి న్యాయసలహా కోసం రాశామని దేవస్థాన ఈవో డాక్టర్ కె.సుపద్మదేవి తెలిపారు. తాను 2023, అక్టోబరులో బాధ్యతలు స్వీకరించానని, ఆ తర్వాత రికార్డులు పరిశీలించి కల్యాణమండపం ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చామన్నారు.

సరుకు రవాణాలో.. సరికొత్త రికార్డు

- నెల ముందే బెజవాడ రైల్వే ఘనత
- 2023-24 ఫిబ్రవరి 27 నాటికి 33.54 మిలియన్ టన్నుల రవాణా.. రూ.3,912 కోట్ల ఆదాయం
- కృష్ణపట్నం, కాకినాడ పోర్టులది కీలక పాత్ర
- అత్యధికంగా బొగ్గు, ఎరువులు
- ఈ ఏడాది కొత్తగా కలప, లేటరైట్

- 6లో..



మరో మోసం

ఆర్ అండ్ ఆర్‌పై ఉత్తుత్తి జీవోలతో ప్రభుత్వ మాయ

విమానాశ్రయ విస్తరణ కోసం ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులతో ప్రభుత్వం ఆటలాడుతోంది. జీవోల పేరుతో మాయమాటలు చెప్పి మోసం చేస్తోంది. నిర్వాసితులు నిరసనకు సమాయత్తమవుతున్న దశలో ఉత్తుత్తి జీవోలను విడుదల చేసి మమ.. అనిపిస్తోంది. పక్షం రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని చెప్పిన ప్రభుత్వం రెండు నెలలవుతున్నా పత్తా లేకపోవడంతో ఈసారి అమీతుమీ తేల్చుకోవాలని నిర్వాసితులు నిశ్చయించుకున్నారు. పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టేందుకు రహస్య సమావేశం నిర్వహించారు.

- పక్షం రోజుల్లో సమస్య పరిష్కారమని అభయం
- రెండు నెలలువుతున్నా అతీగతీ లేదు
- నాలుగున్నరేళ్లుగా నిర్వాసితుల ఎదురుచూపులు
- భారీ ఆందోళన చేపట్టాలని రహస్య సమావేశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ కోసం తమ ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు కిందటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చిన్న అవుటపల్లిలో 48 ఎకరాలు సేకరించారు. ఈ భూముల్లో లే అవుట్ వేసి మోడల్ గృహాలను కట్టించాలని నిర్ణయించారు. ఇదే సందర్భంలో ఎన్నికలు రావటం, ఆ తర్వాత ప్రభుత్వం మారటంతో నిర్వాసితుల సమస్య అలాగే ఉండిపోయింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఆర్‌అండ్ఆర్‌పై నిర్వాసితులను మభ్యపెడుతూనే వస్తోంది. డబ్బు కేటాయిస్తున్నామంటూ జీవోల పేరుతో నమ్మిస్తూ నయవంచన చేస్తోంది. అధికారంలోకి వచ్చాక దాదాపు రెండేళ్లు సమస్యలను పరిష్కరించకుండా పక్కన పెట్టింది. రైతుల సమస్యలను జిల్లా యంత్రాంగం పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. కానీ, ప్రభుత్వ పెద్దలు ఏమాత్రం పట్టించుకోలేదు.

నిర్వాసితులతో ఆటలు

నిర్వాసితులతో వైసీపీ ప్రభుత్వం మైండ్‌గేమ్ ఆడింది. 'ఇళ్లు మీరే కట్టుకోవచ్చు. డబ్బు మేమిస్తాం..' అనే ఆఫర్ ఇచ్చింది. ఇంటికి రూ.9 లక్షలు ఇస్తామని ప్రకటించింది. అది కూడా రెండు విడతలుగా చెల్లిస్తామని పేర్కొంది. ప్రభుత్వం మభ్యపెడుతున్నప్పటికీ సమస్య పరిష్కారం అవుతుందన్న ఉద్దేశంతో నిర్వాసితులు అంగీకరించారు. అయినా నిధులు విడుదల కాకపోవడంతో ఆందోళన ప్రారంభించారు. దీంతో లే అవుట్‌లో కనీసం ప్లాట్లు కూడా కేటాయించని పరిస్థితుల్లో లాటరీ తీశారు. నిర్వాసితులు కొంతకాలం ఆందోళన విరమించారు. ఆ పని కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండటంతో మళ్లీ ఆందోళనకు సమాయత్తమయ్యారు. ఈ నేపథ్యంలో రూ.110 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ డబ్బు కోసం నిర్వాసితులు జిల్లా యంత్రాంగం చుట్టూ తిరిగారు. ఈ డబ్బును ప్రభుత్వం వెనక్కి తీసుకుందన్న సంగతి తెలిసి మళ్లీ నిరసన బాట పట్టారు. దీంతో అధికారులు హడావిడిగా ప్లాట్ల లాటరీ తీశారు. ఇలా కొంతకాలం గడిపారు. చివరికి నిర్వాసితులు నిరాహార దీక్షకు దిగటంతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. రిజిస్ట్రేషన్ అయితే చేశారు కానీ, పట్టాలు ఇవ్వలేదు. నిర్వాసితులు విమానాశ్రయ మైనర్ ఇరిగేషన్ కాల్వను తవ్వేస్తామని కార్యాచరణకు పిలుపునిచ్చారు. దీంతో రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను నిర్వాసితులకు అందజేశారు. ఇల్లు నిర్మించుకోవటానికి డబ్బుల్లేవని అడిగితే, మళ్లీ రూ.83 కోట్లు కేటాయిస్తున్నట్టు జీవో ఇచ్చారు. పక్షం రోజుల్లో డబ్బులందుతాయని తెలిపారు. రెండు నెలలవుతున్నా డబ్బు అందకపోవడంతో నిర్వాసితుల్లో తీవ్ర ఆందోళన నెలకొంటోంది. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటంతో మళ్లీ నిర్వాసితులు నిరసన చేపట్టాలని నిర్ణయించుకున్నారు. మైనర్ ఇరిగేషన్ తవ్వకంతో పాటు రన్‌వేపై విమానాల నిలుపుదల వంటివి చేపట్టాలని భావిస్తున్నారు. ఆకస్మికంగా ఆందోళన చేపట్టాలని చూస్తున్నారు.

నిర్వాసితులకు కేటాయించిన లే అవుట్





నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న దుర్గాభవాని

మద్యంపై మాటతప్పిన జగన్‌ను గద్దె దింపుతాం

» మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 29 : దశల వారీగా మద్య నిషేధం చేస్తానని నమ్మించి మహిళల ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ గద్దె దింపేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మత్స దుర్గాభవాని అన్నారు. రాష్ట్రంలో మద్య నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం వైఎస్సార్ కాలనీ వద్ద ఉన్న బార్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలతో బార్ నిర్వాహకులు వాగ్వాదానికి దిగడంతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడకు చేరుకున్న పోలీసులు సర్దిచెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ సందర్భంగా దుర్గాభవాని మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఊరూరు తిరిగి దశల వారీగా మద్యపాన నిషేధం అమలు చేస్తానని జగన్ ఇచ్చిన హామీని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే నిషేధ హామీని గాలికి వదిలేసి మద్యంపై వచ్చే ఆదాయాన్నే ప్రధాన వనరుగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనధికారికంగా రాష్ట్రంలో 70వేలకు పైగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయన్నా. రానున్న ఎన్నికల్లో జగన్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు పంచదార్ల దుర్గాంబ, బంకా ఝాన్సీ, భారతి, మేకల కుమారి, పార్వతి, జ్యోతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో టీడీపీ తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

జగన్‌కు రైతులే బుద్ధి చెబుతారు

» తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29 : ఉత్తిత్తి బటన్లు నొక్కి రైతులను సీఎం జగన్‌మోసం చేస్తున్నారని టీడీపీ కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆరోపించారు. గురువారం బందరు మండలం కానూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లబొల్లి మాటలు చెప్పి జగన్‌రెడ్డి మోసపూరిత హామీలతో రైతుల ఓట్లు దండుకున్నారన్నారు. ప్రభుత్వమే ఇన్సూరెన్సు ప్రీమియం సొమ్ము కడుతుందని చెప్పి ఒక్క రూపాయి కూడా కట్టలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందలేదని, బ్యాంకుల నుంచి బకాయిలు చెల్లించాలని నోటీసులు వస్తున్నాయన్నారు. సున్నా వడ్డీ రుణాలిస్తే రైతులు ఆరువేలు వడ్డీ ఎందుకు చెల్లించాలన్నారు. పట్టిసీమ జలాలే కృష్ణాడెల్టాకు గతయ్యాయన్నారు. రైతులను వంచించే జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో తెలుగురైతులు డి.మహేష్, జి.వెంకటరమణ, సీహెచ్ కొండ, వై.నాయుడు, జి.నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం సభతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది



» టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయం : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29 : తాడేపల్లిగూడెంలో జరిగిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల సభను చూసిన తాడేపల్లిలోని జగన్‌రెడ్డి ప్యాలెస్ దద్దరిల్లిందని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. గురువారం మచిలీపట్నంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన విజయం, వైసీపీ పూర్తిగా ఖాళీ అయ్యే తరుణం ఆసన్నమైందన్నారు. టీడీపీ, జనసేన కలయిక రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకోసమే అన్నారు. పులివెందులలో జగన్‌రెడ్డికి ఓటమి తప్పదన్నారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే సాగునీరందించి రైతులను ఆదుకుంటామని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని కొనకళ్ల హామీ ఇచ్చారు.

రుషికొండపై అక్రమ నిర్మాణాలు! : దేవినేని ఉమా



గొల్లపూడి, ఫిబ్రవరి 29 : రుషికొండకు గుండు కొట్టి వందల కోట్ల ప్రజాధనంతో నిబంధనలకు విరుద్ధంగా దానిపై భవనాలు నిర్మించారని సీఎం జగన్‌పై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, పేదల ఇళ్లు కూలుతుంటే జగన్ ప్యాలెస్‌లు వెలిగిపోతున్నాయన్నారు. కేంద్ర నిధులతో పాటు లబ్ధిదారుడి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి, తామే కట్టించి ఇస్తామని ఒక్క పైసా ఖర్చు పెట్టకపోగా నిర్మాణం పేరుతో దోపిడీ చేశారన్నారు. నాశిరకం నిర్మాణాలతో లబ్ధిదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. దోచుకో, దాచుకో విధానంతో తాడేపల్లి ఖజానా నింపుకున్న వైఎస్ జగన్ ప్రజల జీవితాలను అంధకారంలోకి నెట్టారని ఉమా ధ్వజమెత్తారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 29 : గుడివాడ నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని నియోజకవర్గ ఇంచార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. గురువారం మల్లాయి పాలెం, శ్రీకాళహస్తి కాలనీ, దొండపాడు కాలువ తదితర ప్రాంతాల్లో 'బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ నాయకులు కొలుసు శాస్త్రి ఆధ్వర్యంలో 100 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, చంద్రబాబు నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని, తెలుగుదేశం పార్టీకి బ్రహ్మారథం పడుతున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన గుడివాడ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నేతలు వాసే మురళీ, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెనిగండ్ల రాము, రావి

బంటుమిల్లి : రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక రామవరపు మోడీ గ్రామానికి చెందిన సుమారు 50 వైసీపీ కుటుంబాలు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. కాగిత కృష్ణప్రసాద్ విజయానికి సైనికుల్లా పోరాటం చేస్తామని వారు అన్నారు. గూడవల్లి ఏడుకొండలు, కాగిత వెంకన్న, గూడవల్లి శ్రీనివాసరావు, నరసింహారావు, బడుగు రవి తదితర కుటుంబాలు టీడీపీలో చేరారు.


రామవరపు మోడీ గ్రామంలో టీడీపీ కండువాలు కప్పుకున్న గ్రామస్థులు





సరుకు రవాణాలో.. సరికొత్త రికార్డు

» నెల ముందుగానే బెజవాడ రైల్వే ఘనత
» 2023-24 ఫిబ్రవరి 27 నాటికి 33.54 మిలియన్ టన్నుల సరుకు రవాణా.. రూ.3,912 కోట్ల ఆదాయం
» కృష్ణపట్నం, కాకినాడ పోర్టులది కీలక పాత్ర
» అత్యధిక సరకు రవాణాలో బొగ్గు, ఎరువులు
» ఈ ఏడాది కొత్తగా కలప వ్యర్థాలు, లేటరైట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

సరుకు రవాణాలో కిందటి ఆర్థిక సంవత్సరంలో నమోదు చేసిన రికార్డును బద్దలు కొట్టి ఆల్‌టైమ్ రికార్డు దిశగా విజయవాడ రైల్వే డివిజన్ అడుగులు వేస్తోంది. 2022-23లో 33.5 మిలియన్ టన్నుల సరుకు రవాణాను 2023-24లో ఫిబ్రవరి నెలాఖరుకి అధిగమించింది. ఆర్థిక సంవత్సరం ముగియటానికి మరో నెలరోజుల సమయం ఉంది. సరుకు రవాణా ఆదాయంలో విజయవాడ డివిజన్ సరికొత్త రికార్డు నమోదుచేయనుంది. గత ఏడాది 33.5మిలియన్ టన్నుల రవాణా ద్వారా వియవాడ డివిజన్ రూ.3675.28 కోట్ల ఆదాయాన్ని సాధించింది. ఈ ఏడాదిలో ఫిబ్రవరి 27 నాటికే 33.54 మిలియన్ టన్నుల సరుకు రవాణా ద్వారా రూ.3912 కోట్ల ఆదాయాన్ని సాధించటం విశేషం. ఇంకా నెలరోజుల సమయం ఉండటంతో మరో రూ.1000 కోట్ల ఆదాయాన్ని సాధించటానికి అవకాశాలున్నాయని రైల్వే అధికారులు భావిస్తున్నారు. రూ. 5000 కోట్ల ఆదాయం డివిజన్ ఉన్నతాధికారుల లక్ష్యంగా ఉంది. డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ పర్యవేక్షణ, సీనియర్ కమర్షియల్ డివిజినల్ మేనేజర్ వి.రాంబాబుల యాక్షన్ ప్లాన్ ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా విజయవాడ రైల్వే డివిజన్ సరికొత్త రికార్డు నమోదుచేసేందుకు సిద్ధమౌతోంది. వ్యాగన్ టర్న్ అరౌండ్ పెరగటం వల్ల కూడా ఈ ఏడాది ఆదాయం గణనీయంగా పెరగటానికి దోహదపడింటున్నారు.

ఆదాయంలో ముందువరుసలో అదాని కృష్ణపట్నం, కాకినాడ సీ పోర్టులు

విజయవాడ రైల్వే డివిజన్ ఆల్‌టైమ్ సరుకు రవాణా రికార్డు వెనుక ప్రధాన ఆదాయమార్గాలుగా పోర్టులు నిలుస్తున్నాయి. పోర్టులకు సరుకు లోడింగ్, అన్‌లోడింగ్‌ల ద్వారానే డివిజన్‌కు ఇంత భారీ ఆదాయం సమకూరింది. రైల్వే ఆదాయంలో కృష్ణపట్నం పోర్టు ప్రథమ స్థానంలో, రెండవ స్థానంలో కాకినాడ సీ పోర్టు నిలిచాయి.



ప్రధాన వస్తువులుగా బొగ్గు, ఎరువులు

రైల్వే సరుకు రవాణా ప్రధాన వస్తువుగా బొగ్గు నిలిచింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 18 మిలియన్ టన్నుల బొగ్గును డివిజన్ పరిధిలో రవాణా చేయటం జరిగింది. ఆ తర్వాత ఎరువులు రెండో స్థానంలో నిలిచాయి. ఎరువులను 6.4 మిలియన్ టన్నుల మేర రవాణా చేయటం జరిగింది. సరకు రవాణాలో ఈ రెండు ప్రధాన స్థానాన్ని ఆక్రమించటం విశేషం.

బీడీయూలతో వస్తువుల రవాణా

డివిజన్ పరిధిలో సరుకు రవాణాను పెంపొందించేందుకు ఉన్నతాధికారులు బిజినెస్ డెవలప్‌మెంట్ యూనిట్స్ (బీడీయూ)లను ఏర్పాటు చేయటం జరిగింది. స్థానికంగా ఎక్కడికక్కడ బీడీయూ టీమ్‌లను ఏర్పాటు చేశారు. స్థానికంగా అన్ని రకాల ఉత్పాదక సంస్థలను గుర్తించి ఆయా సంస్థలతో చర్చలు జరిపి రైళ్లలో సరుకు రవాణా చేపట్టేలా కృషి చేశారు. కలప వ్యర్థాలు, లేటరైట్ రవాణా కూడా ఈ ఏడాది చేపట్టారు. రోడ్డు మార్గాన వెళ్లే అనేక సరుకులను తక్కువ ఖర్చుతో రైళ్ల ద్వారా రవాణా చేసేలా బీడీయూ బృందాలు కృషి చేశాయి.

ఫలించిన సంస్కరణలు

సరుకు రవాణాలో దేశస్థాయిలో ఆల్‌టైమ్ రికార్డు ఘనతను సాధించటానికి ఇటీవల కాలంలో అమలు చేసిన సంస్కరణలు కూడా దోహదపడ్డాయి. గతంలో కంటే భారీగా సరుకును తరలించే పరిస్థితులను సృష్టించడంతో పాటు, గూడ్స్ షెడ్‌లను ఆధునీకరించటం, వినియోగదారులకు సౌకర్యాలను కల్పించటం వంటివి కూడా కలిసొచ్చాయి.

ఇది గొప్ప విజయం

- నరేంద్ర ఆనంద్ పాటిల్, డీఆర్ఎం



సరుకు రవాణాలో ఈ ఆర్థిక సంవత్సరం రూ. 5 వేలకోట్ల మైలురాయికి చేరుకోబోతుండటం గర్వకారణం. గత ఆర్థిక సంవత్సరం ఘనతను ఈ ఏడాది అధిగమించటం గొప్పగా ఉంది. కమర్షియల్ విభాగం పూర్తిస్థాయిలో పనిచేయటం వల్ల ఇది సాధ్యమైంది. అన్ని విభాగాలు సమన్వయంతో లక్ష్యసాధనకు కృషిచేశాయి. విజయవాడ డివిజన్‌కు సంబంధించి కాకినాడలో వరల్డ్ క్లాస్ గూడ్స్ షెడ్‌ను నిర్మించబోతున్నాం.

నేడు పామర్రుకు సీఎం జగన్


ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

» ఐదో విడత విద్యాదీవెన నగదు పంపిణీ
» ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ
» సీఎం సభకు డ్వాక్రా మహిళలు, విద్యార్థులను తరలించాలని ఆదేశాలు!

పామర్రు, ఫిబ్రవరి 29 : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన పామర్రుకు రానున్నారు. విజయవాడ రోడ్డులోని దేవస్థాన భూముల్లో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాదీవెన పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. సభ వేదిక ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు తదితర ఏర్పాట్లను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. బందరు రోడ్డు మార్కెట్ యార్డు సమీపంలో హెలిప్యాడ్, సభాప్రాంగణ ఏర్పాట్లను ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి కృష్ణా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ నయీమ్ అస్మి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తదితరులు పరిశీలించారు. సభకు డ్వాక్రా మహిళలు, విద్యార్థులను తరలించాలని యానిమేటర్లను ఆదేశించినట్టు సమాచారం. సభకు రాకుంటే సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తామంటున్నారని డ్వాక్రా సంఘ సభ్యులు బహాటంగానే చెబుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల దారి మళ్లింపునకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇద్దరు అడిషనల్ ఎస్పీలు 11 మంది డీఎస్పీలు, 28మంది సీఐలు, 65మంది ఎస్ఐలతోపాటు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నట్టు చెప్పారు.

ముఖ్యమంత్రి సభా ప్రాంగణంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని చర్యలు పాటించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. సభావేదిక వద్ద ఫంక్షన్ హాల్లో అధికారులతో ఆయన మాట్లాడారు. సమావేశంలో జేసీ గీతాంజలి శర్మ జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్డీఏ పీడీ ప్రసాద్, హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ, ఉయ్యూరు, గుడివాడ, బందరు ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా

ఉదయం 10 గంటలకు తాడేపల్లి నుంచి సీఎం జగన్మోహనరెడ్డి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30కి పామర్రుకు చేరుకుంటారు. 10.50కి సభా ప్రాంగణానికి చేరుకుంటారు. నేతల ప్రసంగాల అనంతరం విద్యాదీవెన లబ్ధిదారులతో సీఎం మాట్లాడనున్నారు. అనంతరం విద్యాదీవెన సాయం బటన్ నొక్కి విడుదల చేస్తారు. హెలికాప్టర్‌లో తిరిగి తాడేపల్లికి వెళతారు.

ట్రాఫిక్ మళ్లింపు

గుడివాడ వైపు నుంచి అవనిగడ్డ వెళ్లే వాహనాలను బైపాస్ రోడ్డు నుంచి వయానిడుమోలు మీదుగా, విజయవాడ వైపు నుంచి అవనిగడ్డ వెళ్లే వాహనాలను కరకట్టమీదుగా దారి మళ్లించారు. గ్రామంలోని అన్ని రహదారుల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు.

సీఎం గారూ.. ఇసుక దోపిడీపై నోరు విప్పరూ!

» దళితుల సాగు భూములు లాక్కున్నారు..
» ఇళ్లస్థలాలను ఎందుకు ఇవ్వలేకపోయారు
» వర్ల కుమార్‌రాజా సూటి ప్రశ్న



తోట్లవల్లూరు, ఫిబ్రవరి 29 : పామర్రు వస్తున్న సీఎం జగన్.. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వర్ల కుమార్‌రాజా డిమాండ్ చేశారు. రొయ్యూరులో గురువారం పల్లెబాట కార్యక్రమంలో భాగంగా విలేకరుల సపమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో జగన్ పాదయాత్ర సందర్భంగా పామర్రు బహిరంగ సభలో టీడీపీ అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకంలో అవినీతి జరుగుతోందని నిందలు వేసి, తాను సీఎం అయితే ఇసుక దోపిడీ లేకుండా చేస్తామని చెప్పి ఇపుడు ఏమి చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. రొయ్యూరు, లంకపల్లి తదితర క్వారీల్లో యంత్రాలతో ఎన్నడూ లేనంతగా ఇసుక దోపిడీ జరుగుతోందన్నారు. సుప్రీంకోర్టు, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ సైతం ఇసుక అక్రమాలను నిర్ధారించాయన్నారు. అయినా సిగ్గూఎగ్గూ లేకుండా దోపిడీని కొనసాగిస్తున్నది నిజం కాదా.. అని ప్రశ్నించారు. నా ఎస్సీలంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతూ తోట్లవల్లూరులో 40 ఏళ్లుగా దళితులు సాగుచేసుకునే తొమ్మిది ఎకరాల వ్యవసాయ భూములను జగనన్న ఇళ్లస్థలాల పేరుతో బలవంతంగా లాక్కుని ప్రజలకు ఇళ్లు ఇవ్వకుండా, దళితులకు చెందకుండా చేయటంపై సమాధానం చెప్పాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రజలను వంచించిన తీరుపై జగన్ సమాధానమివ్వాలన్నారు.


రిజిస్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గోడౌన్ల వద్ద నిరంతర నిఘా

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గొల్లపూడి, ఫిబ్రవరి 29 : ఈవీఎంలను భద్రపరిచే గోడౌన్ వద్ద నిరంతరం పటిష్ఠమైన నిఘా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గొల్లపూడి మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోడౌన్‌ను ఆయన గురువారం పరిశీలించారు. రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఈవీఎం, బీయూలు, సీయూలు, వీవీ ప్యాట్‌ల భద్రతా చర్యలను పరిశీలించారు. ఆయనతో పాటు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఈవీఎం నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, ఎం.దుర్గా ప్రసాద్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 5,82,423 ఆరోగ్య శ్రీకార్డులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 29 : ఎన్టీఆర్ జిల్లాలో 5,82,423 ఆరోగ్య శ్రీకార్డులకుగాను ఇప్పటి వరకు 4,11,790 కార్డులు పంపిణీ చేశారు. మిగతా 32,160 కార్డుల్లో 20 వేల కార్డుల వరకు ఇతర ప్రాంతాలకు వలస పోయినవారు, మరణించిన వారికి చెందినవని జిల్లాకలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్డుల పంపిణీ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అర్హులైన పేద, మధ్యతరగతి ప్రజలకు డాక్టర్ వైఎస్ ఆర్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల ద్వారా 25 లక్షల రూపాయల వ్యయం గల వైద్య సేవలు ఉచితంగా అందుతాయన్నారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను ఆయన అధికారులకు సూచిస్తూ, నూరుశాతం కార్డుల పంపిణీ జరగాలన్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ జె.సుమన్, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పునర్నిర్మాణ ఆలయాలు ప్రారంభం



వన్‌టౌన్, ఫిబ్రవరి 29 : 2016 కృష్ణా పుష్కరాల సమయంలో వన్‌టౌన్ ప్రాంతంలో తొలగించిన ఆలయాలను పండితులు గురువారం ఉదయం 11.24 గంటలకు పునఃప్రారంభించారు. ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిఖర కలశాలకు కుంభాభిషేకం నిర్వహించారు. స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ఉపప్రధాన అర్చకుడు శంకర శాండిల్య, ముఖ్య అర్చకుడు యజ్ఞనారాయణ తదితరులు పూజలు నిర్వహించారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో కేఎస్ రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు. దుర్గగుడి పాత మెట్లవద్ద వినాయకునిగుడి, సీతమ్మవారి పాదాల వద్ద పంచముఖ ఆంజనేయస్వామి, బొడ్డుబొమ్మ తదితరాలను ప్రారంభించారు.


ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 29 : వివిధ రంగాల్లో సేవలందించే వారిని ప్రోత్సహించే లక్ష్యంతో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఏప్రిల్ 7న ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణమాష్టారు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి పురస్కారాలు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, విద్య, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన, నాటక, టీవీ, సినీ రంగాల్లో సేవలందిస్తున్న వారు మార్చి 15వ తేదీలోగా దరఖాస్తు చేయాలని కోరారు. సేవలు, ప్రతిభ తెలయజేసే సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రికల క్లిప్పింగ్స్, గతంలో పొందిన పురస్కారాలు, సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలకు 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు జతచేసి సికింద్రాబాద్‌లోని సంస్థ కార్యాలయానికి పంపాలని కోరారు. ఇతర వివరాలకు 96523 47207 నెంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉమ్మడి కృష్ణాలో లీగల్ మెట్రాలజీ శాఖ దాడులు


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పెనమలూరు, ఫిబ్రవరి 29: ప్రభుత్వ లీగల్ మెట్రాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం అధికారులు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పలు దుకాణాలపై దాడులు నిర్వహించారు. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణకు ఈదాడులు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. బియ్యం దుకాణాలు, రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లలోని వివిధ దుకాణాలపై దాడులు నిర్వహించి తనిఖీలు చేసినట్టు తెలిపారు. జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ పోర్టల్, వినియోగదారులు హెల్ప్‌లైన్ 1967 ద్వారా రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లలో కూల్‌డ్రింక్స్, ఇతర ప్యాకేజీ చేయబడిన వస్తువులకు అదనపు ధర, తూకం పరికరాల్లో తారుమార్లు, తక్కువ బరువుతో స్టీల్ అమ్మడం, 26కిలోల బరువుండాల్సిన బియ్యం సంచుల్లో 25కిలోల బియ్యం మాత్రమే ఉండడం వంటి అవకతవకలను గుర్తించి కేసులు నమోదు చేసినట్టు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు.


నారా లోకేశ్‌ను కలిసిన జలీల్‌ఖాన్, కేశినేని శివనాథ్

టీడీపీతోనే నడుస్తా : జలీల్‌ఖాన్

వన్‌టౌన్, ఫిబ్రవరి 29 : ఇటీవల టీడీపీ నుంచి వైసీపీలోకి వెళతారన్న ప్రచారం జరిగిన పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ గురువారం కేశినేని శివనాథ్(చిన్ని)తో కలిసి నారాలోకేశ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, జలీల్‌ఖాన్ భవిష్యత్తు పూచీ తనదని తెలిపారు. జలీల్‌ఖాన్ మాట్లాడుతూ, టీడీపీలోనే కొనసాగుతానని, రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనార్టీల మద్దతు కూడగడతానని, లోకేశ్‌కు తెలిపారు. వైసీపీ నేతలను కలవడం యాదృశ్చికమే అన్నారు. ఏది ఏమైనా వచ్చే ఎన్నికల్లో పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. టిక్కెట్ ఇస్తే 30వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

నేటినుంచి ఇంటర్ పరీక్షలు

వన్ టౌన్, ఫిబ్రవరి 29 : రాష్ట్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. ఈమేరకు పరీక్షల నిర్వహణకు ఇంటర్మీడియెట్ విద్యామండలి అన్ని ఏర్పాట్లు చేసింది. మార్చి 19తో మొదటి సంవత్సరం పరీక్షలు, 20తో ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగియనున్నాయి. మార్చి ఒకటో తేదీన ద్వితీయ భాష, 4వతేదీన ఇంగ్లీష్, 6వతేదీన గణితం, వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం, 9వతేదీన గణితం 1బి, జంతు శాస్త్రం, చరిత్ర, 12వతేదీన భౌతిక శాస్త్రం, ఆర్థశాస్త్రం, 14 వతేదీ రసాయన శాస్త్రం, వాణిజ్య శాస్త్రం, సమాజ శాస్త్రం, లలితకళలు, 16 వతేదీ ప్రభుత్వపాలనా శాస్త్రం, తర్కశాస్త్రం, బీపీసీ విద్యార్థుల కోసం బ్రిడ్జ్‌కోర్సు, గణితం, 19వతేదీ ఆధునిక భాష, భౌగోళికం పరీక్షలు జరుగుతాయి.

ఏపీ టెట్‌కు 78 శాతం హాజరు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 29 : కృష్ణాజిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో గురువారం జరిగిన ఏపీ టెట్ పరీక్షల్లో 3612 మందికి 2828 మంది (78 శాతం) విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 1808 మందికి 1409, మధ్యాహ్నం 1804 మందికి 1419 మంది హాజరయ్యారు. మచిలీపట్నం ఎస్‌విహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలకులు కె.శ్రీనివాసరెడ్డి, డైట్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణలు సందర్శించారు.

స్నాతకోత్సవం దరఖాస్తుల గడువు పొడిగింపు

మచిలీపట్నం టౌన్ : కృష్ణా విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవం నిర్వహించనున్న దృష్ట్యా ఒరిజినల్ డిగ్రీ కోసం మార్చి 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచినట్టు రిజిస్ట్రార్ పి.వీరబ్రహ్మాచారి తెలిపారు. విద్యార్థులు నేరుగా విశ్వవిద్యాలయంలో గాని, పోస్టు ద్వారా గాని దరఖాస్తులు పంపవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాట్య కళాపీఠం ఎంపీఏ విద్యార్థులకు బంగారు పతకాలు


పతకాలు పొందిన విద్యార్థులు

కూచిపూడి, ఫిబ్రవరి 29 : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్యకళాపీఠం ఎంపీఏ విద్యార్థుల్లో నలుగురికి బంగారు పతకాలు లభించినట్టు కళాపీఠం ప్రధానాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020-22 విద్యాసంవత్సరంలో హాజరైన 11 మంది విద్యార్థులలో జి.గాయత్రి, ఆర్.వసంత్ కిరణ్, 2021-23 విద్యాసంవత్సరంలో హాజరైన 17 మంది విద్యార్థులలో పి.దుర్గాభవాని, బి.మల్లిఖార్జునరావులు విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకల్లో కులపతి, తెలంగాణ గవర్నర్ తమిళసై సౌందర్యరాజన్ నుంచి బంగారు పతకాలు, ప్రశంస పత్రాలను అందుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య టి.కిషన్‌రావు, ఆచార్య భట్టు రమేష్‌బాబు, కళాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ఎంపీఏ క్లాస్ అధ్యాపకులు తదితరులు అభినందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	278



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

శ్రీ కృష్ణదేవాలయ పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపన

రాణిగారితోట, ఫిబ్రవరి 29: రాణిగారితోట బందరు కాలువ గట్టుపై వున్న శ్రీ కృష్ణదేవాలయ పునఃనిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలయాన్ని అభివృద్ధి చేయడం సంతోషమని, త్వరలోనే నిర్మాణం పూర్తి చేసుకుని భక్తులకు స్వామి దర్శనం అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఆయల కమిటీ నిర్వాహకులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో గద్దె

లయోలలో ముగిసిన అంతర్జాతీయ అధ్యాపక సదస్సు

భారతీనగర్, ఫిబ్రవరి 29: ఆంధ్రా లయోల ఇంజనీరింగ్ కళాశాలలో కేప్ కామరిన్ ట్రస్ట్, ఆఫీస్ ఆఫ్ ఇంటర్నేషనలైజేషన్, మిస్‌దానో స్టేట్ యూనివర్సిటీ, సులూ ఫిలిప్పీయన్స్, కళాశాల పరిశోధన విభాగం ఆధ్వర్యంలో పరిశోధనాశాస్త్ర ఆధునిక విధానాలు అనే అంశంపై ఆన్‌లైన్ వేదికగా జరిగిన అంతర్జాతీయ అధ్యాపక సదస్సు గురువారంతో ముగిసింది. ఏడురోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ దేశాల పరిశోధనాశాస్త్ర నిపుణులు తమ పరిశోధనా శాస్త్రాలు, నూతన విధానాలపై అధ్యాపకులకు తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ జోజిరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలాస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.మహేష్, పరిశోధనా విభాగ సమన్వయకర్త సిస్టర్ డాక్టర్ క్యాండీ డికూనా, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

పుస్తక సమీక్ష కార్యక్రమం

లయోల కళాశాలలో ఫాదర్ గార్డెన్ లైబ్రరీ హాల్‌లో ప్రముఖ రచయిత రోహిత్ శర్మ రచించిన ది మాస్టరీ మాన్యువల్ ఏ లైఫ్ చేంజింగ్ పర్సనల్, ప్రొఫెషనల్ గ్రేట్‌నెస్ అనే పుస్తక సమీక్ష కార్యక్రమం గురువారం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీజీ వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కె.ఎం. ప్రభుదాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీజీ లైబ్రేరియన్ టి.రోజామణి, లైబ్రేరియన్ సెక్రటరీ డాక్టర్ జి.ఎ. ప్రసాద్ రావు, చందన కావ్య, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల భవిష్యత్తు కోసం చేతులు కలిపాం

● తాడేపల్లిగూడెం సభతో తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు ● బొండా ఉమా

పాయకాపురం, ఫిబ్రవరి 29 : రాబోయే ఎన్నికలు అత్యంత కీలకమని, టీడీపీ, జనసేన పార్టీలు చేతులు కలిపింది అధికారం కోసం కాదు ఐదు కోట్ల ఆంధ్రరాష్ట్ర ప్రజల భవిష్యత్తు కొరకే అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో గురువారం విలేకర్ల సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ టీడీపీ-జనసేన పార్టీల ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో జరిగిన భారీ బహిరంగ సభతో తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు మొదలైందన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, రాష్ట్ర పునర్నిర్మాణానికి పెట్టుకున్న కూటమికి ప్రజలు చేతులు కలపాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని అన్ని విధాల విధ్వంసం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ వైనాట్ 175/175 అంటున్నాడని, జగన్‌కు ప్రజలు మళ్లీ ఎందుకు ఓటు వేయాలో చెప్పాలని డిమాండ్ చేశారు. పులివెందులలో జగన్‌కు ఓటమి తప్పదని చెప్పారు. జగన్ ఎన్ని కుయుక్తులు పన్నినా రాబోయే ఎన్నికల్లో టీడీపీ- జనసేన పొత్తు సూపర్ హిట్ అని, జనసేన- టీడీపీ కూటమి 150 సీట్లు పైచిలుకు స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



బొండా ఉమాను మర్యాదపూర్వకంగా కలసిన సుబ్రహ్మణ్యం

● బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ

58వ డివిజన్‌లోని వడ్డెర కాలనీలో గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను స్థానికులకు వివరించారు. టీడీపీ-జనసేన అధికారంలోకి రాగానే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు.

మర్యాదపూర్వక కలయిక

అజిత్‌సింగ్‌నగర్: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావును టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలకలపూడి సుబ్రహ్మణ్యం గురువారం అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బొండా ఉమాకు సుబ్రహ్మణ్యం శాలువా కప్పి టీటీడీ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తమ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, సెంట్రల్ టీడీపీ అభ్యర్థి బొండా ఉమా అఖండ మెజారిటీతో గెలుపొందాలని ఆకాంక్షించారు. బొండా ఉమాను కలసిన వారిలో పైడి శ్రీను, పరుచూరి ప్రసాద్ ఉన్నారు.

రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే

రాష్ట్రంలో రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే అని తమ అధినేత చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో అడుగుపెట్టడం ఖాయమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ అన్నారు. టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థిగా బొండా ఉమామహేశ్వరరావును ప్రకటించిన సందర్భంగా గురువారం ఉయ్యూరులోని వీరమ్మ తిరునాళ్లలో అమ్మవారికి కుటుంబ సమేతంగా మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బొండా ఉమా అత్యధిక మెజారిటీతో గెలిచి రికార్డు సృష్టిస్తారని పేర్కొన్నారు.

జెండా సభతో వైసీపీ ఓటమి ఖరారు

● జనసేన నేతలు పోతిన, కిరణ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 29: తాడేపల్లిగూడెం సభతో వైసీపీ ఓటమి ఖరారయిందని జనసేన అధికార ప్రతినిధి, విజయవాడ పశ్చిమ ఇన్‌ఛార్జి పోతిన మహేశ్, తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ అన్నారు. వన్‌టౌన్‌లోని పార్టీ కార్యాలయంలో గరువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన- టీడీపీ సభ చూసి జగన్ అండ్‌కోలో భయం పట్టుకుందన్నారు. సభ జరిగిన ప్రాంగణంలో ఎంత మంది ఉన్నారో బయట అంత మంది ఉన్నారని, వారంతా కూడా ఏకపక్షంగా టీడీపీ- జనసేన ప్రభుత్వాన్ని చూడాలనుకుంటున్నారని తెలిపారు. జనం రాకుండా అడ్డుకునేందుకు పోలీసులతో ఆటంకాలు చేయించారని, అరెస్టులు చేశారని తెలిపారు. జగన్ అండ్ కో ఓటమి ఖరారైందన్నారు. వైసీపీ పతనం కోసం సభ పెట్టామని తెలిపారు. అతి త్వరలోనే టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేస్తామని,దీంతో వైసీపీ కోటలు బద్ధలవుతాయని తెలిపారు. వైసీపీ ప్యాకప్ కావడం ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లో 25 ఎంపీ సీట్లు, 160 అసెంబ్లీ సీట్లను గెలవబోతున్నామని తెలిపారు.

భాను లేని లోటు తీర్చలేనిది: బుద్దా వెంకన్న

విద్యాధరపురం, ఫిబ్రవరి 29: తన అనుచరుడు బావిశెట్టి భాను లేని లోటు తీర్చలేనిదని టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన భాను దశ దినకర్మ కార్యక్రమం గురువారం భవానీపురం షాదీఖానాలో జరిగింది. ఈకార్యక్రమంలో ఆయన, మిగతా నాయకులతో కలిసి భాను చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంలో ఆయన భాను మృతి బాధాకరమన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



భాను చిత్రపటానికి నివాళులు సమర్పించిన బుద్దా వెంకన్న, నాయకులు

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

భవానీపురం,ఫిబ్రవరి 29 : భవానీపురంలోని 41వ డివిజన్ దళితవాడ 120 సచివాలయం పరిధిలో మహిళలకు కుట్టుశిక్షణ కేంద్రాన్ని గురువారం మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. 40, 41 డివిజన్లల్లోని మహిళలకు 30 మంది చొప్పున రెండు బ్యాచ్‌లకు మూడు నెలల వరకు శిక్షణ ఇప్పిస్తున్నామని, ఇది మార్చి 1 నుంచి ప్రారంభం అవుతుందన్నారు. కార్పొరేటర్లు మహ్మద్ ఇర్ఫాన్, యరడ్ల ఆంజనేయరెడ్డి, వైసీపీ నాయకులు జోసెఫ్ శివమణి, ఇషాక్, రెహమాన్‌లు పాల్గొన్నారు.

డిస్నీల్యాండ్ స్థలంలో కబేళా ఏర్పాటు అమానుషం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 29 : పేద, బడుగు, బలహీన వర్గాలు ఎక్కువగా నివసిస్తున్న అజిత్‌సింగ్‌నగర్ డిస్నీల్యాండ్ స్థలంలో కబేళా ఏర్పాటుకు నగరపాలక సంస్థ తీర్మానం చేయటం అమానుషమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. వాంబేకాలనీ డిస్నీల్యాండ్ స్థలంలో కబేళా ఏర్పాటును విరమించుకుని సదరు స్థలాన్ని పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో గురువారం డిస్నీల్యాండ్ వద్ద నిరసన జరిగింది. ఈ కార్యక్రమంలో బాబూరావు మాట్లాడుతూ డిస్నీల్యాండ్ లీజు పరిమితి పూర్తయి 57 ఎకరాల స్థలాన్ని నగరపాలక సంస్థ స్వాధీనం చేసుకుందని తెలిపారు. సదరు స్థలంలో కబేళా ఏర్పాటు చేయడం వలన ఈ ప్రాంతం తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ ప్రజలు ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. జగన్ ప్రభుత్వం పేదలను పొమ్మనకుండా పొగబెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు డిస్నీల్యాండ్ స్థలంలో కబేళా ఏర్పాటుకు చర్యలు విరమించుకోవాలని, సదరు స్థలాన్ని పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించి తక్షణమే రిజిస్ట్రేషన్లు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు కాశీనాథ్, కేవీ భాస్కరరావు, రమణారావు, కె.దుర్గారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబూరావు

ఊర్మిళానగర్ రోడ్డుకు మోక్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భవానీపురం, ఫిబ్రవరి 29 : ఎట్టకేలకు నాలుగేళ్ల తర్వాత ఊర్మిళానగర్ మెయిన్ రోడ్డుకు మోక్షం లభించింది. ఈ నెల 12న 'ఎన్నాళ్లీ అగచాట్లు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పట్లో ఇచ్చిన వివరణతో పూర్తి స్థాయిలో రోడ్డు అభివృద్ధి పనులను పూర్తి చేయించారు. కాంట్రాక్టర్‌ను వెంటాడి మరి శరవేగంగా పూర్తి చేయించడంతో ఎనిమిది నెలలుగా అస్తవ్యస్తమైన రోడ్డుతో అష్టకష్టాలు పడ్డ 30వేల మంది ప్రజల కష్టాలకు మోక్షం లభించింది.



అభివృద్ధి చేసిన ఊర్మిళానగర్ మెయిన్ రోడ్డు

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

పాయకాపురం, ఫిబ్రవరి 29 : రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన పాయకాపురం ప్రాంతంలో గురువారం జరిగింది. వివరాల ప్రకారం వాంబేకాలనీలో ఉంటున్న బట్ట రజిని (34) కండ్రికలోని కేర్ అండ్ షేర్ స్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వహిస్తుంది. గురువారం సాయంత్రం రజిని స్కూల్ నుంచి ఇంటికి తన ద్విచక్రవాహనంపై బయలుదేరింది. ప్రకాష్ నగర్ ప్రాంతం వచ్చేసరికి వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడింది. సమాచారం అందుకున్న స్థానిక సీఐ ఎస్. దుర్గాప్రసాద్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్టేషన్‌లో యువకుడి మృతి

వన్‌టౌన్, ఫిబ్రవరి 29: బస్టేషన్ 46వ ప్లాట్‌ఫారం వద్ద ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన యువకుడు ధనిత్ కుమార్ మల్లి (26) చనిపోయినట్లు కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. అతని వద్ద ఉన్న ఆధార్‌కార్డు ద్వారా పేరును గుర్తించారు కానీ, అతను ఎక్కడి నుంచి వస్తున్నాడు? ఏం చేస్తాడు తెలియరాలేదు.

గయాజుద్దీన్ ముందస్తు అరెస్టు

భవానీపురానికి చెందిన జనసేన నగర అధికార ప్రతినిధి షేక్ గయాజుద్దీన్‌ను గురువారం భవానీపురం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పోలీసు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా జనసేన రథయాత్ర ప్రారంభిస్తున్నట్లు పోలీసులకు సమాచారం తెలిసింది. దీంతో స్వాతి సెంటర్ వద్ద అతనిని అదుపులోకి తీసుకుని భవానీపురం పోలీసులు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని కేసు నమోదు చేశారు.

ఓపెన్ డయాస్ ప్రారంభం

పాయకాపురం, ఫిబ్రవరి 29 : 63వ డివిజన్ విశాలాంధ్ర కాలనీలో రూ. 21.40 లక్షలతో నిర్మించిన ఓపెన్ డయాస్‌ను గురువారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. అనంతరం రూ. 11.07 లక్షల వ్యయంతో చేపట్టిన పార్కు సూపర్ వైజర్ గది నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, పసుపులేటి ఏసు, డీఈ గురునాథం, ఏఈ మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలపై 5న సమీక్ష

తిరువూరు: నెమలి శ్రీవేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం మార్చి 5న తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో కె.మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 25 నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నందున ఏర్పాట్లపై సమావేశం జరగనున్నట్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మైలవరం, ఫిబ్రవరి 29: నేటి నుంచి (శుక్రవారం)జరగనున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్‌లు ఎం.రాధాకృష్ణ, సుభాషిణి, బుచ్చిబాబు తెలిపారు. మైలవరంలోని వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, లిటిల్ ఫ్లవర్, ఎస్‌వీఆర్‌జీఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఉదయం 9గంటలకే పరీక్ష ప్రారంభమై 12 గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.45 గంటలకు చేరుకోవాలన్నారు.



వీరమ్మ తిరునాళ్లకు భక్తుల రద్దీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 29 : వీరమ్మ తిరునాళ్లకు భక్తుల రద్దీ పెరుగుతుంది. తిరునాళ్ల 11వ రోజైన గురువారం వేకు వజాము నుంచి ఆలయం వద్ద భక్తుల రద్దీ కన్పించింది. సోమవారంతో తిరునాళ్ల ముగియనున్న నేపథ్యంలో అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. అమ్మవారికి పసుపు కుంకుమ, చీర సారె సమర్పించేందుకు ఆలయ ప్రాంగణంలో దుకాణాలు మహిళలతో కిటకిటలాడుతున్నాయి.

ప్రసాదం పంపిణీ

వీరమ్మ తిరునాళ్లలో భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు ప్రసాదం పంపిణీ చేస్తున్నాయి. పద్మశాలీ సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వేలాది మందికి పులిహోర, చక్కర పొంగలి ప్రసాదంగా పంపిణీ చేశారు. పలువురు చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

వాసవ్య మహిళామండలి హాస్టల్‌లో అగ్నిప్రమాదం

పెనమలూరు, ఫిబ్రవరి 29: వాసవ్య మహిళామండలి హాస్టల్‌లో గురువారం పొద్దుపోయిన తర్వాత అగ్నిప్రమాదం జరిగింది. వివరాల ప్రకారం కానూరు వినాయక్‌నగర్‌లోని వాసవ్య మహిళామండలి హాస్టల్‌లో గురువారం రాత్రి మహిళలు తమ గదిలో దోమల చక్రం వెలిగించడంలో అజాగ్రత్తగా వ్యవహరించడంతో అది పరుపు మీద పడి రూంలోని వస్తువులు మంటలకు ఆహుతయ్యాయి. ఆటోనగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది వెంటనే సమాచారం తెలుసుకొని అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. హాస్టల్లో ఉంటున్న మహిళలకు ఎటువంటి ఇబ్బంది జరగలేదు.

అరుదైన సినిమా అవుతుంది



"గామి' అరుదైన సినిమా. ఆరేళ్లపాటు అంకితభావంతో తెరకెక్కించడం మామూలు విషయం కాదు. సినిమాపై ఎంతో ప్రేమ ఉంటే తప్ప ఇది సాధ్యం కాదు' అని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. విష్వక్‌సేన్ కథానాయకుడిగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహించిన 'గామి' చిత్రం ట్రైలర్‌ను సందీప్‌రెడ్డి వంగా విడుదల చేశారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'ఇది రెగ్యులర్ చిత్రం కాదు. మాస్ అంశాలు ఉండవు. అయినా 'గామి' ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. తెలుగు పరిశ్రమ గర్వపడే సినిమా అవుతుంది' అన్నారు. సినిమా చూస్తున్నంతసేపు తర్వాత ఏం జరగబోతోందో అనే ఉత్సుకత ప్రేక్షకుల్లో కలుగుతుందని విద్యాధర్ తెలిపారు. ఈ సినిమాకు పనిచేసినవారికీ, సాయం చేసిన వారికి నిర్మాత శబరీషన్ ధన్యవాదాలు తెలిపారు.

అరి అన్వేషణ



వినోద్‌వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయికుమార్ ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'అరి'. 'పేపర్‌బాయ్' ఫేం జయశంకర్ దర్శకుడు. శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి వినోద్ వర్మ క్యారెక్టర్ ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. గ్రంథాలయంలో తీక్షణంగా శోధిస్తున్న లుక్‌లో ఆయన కనిపించారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్. సినిమాటోగ్రఫీ: కృష్ణ ప్రసాద్


శ్రీవిష్ణు డబుల్ ధమాకా



గురువారం హీరో శ్రీవిష్ణు పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయన కథానాయకుడిగా రెండు కొత్త చిత్రాలను నిర్మాణ సంస్థలు ప్రకటించాయి. గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్ సంయుక్తంగా కార్తిక్‌రాజు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. అల్లు అరవింద్ సమర్పకులు. 'ఎస్ వీ 18' వర్కింగ్ టైటిల్. వినూత్నమైన ప్రేమకథా చిత్రమిదని నిర్మాణ సంస్థలు పేర్కొన్నాయి. అలాగే హసిత్ గోలీ దర్శకత్వంలో శ్రీ విష్ణు హీరోగా నటిస్తున్న చిత్రానికి 'శ్వాగ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. ఇతర వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

మనసు నొచ్చుకుంటే మన్నించండి

నాగేంద్రబాబు



వరుణ్‌తేజ్ హీరోగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగేంద్రబాబు మాట్లాడుతూ 'ఆరడుగుల మూడంగుళాలు ఉండే హీరోలు పోలీసు పాత్రలు చేస్తే బావుంటుంది. ఐదడుగుల మూడంగుళాలు ఉండే హీరోలయితే చూడ్డానికి ఎబ్బెట్టుగా ఉంటుంద'ని వ్యాఖ్యానించారు. దీనిపై పలువురు టాలీవుడ్ హీరోల అభిమానులు సోషల్ మీడియాలో నాగబాబు తీరును తప్పుపట్టారు. దీంతో సోషల్ మీడియా వేదికగా నాగేంద్రబాబు స్పందించారు. 'ఎవరినో తక్కువ చేయాలని అలా మాట్లాడలేదు, నా మాటల వల్ల ఎవరి మనసునైనా నొప్పించి ఉంటే క్షమించండి' అని కోరారు.

ముచ్చటగా మూడోసారి



నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్, దర్శకుడు ఇంద్రగంటి మోహన్ కృష్ణ ముచ్చటగా మూడోసారి ఓ సినిమాను పట్టాలెక్కించనున్నారు. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ చిత్రంలో కథానాయకుడిగా ప్రియదర్శి నటించనున్నారు. మార్చి నెలాఖరు నుంచి ఈ చిత్రం షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సూపర్ హిట్ కాంబోగా పేరున్న వీరిద్దరి నుంచి గతంలో వచ్చిన రెండు చిత్రాలూ విశేష ప్రేక్షకాదరణను పొందాయి. దీంతో ఈ మూడవ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి వీరిద్దరి కలయికలో వచ్చిన మొదటి చిత్రం 'జెంటిల్‌మేన్' 2016లో విడుదలై భారీ విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ సినిమాలో నాని, నివేథా థామస్, సురభి నటించారు. ఆ తర్వాత 2017లో వచ్చిన మరో సూపర్ హిట్ చిత్రం 'సమ్మోహనం' ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఇందులో సుధీర్ బాబు, అదితి రావు హైదరీ ప్రధాన పాత్రలు పోషించారు.

తల్లి కాబోతున్న దీపికా పదుకొణె



బాలీవుడ్ బెస్ట్ కపుల్స్‌లో ఒకరిగా పేరొందిన దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్ జంట అభిమానులకు తీపి కబురందించారు. త్వరలోనే తల్లిదండ్రులు కాబోతున్నామని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా గురువారం ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్లు, సెప్టెంబర్‌లో డెలివరీ డేట్ ఇచ్చారని ఆ పోస్టులో పేర్కొన్నారు. 2013లో రణ్‌వీర్, దీపికా 'రామ్‌లీలా'లో కలిసి నటించారు. ఆ సినిమా షూటింగ్ సమయంలో ఇరువురూ ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత 2018లో వీరిద్దరూ ఇటలీలో ఘనంగా డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకున్నారు.

మంచి సినిమాతో వస్తున్నాం

శివ కందుకూరి



శివ కందుకూరి హీరోగా రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్దం భాస్కర నారాయణ' నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో శివ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'క్రైమ్, డిటెక్టివ్ థ్రిల్లర్స్ తెలుగులో చాలా వచ్చాయి. అందుకే ఏదో కొత్తదనం ఉంటే తప్ప అలాంటి సినిమా చేయకూడదని అనుకున్నాను. 'భూతద్దం భాస్కర నారాయణ' చిత్ర కథ విన్నాక కొత్తగా అనిపించింది. ఎందుకంటే ఇందులో మైథాలజీ ఎలిమెంట్ కూడా ఉంది. దిష్టి బొమ్మ చూస్తుంటాం. కానీ అసలు ఎందుకది అనే విషయాన్ని పట్టించుకోం. దీని గురించి పురాణాల్లో ఒక కథ ఉంది. ఆ కథకు క్రైమ్, డిటెక్షన్ అంశాలు జోడించాం. కచ్చితంగా ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మా చిత్రాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ విడుదల చేస్తుండడం మరింత బలాన్ని ఇచ్చింది' అని చెప్పారు.

కొత్త కాన్సెప్ట్‌తో... ఎస్ 99



సి.జగన్ మోహన్ దర్శకత్వంలో యతీష్, నందిని నిర్మించిన 'ఎస్ 99' చిత్రం ప్రీ రిలీజ్ వేడుక ఇటీవలే నిర్వహించారు. ప్రేక్షకులకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్ అందివ్వాలనే ఉద్దేశంతో విలక్షణ సబ్జెక్ట్‌ను ఎంచుకున్నామని దర్శకుడు తెలిపారు. ఇది విజువల్స్, సౌండ్ ప్రధానంగా సాగే కాన్సెప్ట్ బేస్డ్ చిత్రమన్నారు. ఎటువంటి నేరచరిత్ర లేని ఒక వ్యక్తి క్రైమ్‌కు పాల్పడితే ఎలా ఉంటుందో ఆసక్తికరంగా చూపించడమే కథాంశమని వివరించారు. సినిమాకు టీం స్పిరిట్ ప్రధానమని, ఈ విషయంలో మాకు మంచి టీం దొరికిందని నిర్మాత యతీష్ సంతోషం వ్యక్తం చేశారు.

జానపద, సినీగాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ కన్నుమూత



ప్రముఖ జానపద, సినీ గాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్(64) గురువారం ఉదయం సికింద్రాబాద్ సీతాఫల్‌మండి శ్రీనివాస్‌నగర్ లోని తన స్వగృహంలో మృతిచెందారు. ఆయనకు భార్య ఇందిర, కుమార్తె మానస ఉన్నారు. ఇప్పటి వరకు సుమారు 14వేల ప్రదర్శనలను ఇచ్చిన శ్రీనివాస్ తొలిసారిగా 'నమస్తే అన్న' చిత్రంలో 'గరం... గరం... పోరీ... నా గజ్జెల సవారీ' పాట పాడారు. ఆ తర్వాత నాగార్జున 'కింగ్' సినిమాలో 'గింత, గింత బాల చుక్కవే' పాట పాడారు. పవన్‌కల్యాణ్ నటించిన 'గబ్బర్‌సింగ్' చిత్రంలో శ్రీనివాస్ పాడిన 'గన్ను లాంటి కన్నులున్న...' పాట ఎంతో హిట్ అయ్యింది. ఈ పాటకు 2012 సంవత్సరంలో ఉత్తమగాయకుడిగా ఫిల్మ్ ఫేర్ అవార్డు అందుకున్నారు. గురువారం సాయంత్రం వడ్డేపల్లి శ్రీనివాస్ అంత్యక్రియలు సీతాఫల్‌మండి శశ్మానవాటికలో జరిగాయి.

బౌద్ధనగర్ (ఆంధ్రజ్యోతి)

నివేదన




గీతాసారం

భగవద్గీత శాశ్వతం

మన సమాజంలో ఉన్న చట్టాలు బయటి ప్రపంచంలో క్రమానుగతమైన వ్యవస్థను నిలబెట్టడం కోసమైతే... భగవద్గీత మన ఆంతరంగిక ప్రపంచంలో సమత్వాన్ని, సద్భావనను నిలబెట్టుకోవడం కోసం. మనం చేసే ఏ కర్మకయినా రెండు భాగాలు ఉంటాయి. మొదటిది ఉద్దేశం, రెండోది అమలు చేయడం. చట్ట పరిభాషలో వీటిని 'మెన్స్ రియా అండ్ ఆక్టస్ రియస్' అని (లాటిన్ పదాల్లో) పేర్కొంటారు. ఉదాహరణకు... ఒక సర్జన్, ఒక హంతకుడు ఇద్దరూ కత్తిని ఉపయోగిస్తారు. సర్జన్ ఉద్దేశం కాపాడడం, చికిత్స చేయడం. హంతకుడి ఉద్దేశం హాని చేయడం, చంపడం. రెండు సందర్భాలలోనూ మరణం సంభవించవచ్చు. కానీ ఉద్దేశాలు మాత్రం ఒకదానికి ఒకటి పూర్తిగా విరుద్ధమైనవి.

చట్టం పరిస్థితులను బట్టి మారుతుంది. కానీ భగవద్గీత ఎప్పటికీ మారనిది, శాశ్వతమైనది. రోడ్డుకు ఎడమవైపు వాహనం నడపడం ఒక దేశంలో చట్టబద్ధమైతే, మరో దేశంలో దాన్ని నేరంగా పరిగణించవచ్చు. చట్టం పనులను... 'మంచి పని, చెడ్డ పని' అంటూ విభజిస్తుంది. కానీ జీవితంలో అనేక సందేహాస్పదమైన పరిస్థితులు ఉంటాయి. మనం పన్నులు కడుతున్నంత వరకూ అది ఇష్టంతో కట్టారా? కష్టంతో కట్టారా? అనే దానితో చట్టానికి సంబంధం లేదు. మనం ఉంటున్న ప్రాంతంలోని చట్టం ప్రకారం... అది నిర్వచించే పరిమితుల్లో మనం ఉన్నంత వరకూ చట్టం మన జోలికి రాదు. ఎవరైనా ఒక నేరం చేయాలని ఆలోచిస్తూ ఉన్నట్టయితే దానికి చట్టం అడ్డు రాదు. నేరం చేసిన తరువాత మాత్రమే అది రంగంలోకి దిగుతుంది. కానీ అటువంటి ఆలోచనలను కూడా నిర్మూలించాలని భగవద్గీత చెబుతుంది. 'మొక్కై వంగనిది మానై వంగదు' అన్నట్టు 'ఉద్దేశం దశలో ఉన్న (చేయాలనుకుంటున్న) కర్మ గురించి అవగాహన ఉండాలి. లేకపోతే అది మన నియంత్రణను దాటిపోతుంది' అని భగవద్గీత బోధిస్తుంది. ఆ ఉద్దేశాన్ని అమలు చేయడం అనేది భవిష్యత్తులో జరిగే పని. ఉద్దేశం దశలోనే దాన్ని ఆపకపోతే... ఆ తరువాత దాని మీద మనకు ఎటువంటి నియంత్రణా ఉండదు. ఉద్దేశాలను అధిగమించి ఎదగడానికి భగవద్గీత మనకు సాయపడుతుంది. ఉద్దేశం మంచిదయినా, చెడ్డదయినా... అది విజయంతో లేదా అపజయంతో కలిసినప్పుడు అహంకారమైనా పెరుగుతుంది లేదా బలహీనమైన క్షణంలో లావాలా పెల్లుబికే నిరాశ, నిస్పృహ మనసులో వేరు కుంటాయి. ఈ రెండు రకాల పరిస్థితులు మనల్ని మన అంతరాత్మ నుంచి దూరం చేస్తాయి. మన ఉద్దేశాలను గమనించి, వాటిపై అవగాహనను పెంచుకోవాలి. అప్పుడే వాటిని అధిగమించి... అంతరాత్మను చేరుకోగలుగుతాం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

కాశీ... మోక్షదాయిని ఎలా అయింది?

అక్కడ మోక్షం కోసం ఇళ్ళు అద్దెకు ఇస్తారు. మోక్షం కోసం సత్రాలు నడుపుతారు. మోక్షం కోసం హోటళ్ళలో గదులు ఇస్తారు. మోక్షం కోసం ఆశ్రమాలు కడతారు. మోక్షం కోసం ఇలా వసతిని సమకూర్చే ప్రదేశం మరెక్కడైనా ఉందా? మోక్షం లభిస్తుందని హామీ ఇచ్చే ఊరు మరొకటి ఉందా? ప్రపంచంలో మరెక్కడా లేదు... ఒక్క కాశీ నగరం తప్ప.

ఐఐటీ, నీట్ పరీక్షలకు గ్యారెంటీ ఇస్తున్న... కోట, హైదరాబాద్, ఢిల్లీ లాంటి ఊర్లున్నాయి. ఆ పరీక్షల్లో నెగ్గడానికి మా దగ్గర సులువైన మార్గాలు ఉన్నాయని చెప్పే సంస్థలు ఉన్నాయి. కానీ మోక్షానికి మార్గం చూపించే వ్యవస్థ ఎక్కడైనా ఉందా... ఒక్క కాశీలో తప్ప!

దేశం నలుమూలల నుంచి ఎందరెందరో కాశీ వస్తున్నారు... అక్కడ మోక్షం పొందాలని. కొందరు కాశీలోనే శాశ్వతంగా ఉండిపోతున్నారు. మరికొందరు తొమ్మిదినెలలు... ఇంకొందరు తొమ్మిది రోజులు. అలా తొమ్మిది నెలలు ఉండడానికి వచ్చిన రామశాస్త్రి అనే వ్యక్తిని కలిశాను. ఆయన బ్యాంకు మేనేజర్‌గా పదవీ విరమణ చేశారు. భార్యాసమేతంగా వచ్చి ఆంధ్రాశ్రమంలో ఉంటున్నారు. ఆంధ్రాశ్రమం ట్రస్టీ సుందరశాస్త్రి నాకు మంచి మిత్రులు. ఆ ఆశ్రమంలో సుమారు వంద గదులున్నాయి. వాటిలో పది గదులు ఇలా మోక్షం కోసం వచ్చిన వాళ్ళకు కేటాయిస్తారు.

అదొక చిన్న గది. అందులోనే వంట, భోజనాలు, నిద్ర. చదువుకోవడం. రామశాస్త్రిగారి మంచం మీద గీతాప్రెస్ వారు ప్రచురించిన 'శ్రీమద్భగవద్గీత' (తత్త్వవివేచనీ ఆంధ్రానువాదం) ఉంది.

"మీరు ఇక్కడ తొమ్మిది నెలలు ఉండాలని ఎందుకు నిర్ణయించుకున్నారు?" అని రామశాస్త్రిని అడిగాను.

"తల్లి గర్భంలో నవమాసాలు ఉంటాం. ఆ తరువాత భూమిమీదకు వస్తాం. కళ్ళు తెరిచి ప్రపంచాన్ని చూస్తాం. తొమ్మిది నెలలు కాశీలో ఉంటే... ఈ ప్రపంచం నుంచి ముక్తి దొరుకుతుంది. అంటే మోక్షం లభిస్తుంది. మరు జన్మ ఉండదు" అన్నారాయన.

"కాశీలో ఉన్నవారందరికీ ముక్తి లభిస్తుందా?" అని అడిగాను.

ఆయనను నేను వాదనల ఊబిలోకి దించుతున్నట్టు ఆయన భార్య భావించారు. "మోక్షం ఏమైనా ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే రేషనా? లక్ష్యం కోసం అందరూ ప్రయత్నిస్తారు. కానీ ఫలితం ఏ కొందరికో దక్కుతుంది" అని అన్నారావిడ.

> జన్మ-పునర్జన్మల చక్రం నుంచి విముక్తి పొందడమే మోక్షం. భక్తి, జ్ఞాన, కర్మ మార్గాల ద్వారా మోక్షం పొందే అవకాశం కేవలం మనిషికే ఉంది.

"కాశీవాసానికి కొన్ని నియమ నిష్ఠలున్నాయి. 'బ్రహ్మవైవర్త పురాణం'లో వీటి గురించి చెప్పారు. నేల మీదనే పడుకోవాలి. చెప్పులు లేకుండా నడవాలి. శాకాహారం తినాలి. దయాదృష్టి ఉండాలి. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. తక్కువ మాట్లాడాలి. ఎక్కువ ధ్యానం చేయాలి. కామ, క్రోధ, లోభాలకు దూరంగా ఉండాలి. సాత్త్విక జీవనం గడపాలి" అన్నారు రామశాస్త్రి.

"మీరేమీ అనుకోనంటే నా సందేహాలు నివృత్తి చేసుకుంటాను" అని అడిగాను.

ఆయన ధార్మిక గ్రంథాలు బాగా చదివారు. నా ఆసక్తిని గమనించి "అడగండి. మీతోపాటు నేనూ తెలుసుకుంటాను" అన్నారు చిరునవ్వుతో.

"ఈ లోకమంతా ఆ దేవుడి సృష్టే. ఆ సృష్టిలో మనం ఒక చిన్న భాగం. ఈ సృష్టిలో ఏ ప్రాణీ మోక్షం కోసం ప్రయత్నించడం లేదు మరి మనమెందుకు ప్రయత్నించాలి?" అని ప్రశ్నించాను.

నా పక్కనే కూర్చున్న సుందరశాస్త్రి 'ఇంకేమీ అడగొద్దు' అన్నట్టు నా చేతిమీద చెయ్యి వేస్తూ... "ఇది నమ్మకమండీ. నమ్మకానికీ, తర్కానికీ పొంతన కుదరదు" అన్నారు. సుందరశాస్త్రి కాశీలో తెలుగువారికి కేంద్రబిందువు. అందరితో ఆయనకు ఆప్యాయమైన సంబంధం ఉంది. అందుకే మిరపకాయల్లాంటి నా ప్రశ్నలను ఆపాలనుకున్నారు.

అయితే "లేదండీ సుందరం. వారు మంచి ప్రశ్న అడిగారు. సమాధానాన్ని కలిసి కనుక్కుందాం" అంటూ... "ఎనభై నాలుగు లక్షల జీవరాశుల్లో అనేకసార్లు పుట్టిన తరువాత, గిట్టిన తరువాత లభించే అపురూపమైన జన్మ... మానవ జన్మ. జీవరాశుల్లో మనిషికి మాత్రమే బుద్ధి ఉంది. అనేక జన్మల కర్మఫలాలు ఆ జీవుడితో ప్రయాణిస్తాయి. ఆ కర్మఫలాలను ఆ జీవి అనుభవించాలి. జన్మ-పునర్జన్మల చక్రం నుంచి విముక్తి పొందడమే మోక్షం. భక్తి, జ్ఞాన, కర్మ మార్గాలద్వారా మోక్షం పొందే అవకాశం కేవలం మనిషికే ఉంది. అందుకే 'జంతూనాం నర జన్మ దుర్లభం' అన్నారు 'వివేక చూడామణి' గ్రంథంలో శంకరాచార్యులు" అని వివరించారు రామశాస్త్రి.

"మరి కాశీలోనే మోక్షం లభిస్తుందనడానికి ఏదైనా ఆధారం ఉందా?" అని అడిగాను.

"అవునండీ. 'కాశీ ఖండం' గ్రంథంలోని 26వ అధ్యాయంలో పేర్కొన్న ప్రకారం... మహా ప్రళయం తరువాత ఈ సృష్టి నాశనమయింది. అంతటా అంధకారం వ్యాపించింది. సూర్యుడు లేడు. చంద్రుడు లేడు. తారలు లేవు. ఉన్నదల్లా ఒక్కటే... బ్రహ్మం. అది మెదడుకు, మనసుకు అందనిది. రంగు, రూపం, పేర్లు లేనిది. విడదీయలేనిది. కానీ అది రెండుగా విడిపోవాలని అనుకుంది. అలా అభౌతిక బ్రహ్మం నుంచి భౌతికమైన శివ పార్వతులు ఉద్భవించారు. వారు ఆనందవనాన్ని (కాశీని) సృష్టించారు. ఆ ఆనందవనంలో విహరిస్తున్న శివ పార్వతులు మరో జీవిని సృష్టించాలనుకున్నారు. విష్ణువును సృష్టించారు. విష్ణువు ఒక చెరువును (విష్ణుకూపం) తవ్వాడు. దాని పక్కనే కూర్చొని... యాభై వేల ఏళ్ళు తపస్సు చేశాడు. అక్కడకు శివ పార్వతులు వచ్చారు. తపస్సుతో జ్వలిస్తున్న విష్ణువును చూశారు. విష్ణుకూపంలోకి శివుడు తొంగి చూస్తూ ఉండగా... ఆయన చెవి కుండలం జారి పడింది. ఆ కూపాన్ని 'మణికర్ణిక' (చెవికి అలంకారమైన రత్నం) అని పిలవాలని శివుడు ఆదేశించాడు. విష్ణువు తపస్సుకు మెచ్చిన శివుడు ఆయనను వరం కోరుకోమన్నాడు. నిత్యం శివపార్వతుల దర్శనం లభించాలని, శివుని పాదపద్మాల మకరందాన్ని సేవించడానికి తనకు తేనెటీగ రూపాన్ని ప్రసాదించాలని, ఇక్కడ మరణించినవారికి ముక్తి ప్రసాదించాలని విష్ణువు కోరాడు. శివుడు ఆ వరాలన్నీ ప్రసాదించాడు. అంతేకాదు... కాశీలో నివసించేవారికి ఎల్లప్పుడూ సత్యయుగమే కొనసాగుతుందనీ, ఇక్కడ పుణ్యకార్యాలు చేసేవారికి అమరత్వం కలుగుతుందనీ అభయమిచ్చాడు. అలా కాశీ మోక్షదాయిని అయింది" అని రామశాస్త్రి వివరిస్తూ... "మీకు అర్థమయిందా?" అని అడిగారు.

"అవునండీ. చాలా బాగా అర్థమయింది" అని నేను, సుందరశాస్త్రి ఒకేసారి అన్నాం.

"కాశీలోనే పుట్టి పెరిగిన నాకు కూడా ఈ విషయం తెలీదు. మీరు బాగా వివరించారు" అన్నారు సుందరశాస్త్రి.

"మీరు ఇంకా అడగాలని అనుకుంటున్నట్టున్నారు. అడగండి" అన్నారు రామశాస్త్రి నావైపు చూస్తూ.

"మేము మళ్ళీ వస్తామండీ. మాకు కాశీ మోక్షం గురించి చక్కగా చెప్పారు " అంటూ లేచారు సుందరశాస్త్రి. ఇద్దరం అక్కడినుంచి బయలుదేరాం.

● కిల్లాడ సత్యనారాయణ
8333987838

దైవమార్గం

శ్రమ దీక్షలు

క్రైస్తవులు ప్రతి సంవత్సరం నలభై రోజుల పాటు దీక్షను పాటిస్తారు. దాన్ని 'శ్రమదినాల దీక్ష' అంటారు. క్రీస్తు శిలువకు గురైన గుడ్ ఫ్రైడేకి నలభై రోజుల ముందు ఇది ప్రారంభమవుతుంది. ఈ దీక్షా సమయంలో నాలుగు నియమాలను కఠినంగా పాటిస్తారు. వాటిలో ఒకటి ఉపవాస ప్రార్థన. రెండోది పవిత్ర గ్రంథ పఠనం. మూడోది గత దోషాలను గుర్తించి... వాటికి పశ్చాత్తాపం చెందడం. మళ్ళీ వాటిని చేయకుండా ప్రవర్తనను సరిదిద్దుకోవడం. నాలుగోది... పేదలకు, అవసరంలో ఉన్నవారికి, వికలాంగులకు, రోగగ్రస్తులకు ధన రూపంలో, వస్తు రూపంలో, మంచిమాటల ఓదార్పు రూపంలో సాయపడడం. దాన ధర్మాలు చేయడం. ఇవి పాటించడం ద్వారా గుడ్ ఫ్రైడేకి సంసిద్ధులు కావడం జరుగుతుంది. రాబోయే క్రీస్తు పునరుత్థాన (ఈస్టర్) ఉత్సవం కోసం హృదయాలను పవిత్రపరుచుకున్నట్టు అవుతుంది. ఇవే కాకుండా... ఇంకా అనేక రూపాల్లో సహాయాలు చేసేవారూ ఉంటారు. ఈ దీక్షల లక్ష్యం: మనిషిలోని అహంకారాది గుణాలు తొలగిపోవడం. సాత్త్విక భావాలు కలగడం. తోటివారిని ప్రేమించడం. ప్రభువు నేర్పిన ప్రధాన సూత్రాల్లో దేవుణ్ణి ఆరాధించడం ఒకటైతే, తోటివారిని ప్రేమించడం మరొకటి. ఎందుకంటే మన చుట్టూ ఉన్నవారిని ప్రేమించి ఆదరించడమే... ఏ మతానికైనా ఉండే మానవతాపరమైన ప్రాతిపదిక.

ఈ శ్రమదినాలను తపఃకాలంగా క్యాథలిక్‌లు భావిస్తారు. ప్రతి శుక్రవారం శిలువ మార్గ ప్రార్థనల్లో పాల్గొంటారు. ప్రభువు మరణ సంఘటనను పద్నాలుగు స్థలాలుగా (ఘట్టాలుగా) భావించి... ఆ స్థలాల్లో శిలువ యాత్రా సన్నివేశాలను స్మరించుకుంటారు. ఆ సమయంలో తప్పనిసరిగా ఉపవాసాల్లోనే ఉంటారు. ఈ శ్రమదినాల నిష్ఠ... ఈస్టర్‌కు ఒక అర్థవంతమైన పరిపుష్టిని కలిగిస్తుంది. 'నేనే మార్గం' అని ఏసు ప్రభువు చెప్పాడు. ఆ మార్గం సులువైనది కాదని, అది 'శిలువ మార్గం'



అని ఈ శ్రమదినాల్లో మరింతగా అర్థమవుతుంది. ఆయన మార్గంలో సాగించే పయనంలోని కష్టం, క్లిష్టత అనంతరం... హృదయానందం ఏమిటనేది స్పష్టమవుతుంది. క్రీస్తు జననం కన్నా... ఆయన మరణ, పునరుత్థాన ఘట్టాల ద్వారానే క్రీస్తు స్వరాన్ని, ధ్యేయాన్నీ, ఆయన బోధల్లోని అంతరార్థాన్ని స్పష్టంగా గ్రహించగలం. ఆయన మరణానికి కారణం... మనం చేసిన పాపాలేనని, వాటి నుంచి మనల్ని విముక్తి చేయడానికే ఆయన శిలువ ఎక్కాడనీ భావించి... చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెంది, ఆ దైవ కృపకోసం ప్రార్థించేందుకు లభించిన అవకాశమే ఈ శ్రమదినాల దీక్షలు.

● డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు
9866755024

చింతన

హృదయం పిలుపు విందాం

మనకు ఎన్నో విషయాలు ఎదురవుతాయి. మన మనో ప్రవృత్తిలోనే ఎన్నో మార్పులు వస్తూ ఉంటాయి. కానీ వాటిని అర్థం చేసుకోలేం. మనం ఎన్నో పుస్తకాలు చదివినా నేర్చుకోలేనివి , ఎంత అధ్యయనం చేసినా తెలుసుకోలేనివి ఎన్నో ఉన్నాయి. ఇలాంటి అనేక విషయాలను అర్థం చేసుకోవాలంటే... ముందుగా ఒక విషయాన్ని మనం గ్రహించాల్సి ఉంది. అది చాలా ముఖ్యమైనది.

మనసు సంతోషంగా ఉంచడానికీ, శాంతంగా ఉంచడానికీ ప్రయత్నిస్తూనే ఉంది. కానీ ఎవరి మనసులోనూ ఈనాటివరకూ శాంతి లేదు. మనసు విషయంలో ప్రతీదీ మారుతుంది. అక్కడ ఏదీ శాశ్వతం కాదు. కాబట్టి మనసును కాకుండా హృదయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. హృదయాన్ని ప్రేమించాలి.

"మా హృదయం పిలుపును ఎలా వినాలి?" అని చాలామంది నన్ను అడుగుతూ ఉంటారు. హృదయం పిలుపును వినాలంటే... మనసు పిలుపును వినడాన్ని తగ్గించాలి. ఎందుకంటే మనసు గొంతు చాలా పెద్దది. ఎప్పుడైనా రేడియో సౌండ్ ఎక్కువగా ఉండి, పక్కవారి మాటలు వినబడకపోతే మీరేం చేస్తారు? మీరు ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు... పక్కన అంతా గోలగోలగా ఉంటే ఎలా స్పందిస్తారు? ఆ గోల ఆపమంటారు. లేదా దూరంగా వెళ్ళిపోతారు. హృదయం పిలుపును వినాలంటే కూడా చేయాల్సింది ఇదే. హృదయం మీతో ఏదో చెబుతోంది. ఎప్పటినుంచో చెబుతోంది.

మనకంటూ ఏదీ స్థిరంగా ఉండదు. ఒక రోజు నిద్ర లేవగానే మూడ్ బాగుంటుంది. మరో రోజు బాగుండదు. ఒకోసారి ఇంట్లో పనులకే చిరాకుపడతాం. ఒకోసారి ఉద్యోగ పరిస్థితులు బాలేక, ఒంట్లో బాలేక చికాకు పుట్టుకొస్తుంది. దీన్నంతటినీ అర్థం చేసుకొనే శక్తి మన మనసుకు ఉండదు. కానీ హృదయం అర్థం చేసుకోగలదు. ఉదాహరణకు... మీరు ఎక్కడికో వెళ్తున్నారు. ఇందలో ఏదో జరిగి కోపం వచ్చింది. ఆ కోపంలో అరవడం, కేకలు వేయడం లాంటివి చేస్తారు. అలా కోపగించుకోవడం తప్పని మీకు అనిపిస్తుంది. జీవితంలో మీకు కేవలం ఆ ఒక్కసారే కోపం వచ్చిందా? లేదు. కోపం వచ్చాక... ఆ తరువాత దాన్ని మరచిపోతాం. మళ్ళీ కోపం వస్తుంది. మళ్ళీ మరచిపోతాం. అలాంటి పరిస్థితుల్లో మీరు దేనికి నచ్చజెబుతారు? మీ మనసుకా? హృదయానికా?



ఎందుకంటే మనిషిలో రెండు రకాల రాజ్యాలున్నాయి. ఒక దానికి రాజు మనసైతే, మరో చోట రాజు... హృదయం. మనం ఇంకా జీవిస్తూ ఉండడానికి మూలమైన శ్వాసను ఎవరు ప్రేమిస్తారో, సమస్తానికీ కారణమైన శక్తిని ఎవరు ప్రేమిస్తారో... వారు ధన్యులు. ఇదే హృదయ కాంక్ష. కానీ మనసు కాంక్షించేది ఏమిటి? మనసు ఆ శక్తిని, ఆ దైవాన్ని అర్థం చేసుకోదు, చేసుకోలేదు. అది సదా మారుతూ ఉంటుంది. అయినప్పటికీ... యావత్ ప్రపంచం మన చెబుతూనే ఉంటుంది. కానీ మనసు గోల, మనసు చేసే అలజడి కారణంగా మనకేదీ వినిపించడం లేదు. కాబట్టి మనసు అలజడిని తగ్గించి, హృదయం పిలుపును వినాలి. అర్థం చేసుకోవాలి. ఇంతకీ ఆ పిలుపు ఏమిటి? "నీ లోపలికి వస్తూ, పోతూ ఉన్న ఈ శ్వాసను అర్థం చేసుకో! నీ జీవితాన్ని సఫలం చేసుకో. నీ హృదయంలో ఉన్నదాన్ని ప్రేమించు. హృదయంలోనే పరమాత్మ కొలువై ఉన్నాడు" అని. ఆ పిలుపును వినాలంటే మిగతా శబ్దాలన్నిటినీ తగ్గించుకోవడం చాలా అవసరం. దానికోసం మన జీవితంలో హృదయం కేంద్రమైన ప్రపంచాన్ని ఏర్పరచుకోవాలి. అప్పుడు ఈ ప్రపంచాన్ని సృష్టించిన పరమాత్మ మీద శ్రద్ధ వహిస్తారు. జగత్తుతో అనుబంధం ఏర్పరచుకుంటారు. ఈ విషయంలో మీరు సరైన నిర్ణయం తీసుకుంటే... ఆ దిశగా మీ ఎదుగుదల మొదలవుతుంది.



ప్రేమ్ రావత్
9246275220
www.premrawat.com

సందేశం

పశ్చాత్తాపంతోనే మన్నింపు

మహా ప్రవక్త మహమ్మద్ చెప్పిన కథ ఇది: పూర్వం చెడు మార్గంలో పడిన ఒక వ్యక్తి ఉండేవాడు. అతను తొంభై తొమ్మిది హత్యలు చేశాడు. తను చేస్తున్నది మహా పాపమని అతను తెలుసుకున్నాడు. పాప విముక్తి కోసం తనకు దారి చూపేవారికోసం అన్వేషించాడు. చివరకు దైవభక్తుడైన ఒక పండితుడి గురించి తెలిసింది. అతను ఆ పండితుడి దగ్గరకు వెళ్ళి "అయ్యా! నేను తొంభై తొమ్మిది హత్యలు చేశాను. నా తౌబాను (పశ్చాత్తాపాన్ని) దేవుడు స్వీకరిస్తాడా?" అని అడిగాడు. అప్పుడు ఆ పండితుడు "లేదు. అందుకు ఎలాంటి అవకాశం లేదు" అన్నాడు. అది వినగానే ఆ వ్యక్తి నిరాశకు గురయ్యాడు. కోపం వచ్చింది. ఆ పండితుణ్ణి కూడా చంపేశాడు. దీనితో అతను వంద హత్యలు చేసినట్టయింది. ఆ తరువాత అతను ఎంతో మనస్తాపానికి గురయ్యాడు. 'ఆగ్రహావేశాలతో మరొకరిని చంపాను. నన్ను దేవుడు కనికరించడు. ఇకపై ఎలాంటి పరిస్థితులు ఎదురైనా కోపగించను. దేవుడి కటాక్షం కోసం ఓర్పుతో ఉంటాను. ఎంత కష్టమైన పడతాను' అనుకున్నాడు.

కొన్నాళ్ళు అన్వేషించాక... మళ్ళీ మరో పండితుణ్ణి కలిశాడు. ఆయనకు తన పరిస్థితి వివరిస్తూ "నేను వంద హత్యలు చేశాను. నా తౌబా అంగీకారం పొందుతుందా? నా పాపానికి నిష్కృతి ఉందా?" అని ప్రశ్నించాడు. "నీకు ఒక ప్రదేశం గురించి చెబుతాను. అక్కడ దైవారాధనలో నిమగ్నమైన దేవుని ప్రియదాసులు ఉన్నారు. వారి దగ్గరకు వెళ్ళు. మళ్ళీ ఇక్కడకు రాకు. ఎందుకంటే ఇక్కడ నువ్వు నిన్ను మార్చుకొనే అవకాశం లేదు. పశ్చాత్తాపం పొందే పరిస్థితి లేదు"



> తప్పులు, పొరపాట్లు చేయడం మానవ సహజం. పశ్చాత్తాపం, క్షమాపణ కోసం భగవంతుణ్ణి వేడుకొని... హృదయాన్ని పరిశుద్ధం చేసుకోవడం ద్వారా వాటికి మన్నింపు లభిస్తుంది. అది జరగాలంటే దైవంపై పూర్తి విశ్వాసం కలిగి ఉండాలి.

అని చెప్పాడు. ఆ పండితుడి సూచన మేరకు ఆ వ్యక్తి బయలుదేరాడు. ఆ ప్రయాణంలో అతనిలో ఎంతో మార్పు వచ్చింది. పశ్చాత్తాపంతో అతని హృదయం పరిశుద్ధమయింది. విశ్వాసిగా జీవించడంలోనే మానవ జీవితానికి పరమార్థం ఉందని గ్రహించాడు. పూర్తి విశ్వాసిగా మారాడు. ఈలోగా... అతను తన గమ్యస్థలానికి మధ్యలో ఉండగానే మృత్యువు ఆసన్నమైంది. అతను మరణించాడు.

అప్పుడు కారుణ్య దూతలు, శిక్షించే దూతలు వచ్చారు. "అతను తన పాపాలకు పశ్చాత్తాపం చెంది, దేవుడిపైన దృష్టి కేంద్రీకరించి ఇటు వచ్చాడు" అన్నారు కారుణ్య దూతలు. "కాదు. అతను ఇంకా ఎలాంటి పుణ్యకార్యం చేయలేదు" అన్నారు శిక్షా దూతలు. వారి వాదన ఎంతకూ తెగకపోవడంతో... ఆకాశంలో వెళ్తున్న ఒక దేవదూతను మధ్యవర్తిగా పిలిచారు. "ఆ వ్యక్తి ఎటు నుంచి వచ్చాడో చూడండి. ఆ ప్రదేశం దగ్గరగా ఉందా? అతను చేరాల్సిన గమ్యం దగ్గరగా ఉందా? అనేది కొలిచి చూడండి" అని ఆ దేవదూత సలహా ఇచ్చాడు. అప్పుడు వాళ్ళు చెరోవైపూ కొలిచారు. ఆ వ్యక్తి గమ్యమే దగ్గరగా ఉందని తేలింది. అతని ఆత్మను కారుణ్య దూతలు తీసుకువెళ్ళారు.. దేవుడు ఆ వ్యక్తిని కటాక్షించాడు.

తప్పులు, పొరపాట్లు చేయడం మానవ సహజం. పశ్చాత్తాపం, క్షమాపణ కోసం భగవంతుణ్ణి వేడుకొని... హృదయాన్ని పరిశుద్ధం చేసుకోవడం ద్వారా వాటికి మన్నింపు లభిస్తుంది. అది జరగాలంటే దైవంపై పూర్తి విశ్వాసం కలిగి ఉండాలి. జరిగిన వాటినే తలచుకొని కుమిలిపోవడం వల్ల, నిరాశా నిస్పృహలకు లోను కావడం వల్లా మన తప్పులకు క్షమాపణ దొరకదు. నిజాయితీగా పాపాలను ఒప్పుకొని, పశ్చాత్తాపంతో దైవం మన్నింపును కోరుకోవడమే విశ్వాసులు చేయవలసిన పని.

● మహమ్మద్ వహీదుద్దీన్

భళా భారత్!



విశ్లేషకుల అంచనాలను మించిన ఆర్థిక ప్రగతి

- మూడో త్రైమాసికంలో 8.4 శాతానికి జీడీపీ వృద్ధి
- మాన్యుఫాక్చరింగ్, మైనింగ్, నిర్మాణ రంగాల్లో జోష్
- 2023-24 వృద్ధి రేటు అంచనా 7.6 శాతానికి పెంపు

న్యూఢిల్లీ: భారత ఆర్థిక ప్రగతి చక్రం మరింత వేగం పుంజుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24)లో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ఏకంగా 8.4 శాతానికి ఎగబాకింది. బ్లూంబర్గ్ సర్వేలో ఆర్థికవేత్తలు అంచనా వేసిన 6.6 శాతం వృద్ధితో పోలిస్తే చాలా అధికమిది. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని మరోసారి పదిలం చేసుకోగలిగింది. తయారీ రంగం రెండంకెల వృద్ధిని కనబర్చడంతో పాటు మైనింగ్ అండ్ క్వారీయింగ్, నిర్మాణ రంగాల మెరుగైన పనితీరు ఇందుకు దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఇదే త్రైమాసికానికి వృద్ధి రేటు 4.3 శాతంగా ఉంది. క్యూ3 వృద్ధి అంచనాలను మించడంతో పాటు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసిక (క్యూ1) వృద్ధి రేటును తొలుత ప్రకటించిన 7.8 శాతం నుంచి 8.2 శాతానికి పెంచింది.

సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసిక (క్యూ2) వృద్ధి రేటును సైతం 7.6 శాతం నుంచి 8.1 శాతానికి పెంచింది. అలాగే, రెండో ముందస్తు అంచనాల్లో భాగంగా ఎన్ఎస్ఓ ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి వృద్ధి రేటు అంచనాను సైతం 7.3 శాతం నుంచి 7.6 శాతానికి పెంచింది. అయితే, గత ఆర్థిక సంవత్సరం (2022-23) జీడీపీ వృద్ధి అంచనాను మాత్రం గతంలో ప్రకటించిన 7.2 శాతం నుంచి 7 శాతానికి తగ్గించడం గమనార్హం. ఎన్ఎస్ఓ గురువారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ క్యూ3లో వాస్తవిక జీడీపీ లేదా స్థిర ధరల (2011-12) ఆధారిత జీడీపీని రూ.43.72 లక్షల కోట్లుగా అంచనా వేశారు. 2022-23లో ఇదే త్రైమాసికానికి నమోదైన రియల్ జీడీపీ రూ.40.35 లక్షల కోట్లతో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన 8.4 శాతం వృద్ధి నమోదైంది. ఇకపోతే, క్యూ3లో నామమాత్ర జీడీపీ లేదా ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీని రూ.75.49 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

2022-23 క్యూ3లో నమోదైన రూ.68.58 లక్షల కోట్ల నావినల్ జీడీపీతో పోలిస్తే 10.1 శాతం వృద్ధిని అంచనా వేశారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి వాస్తవిక జీడీపీ రూ.172.90 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన జీడీపీ రూ.160.71 లక్షల కోట్లతో పోలిస్తే 7.6 శాతం అధికమిది. కాగా, ఈసారి నామినల్ జీడీపీ రూ.293.90 లక్షల కోట్ల స్థాయికి పెరగవచ్చని అంచనా. 2022-23లో రూ.269.50 లక్షల కోట్ల నామినల్ జీడీపీతో పోలిస్తే 9.1 శాతం వృద్ధి చెందవచ్చని ఎన్ఎస్ఓ భావిస్తోంది.

దేశ ఆర్థిక వ్యవస్థ శక్తి సామర్థ్యాలకు సంకేతం

మూడో త్రైమాసికంలో 8.4 శాతం జీడీపీ వృద్ధి దేశ ఆర్థిక వ్యవస్థ సత్తాను ప్రదర్శించింది. దేశం వేగంగా వృద్ధి చెందడంతో పాటు 140 కోట్ల మంది దేశవాసులు మెరుగైన జీవనం గడిపేందుకు, వికసిత్ భారత సృష్టికి ప్రభుత్వం కృషిని కొనసాగిస్తుంది.

- ప్రధాని నరేంద్ర మోదీ

గత ఆర్థిక సంవత్సరం అంచనాలు తగ్గించడం వల్లే..

గత ఆర్థిక సంవత్సరంలో కొన్ని త్రైమాసికాల జీడీపీ వృద్ధి అంచనాలను తగ్గించడమే ఈసారి జీడీపీ గణాంకాలు మెరుగ్గా కన్పిస్తుండటానికి ప్రధాన కారణం. ఆర్థిక వ్యవస్థలో కార్యకలాపాల జోరు అంచనాలను విఎంచిన నేపథ్యంలో ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను దీర్ఘకాలంపాటు గరిష్ఠ స్థాయిల వద్దే కొనసాగించవచ్చు. ఆర్‌బీఐ కఠిన పరపతి విధానంలో వచ్చే ఆరు నెలల వరకు మార్పు ఉండకపోవచ్చు.

- సుమన్ చౌదురి,
చీఫ్ ఎకనామిస్ట్ అండ్ రీసెర్చ్ హెడ్, అక్యూట్ రేటింగ్స్

15 నెలల కనిష్ఠానికి
కీలక రంగాల పనితీరు

ఈ ఏడాది జనవరిలో 8 కీలక రంగాల (బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, ఎలక్ట్రిసిటీ) వృద్ధి 15 నెలల కనిష్ఠ స్థాయి 3.6 శాతానికి తగ్గింది. రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, ఎలక్ట్రిసిటీ రంగాల పేలవ పనితీరు ఇందుకు కారణమైంది. 2022 డిసెంబరులో ఈ రంగాల వృద్ధి 4.9 శాతంగా నమోదైంది. 2023 జనవరిలో 9.7 శాతంగా ఉంది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ ఎనిమిది రంగాలకు 40.27 శాతం వాటా ఉంది.

రూ.11 లక్షల కోట్లకు ద్రవ్యలోటు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జనవరితో ముగిసిన పది నెలలకు ద్రవ్యలోటు రూ.11 లక్షల కోట్లకు పెరిగింది. బడ్జెట్‌లో అంచనాలో 63.6 శాతానికి సమానమిది. 2023-24 బడ్జెట్‌లో ప్రభుత్వం ద్రవ్యలోటును రూ.17.35 లక్షల కోట్లు (జీడీపీలో 5.8 శాతం)గా అంచనా వేసింది. ప్రభుత్వ ఆదాయ, వ్యయ అంతరాన్ని ద్రవ్యలోటు అంటారు. మార్కెట్ నుంచి రుణాలు సమీకరించడం ద్వారా ప్రభుత్వం ఈ లోటును పూడ్చుకుంటుంది. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) గురువారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గడిచిన పది నెలల్లో మొత్తం రూ.22.52 లక్షల కోట్ల (సవరించిన బడ్జెట్ అంచనాలో 81.7 శాతం) ఆదాయం సమకూరగా.. మొత్తం వ్యయం రూ.33.54 లక్షల కోట్లుగా (సవరించిన బడ్జెట్ అంచనాలో 74.7 శాతం) నమోదైంది.

'కోహాన్స్'లో సువెన్ ఫార్మా విలీనం

న్యూఢిల్లీ: భారత ఫార్మా రంగంలో మరో విలీనం చోటు చేసుకుంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేసే సువెన్ ఫార్మా కంపెనీ కోహాన్స్ లైఫ్ సైన్సెస్‌లో విలీనమవుతోంది. దీనికి సంబంధించి రెండు కంపెనీలు గురువారం ఒక ప్రకటన విడుదల చేశాయి. విలీన ఒప్పందం ప్రకారం ప్రతి 295 కోహాన్స్ షేర్లకు 11 సువెన్ ఫార్మా షేర్లు జారీ చేస్తారు. రెగ్యులేటరీ సంస్థలు, వాటాదారుల ఆమోదంతో వచ్చే 12-15 నెలల్లో ఈ విలీన ప్రక్రియ పూర్తి అవుతుందని భావిస్తున్నారు

మెడ్‌ట్రానిక్ ఎంఈఐసీ సెంటర్ విస్తరణ
రూ.3,000 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్: మెడికల్ టెక్నాలజీలో అంతర్జాతీయంగా పేరున్న మెడ్‌ట్రానిక్.. హైదరాబాద్‌లోని తన ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ (ఎంఈఐసీ)ను మరింత విస్తరించింది. 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు గురువారం ప్రారంభించారు. ఈ విస్తరణ కేంద్రం కోసం మెడ్‌ట్రానిక్ సంస్థ రూ.3,000 కోట్లు ఖర్చు చేసింది. అమెరికా వెలుపల కంపెనీకి ఇదే అతిపెద్ద ఆర్ అండ్ డీ కేంద్రం. ప్రస్తుతం 900 మందికి పైగా ఉన్న ఉద్యోగుల సంఖ్యను భవిష్యత్‌లో 1,500కు పెంచనున్నట్టు కంపెనీ తెలిపింది. ఈ కార్యక్రమంలో మెడ్‌ట్రానిక్ ఛైర్మన్, సీఈఓ జియోఫ్ మార్తా, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ తదితరులు పాల్గొన్నారు.

1హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ కొలువు తీరింది. ప్రపంచవ్యాప్తంగా ఆస్పత్రులకు 'ఆల్ ఇన్ వన్' క్లౌడ్ సేవలు అందించే మోడ్‌మెడ్ తన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను హైదరాబాద్ హైటెక్ సిటీలో 20,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసింది.

1బ్రాడ్‌బ్యాండ్, డిజిటల్ సర్వీసుల్లో కీలకంగా ఉన్న యాక్ట్ ఫైబర్‌నెట్.. తన మొబైల్ యాప్‌ను మళ్లీ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపింది. యాక్ట్ సూపర్ యాప్‌ను కొత్త టెక్నాలజీలకు అనుగుణంగా రూపొందించటమే కాకుండా వినియోగదారులకు అన్ని రకాలైన సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది.

1ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్.. మహిళల ఆరోగ్య విభాగంలో 'అన్‌మాస్క్.. అనీమియా' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం కింద ఐరన్ డెఫిషియెన్సీపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించనుంది. ఇందుకోసం బాలీవుడ్ నటి ట్వింకిల్ ఖన్నాతో ఒక కార్యక్రమాన్ని కూడా రూపొందించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,830 ▼	57,580 ▼	75,700 ▲
ముంబై	62,241 ▲	57,013 ▲	69,312 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ	
హైదరాబాద్	460
మార్చి 1వ తేదీ	
చిత్తూరు	513
గోదావరి	460
విజయవాడ	460
విశాఖపట్నం	500
వరంగల్	462
డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	126
వరంగల్	126
కరీంనగర్	126
మహబూబ్‌నగర్	126
కర్నూలు	126
విశాఖపట్నం	127
గోదావరి	134
విజయవాడ	134
గుంటూరు	134
ఒంగోలు	134
చిత్తూరు	133

లాభాల్లోకి మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ గురువారం లాభాలతో ముగిసింది. రోజంతా ఆటుపోట్లకు లోనైన మార్కెట్, ట్రేడింగ్ చివర్లో లాభాల బాట పట్టింది. దీంతో సెన్సెక్స్ 195.42 పాయింట్ల లాభంతో 72,500.30 దగ్గర ముగియగా నిఫ్టీ 31.65 పాయింట్ల లాభంతో 21,982.80 వద్ద క్లోజైంది. గురువారం ఫిబ్రవరి నెల డెరివేటివ్స్ సెటిల్మెంట్‌కు చివరి రోజు కావడం, ఈ వారం వెలువడే కీలక ఆర్థిక గణాంకాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన మార్కెట్‌ను వెంటాడింది. షాంఘై తప్ప మిగతా ఆసియా మార్కెట్లు నష్టాల్లో ట్రేడవటం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

పొగాకుకు రికార్డు ధర

గుంటూరు సిటీ : ఈ ఏడాది పొగాకు రికార్డు ధర పలికింది. కేజీ రూ.250 వరకు కొనుగోళ్లు జరిగాయి. గురువారం పొగాకు వేలం అమ్మకాలను గుంటూరు పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు ఒంగోలు, కొండెపి కేంద్రాల్లో ప్రారంభించారు. ఈ వేలం కేంద్రాలలో కేజీ పొగాకు 250 వరకు పలికింది. నాణ్యత ఆధారంగా కేజీ 250 నుంచి 231.32గా సరాసరి అమ్మకాలు జరిగాయి.

1ఆంధ్రప్రదేశ్‌లో పీఎన్‌జీ, సీఎన్‌జీ ధరల తగ్గింపుతో వినియోగదారులకు మరింత లబ్ది చేకూరనుందని ఏపీ అండ్ పీ ప్రథమ్ పేర్కొంది. వ్యాట్ తగ్గింపు కారణంగా ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలో సీఎన్‌జీ కేజీ ధర రూ.93 నుంచి రూ.79కి తగ్గనుందని తెలిపింది. ధర తగ్గింపుతో ఈ పర్యావరణ హిత ఇంధన వినియోగం మరింత పెరగనుందని వెల్లడించింది.

విస్తరణ బాటలో ఎంటీఆర్

త్వరలో మరిన్ని కొత్త ఉత్పత్తులు



హైదరాబాద్: వెజిటబుల్ మసాలాలు, ఆహార ఉత్పత్తుల తయారీ కంపెనీ ఎంటీఆర్.. తన ఉత్పత్తుల పోర్టుఫోలియోను మరింతగా విస్తరించేందుకు రెడీ అవుతోంది. గురువారం నాడిక్కడ కంపెనీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంటీఆర్ సీఈఓ సునయ్ భాసిన్ మాట్లాడుతూ.. రెడీ టు మీల్స్, దోశ, ఇడ్లీ పిండి (బ్యాటర్) ఉత్పత్తులను త్వరలో విడుదల చేయాలని చూస్తున్నట్లు చెప్పారు. ఎంటీఆర్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లు చాలా కీలకంగా ఉన్నాయని, కంపెనీ ఉత్పత్తులైన సాంబార్, రసం పౌడర్, గులాబ్ జామూన్ మిక్స్ ఉత్పత్తులకు ఇక్కడ మంచి ఆదరణ లభిస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కంపెనీని మరింత పటిష్ఠం చేసే ఉద్దేశంతో గడచిన మూడేళ్లలో దాదాపు రూ.100 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టినట్లు ఆయన చెప్పారు. కాగా కంపెనీ ఇప్పటికే ఏపీలోని గుంటూరులో చిల్లీ పౌడర్ ప్లాంట్‌ను నిర్వహిస్తోందని, తాజాగా ఇక్కడ మసాలా ఉత్పత్తుల కోసం ప్రత్యేకమైన ఉత్పత్తి లైన్‌ను ప్రారంభించాలని చూస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.30 కోట్లతో ఈ ఉత్పత్తి లైన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు భాసిన్ పేర్కొన్నారు. కాగా వెర్మిసెల్లీ ఉత్పత్తి కోసం హైదరాబాద్‌లో ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

భారత్ బిల్ పే మరింత పటిష్ఠం

సవరించిన నిబంధనలు జారీ చేసిన ఆర్‌బీఐ

ముంబై: దేశంలో బిల్లు చెల్లింపుల విధానం మరింత వేగవంతం చేయడంతో పాటు అధిక భాగస్వామ్యం, కస్టమర్‌కు మరింత రక్షణ కల్పించే విధంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సవరించిన నిబంధనలు జారీ చేసింది. చెల్లింపుల వ్యవస్థలో ఇటీవల కాలంలో విశేషమైన పరిణామాలు చోటు చేసుకున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన నిబంధనలు మరింత ఆధునికం చేయాలన్న లక్ష్యంతో "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత్ బిల్ పేమెంట్) నిబంధనలు, 2024" పేరిట ఈ నూతన విధివిధానాలు నిర్దేశించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బ్యాంకులు, ఎన్‌పీసీఐ భారత్ బిల్‌పే లిమిటెడ్, ఇతర నాన్ బ్యాంక్ పేమెంట్ వ్యవస్థలన్నింటికీ ఈ నూతన నిబంధనలు వర్తిస్తాయి. భారత్ బిల్ పేమెంట్ వ్యవస్థ (బీబీపీఎస్) యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్, కార్డులు, నగదు, ప్రీపెయిడ్ చెల్లింపు సాధనాలన్నింటి ద్వారా బిల్లు వసూళ్లు, చెల్లింపు కార్యకలాపాలకు ఒక సమర్థవంతమైన వేదిక. మొబైల్ యాప్‌లు, మొబైల్ బ్యాంకింగ్, ఫిజికల్ ఏజెంట్లు, బ్యాంక్ బ్రాంచీల ద్వారా ఈ కార్యకలాపాలన్నీ జరుగుతూ ఉంటాయి. ఈ వ్యవస్థలో భాగస్వాములయ్యేందుకు ఎవరు అర్హులు, దీనికి సంబంధించిన సాంకేతిక ప్రమాణాలేవి వంటి వివరాలన్నింటితో కూడిన నూతన నియమ నిబంధనలను భారత్ బిల్ పే సెంట్రల్ యూనిట్ (బీబీపీసీయూ) నిర్దేశిస్తుందని ఆర్‌బీఐ తెలిపింది.

ప్రతిష్ఠాత్మక బ్రాండ్స్ ఆఫ్ ఆసియాలో 'అమరాన్'కు చోటు



హైదరాబాద్: అమరాన్ బ్రాండ్ ఆటోమోటివ్ బ్యాటరీలకు అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ (ఏఆర్ఈ అండ్ ఎం) కంపెనీ తయారు చేసే ఈ బ్యాటరీల బ్రాండ్‌కు 'ప్రిస్టేజియస్ బ్రాండ్స్ ఆఫ్ ఆసియా 2023-24' గుర్తింపు లభించింది. దుబాయ్‌లో హెరాల్డ్ గ్లోబల్ అండ్ బార్క్ ఆసియా నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ సింపోజియంలో ఆటోమేటివ్ బ్యాటరీల విభాగంలో అమరాన్‌కు ఈ గుర్తింపు లభించింది. ఇదే సదస్సులో ఏఆర్ఈ అండ్ ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన గౌరినేనిని మార్కెటింగ్ మీస్టర్, 2023-24 అవార్డుతో సత్కరించారు.

స్పోర్ట్స్

రాహుల్ అవుట్

బుమ్రా వచ్చేశాడు

ఆఖరి టెస్టుకు భారత జట్టు



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరిగే ఆఖరిదైన ఐదో టెస్టు కోసం భారత జట్టును ప్రకటించారు. ధర్మశాలలో ఈనెల 7 నుంచి జరుగనున్న ఈ మ్యాచ్ కోసం 16 మంది ఆటగాళ్ల జాబితాను సెలెక్షన్ కమిటీ గురువారం ప్రకటించింది. అయితే మిడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఇంకా కోలుకోలేదు. గాయంతో బాధపడుతున్న అతను ఈ టెస్టుకు కూడా దూరమవుతున్నట్టు బీసీసీఐ వెల్లడించింది. మరోవైపు పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఆఖరి టెస్టుకు ఎంపిక చేశారు. ఇక రాహుల్ ఐదు టెస్టుల సిరీస్‌లో కేవలం మొదటి టెస్టు మాత్రమే ఆడగా, ఆ తర్వాత తొడ కండరాల గాయంతో వైదొలిగాడు. వైద్య నిపుణుల అభిప్రాయం తీసుకునేందుకు రాహుల్ లండన్ వెళ్లాడు. గతేడాది కూడా ఇదే గాయంతో 4 నెలల పాటు విశ్రాంతి తీసుకున్న రాహుల్.. ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌ల్లోనూ ఆడే అవకాశం లేదు. తను జట్టులో లేకపోవడంతో రజత్ పటీదార్ కొనసాగవచ్చు. కానీ పేలవ ఫామ్ లో ఉన్న అతడికి తుది జట్టులో చోటు కష్టమే. ధర్మశాలలో దేవ్‌దత్ పడిక్కళ్‌కు చాన్స్ లభించ

బుమ్రా కమ్‌బ్యాక్

రాంచీలో జరిగిన నాలుగో టెస్టులో స్టార్ పేసర్ బుమ్రాకు పని ఒత్తిడి కారణంగా విశ్రాంతినిచ్చారు. ఇప్పుడు చివరి టెస్టులో చోటు కల్పించారు. ఆడిన మూడు టెస్టుల్లోనే 17 వికెట్లు తీసిన బుమ్రా..జడేజా, అశ్విన్‌లతో కలిసి టాప్‌లో ఉన్నాడు. అయితే రాంచీలో గెలిచిన భారత్ 3-1తో ఇప్పటికే సిరీస్ కూడా సాధించింది. సిరీస్ గెలిస్తే అతనికి ఆఖరి టెస్టులోనూ విశ్రాంతి కల్పిస్తారని తొలుత భావించారు. మరోవైపు బుమ్రా రాకతో తుది జట్టులో ఆకాశ్ దీప్‌నకు చోటు దక్కుతుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. అరంగేట్ర టెస్టులోనే ఈ బెంగాల్ పేసర్ మూడు వికెట్లతో ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఇక 2 నుంచి జరిగే రంజీ సెమీస్‌లో తమిళనాడుకు ఆడేందుకు స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను విడుదల చేశారు. ఆ మ్యాచ్ ముగిశాక అవసరమైతే తిరిగి భారత జట్టుతో కలుస్తాడు.

భారత జట్టు

రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రజత్ పటీదార్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్, రవి అశ్విన్, బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, ముకేశ్ కుమార్, కుల్దీప్ యాదవ్, దేవ్‌దత్ పడిక్కళ్, కేఎస్ భరత్, అక్షర్ పటేల్.

ట్రయల్స్‌కు హాజరుకాను!


బజరంగ్

న్యూఢిల్లీ: జాతీయ ట్రయల్స్‌కు హాజరయ్యేందుకు స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియా నిరాకరించాడు. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీల్లో స్థానిక ఇందిరా గాంధీ స్టేడియంలో ట్రయల్స్ జరుగనున్నాయి. అయితే ఈ ట్రయల్స్‌పై స్టే విధించాలంటూ బజరంగ్ కోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశాడు. అతడితో పాటు వినేశ్ ఫొగట్, సాక్షి మాలిక్, ఆమె భర్త సత్యవర్త్ కడియన్ కూడా పిటిషన్ వేసిన వారిలో ఉన్నారు. నేడు (శుక్రవారం) కోర్టులో విచారణ జరుగనుంది. సస్పెన్షన్‌లో ఉన్న సంజయ్ సింగ్ నేతృత్వంలోని సమాఖ్య ఈ ట్రయల్స్‌ను ఎలా నిర్వహిస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు వచ్చే నెలలో కిర్గిస్థాన్‌లో ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ ఒలింపిక్ క్వాలిఫయర్ జరుగనుంది. ఇందులో పాల్గొనే భారత జట్టు కోసమే ఈ ట్రయల్స్‌ను నిర్వహించబోతున్నారు.

అప్పుడే ధోనీతో పోలికా?



న్యూఢిల్లీ: యువ కీపర్ ధ్రువ్ జురెల్.. మరో ధోనీ అంటూ గవాస్కర్ చేసిన వ్యాఖ్యలతో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ విభేదించాడు. ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్ విజయంలో జురెల్ కీలకపాత్ర పోషించాడు. తీవ్ర ఒత్తిడిలోనూ ధ్రువ్ ఆడిన తీరును దాదా సైతం ప్రశంసించాడు. 'అతడేమీ ధోనీ కాదు. తనదైన ఆటను ఆడుకోనివ్వండి. స్పిన్నర్లు, పేసర్లను.. ముఖ్యంగా ఒత్తిడి సమయాల్లో ధ్రువ్ ఎదుర్కొంటున్న తీరు ఆకట్టుకొందని గంగూలీ చెప్పాడు.

ఐర్లాండ్‌కు ఆధిక్యం

అఫ్ఘాన్‌తో ఏకైక టెస్టు

అబుధాబి : అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 101/4తో రెండో రోజు ఆట కొనసాగించిన ఐర్లాండ్ 263 పరుగుల వద్ద ఆలౌటైంది. దీంతో ఆ జట్టుకు 108 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించినట్టయింది. స్టిర్లింగ్ (56), కాంఫెర్ (49) రాణించారు. రెహ్మాన్‌కు ఐదు, నవీద్‌కు 3 వికెట్లు లభించాయి. అనంతరం అఫ్ఘాన్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 134 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది. అఫ్ఘాన్ జట్టు ప్రస్తుతం 26 పరుగుల ఆధిక్యంలో మాత్రమే ఉంది. అఫ్ఘాన్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 155 రన్స్‌కే ఆలౌటైంది.

ఎవరో.. కొత్త చాంప్?

ప్రొ కబడ్డీ ఫైనల్లో హరియాణాతో పుణె ఢీ నేడు

రాత్రి 8 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..


పల్టన్ కెప్టెన్ అస్లమ్
స్టీలర్స్ సారథి జైదీప్

హైదరాబాద్: మూడు మాసాలు అలరించిన ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-10 తుది అంకానికి చేరుకొంది. గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం జరిగే టైటిల్ ఫైట్‌లో పుణెరి పల్టన్‌తో హరియాణా స్టీలర్స్ అమీతుమీ తేల్చుకోనుంది. సీజన్ ఆసాంతం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన పుణె.. సెమీస్‌లో పట్నా పైరేట్స్‌ను ఓడించింది. ఆల్‌రౌండర్లు అస్లం ఇనామ్‌దార్, పంకజ్ మోహిత్ జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. 2023 ఫైనల్లో జైపూర్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన పల్టన్.. ఈసారి టైటిల్ నెగ్గాలన్న పట్టుదలతో ఉంది. మరోవైపు ఒడిదొడుకులు ఎదుర్కొంటూ ప్లేఆఫ్స్‌కు చేరుకొన్న హరియాణా తొలిసారి తుది పోరుకు అర్హత సాధించింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసిన స్టీలర్స్.. సెమీస్‌లో జైపూర్ పింక్ పాంథర్స్‌కు షాకిచ్చింది. ఇరుజట్లూ ఒక్కసారి కూడా టైటిల్ నెగ్గకపోవడంతో.. ఏ టీమ్ గెలిచినా కొత్త చాంపియన్ ఆవిర్భవించడం ఖాయం.

బెంగళూరుకు ఝలక్

మంధాన పోరాటం వృథా ఢిల్లీ ఘనవిజయం


డబ్ల్యూపీఎల్
షఫాలీ (50)

బెంగళూరు: వరుస విజయాలతో ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు తొలి ఓటమి ఎదురైంది. రికార్డు ఛేదనలో కెప్టెన్ స్మృతి మంధాన (43 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 74) అద్భుత ఆటతీరును కనబరిచినా ఫలితం లేకపోయింది. ఢిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండ్ షోతో 25 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 194 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ లీగ్‌లో ఈ జట్టుకిదే అత్యధిక స్కోరు. తొలి ఓవర్‌లోనే క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్న ఓపెనర్ షఫాలీ వర్మ (31 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 50) మెరుపు అర్ధసెంచరీతో ఆకట్టుకుంది. మరో ఓపెనర్ లానింగ్ (11) విఫలమైనా.. షఫాలీ-ఎలిస్ క్యాప్సీ (33 బంతుల్లో 46) జోడీ ఆర్‌సీబీ బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. 12వ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన షఫాలీ ఆ వెంటనే అవుటైంది. మరుసటి ఓవర్‌లోనే క్యాప్సీ వెనుదిరగ్గా రెండో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చివర్లో జెస్ జొనాసెన్ (16 బంతుల్లో 36 నాటౌట్), మరిజానె కాప్ (16 బంతుల్లో 32) కదం తొక్కడంతో ఆఖరి ఐదు ఓవర్లలోనే జట్టు 70 రన్స్ రాబట్టింది.

మంధాన ఆడినా...

భారీ ఛేదనలో కెప్టెన్ స్మృతి మంధాన మాత్రమే పోరాడడంతో బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్లకు 169 పరుగులు చేసి ఓడింది. తొలి వికెట్‌కు డివైన్ (23)తో కలిసి మంధాన 77 పరుగులు జోడించింది. మంధానాను 12వ ఓవర్‌లో కాప్ అవుట్ చేయడం దెబ్బతీసింది. అటు మేఘన (36) కాస్త నిదానంగా ఆడడంతో మిడిలార్డర్‌పై ఒత్తిడి పెరిగింది. ఉన్న కాసేపు రిచా ఘోష్ (19) మాత్రం ఆకట్టుకుంది. వేగంగా ఆడే క్రమంలో ఆర్‌సీబీ టపటపా వికెట్లను కోల్పోయింది. ఈక్రమంలో చివరి ఏడుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగారు.

సంక్షిప్త స్కోర్లు: **ఢిల్లీ క్యాపిటల్స్**: 20 ఓవర్లలో 194/5. (షఫాలీ 50, క్యాప్సీ 46, జొనాసెన్ 36 నాటౌట్, కాప్ 32; డివైన్ 2/23 డిక్లెర్క్ 2/35); **రాయల్ చాలెంజర్స్ బెంగళూరు**: 20 ఓవర్లలో 169/9 (మంధాన 74, మేఘన 36, డివైన్ 23; జొనాసెన్ 3/21, కాప్ 2/35, అరుంధతి రెడ్డి 2/38).

టీ20 వరల్డ్‌కప్‌నకు కిషన్, అయ్యర్ కష్టమేనా!




అయ్యర్

న్యూఢిల్లీ: సీనియర్ క్రికెటర్లు ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్‌లకు బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులు నిరాకరించడం భారత క్రికెట్‌లో సంచలనం రేపింది. ఇటీవలి కాలంలో టీమిండియాలో తరచూ కనిపించే వీరికి వార్షిక కాంట్రాక్టులు లభించక పోవడంతో.. జూన్‌లో జరిగే టీ20 వరల్డ్‌కప్‌లో చోటు దక్కడం కష్టంగా మారింది. వ్యక్తిగత కారణాలతో సౌతాఫ్రికా టూర్ మధ్యలోనే కిషన్ వైదొలగగా.. ఇంగ్లండ్‌తో అయ్యర్ రెండు టెస్టులు ఆడాడు. అయితే, వీరికి కాంట్రాక్టులు ఎందుకివ్వలేదనే విషయాన్ని బోర్డు ఎక్కడా స్పష్టం చేయలేదు. కానీ, దేశవాళీ క్రికెట్‌ను నిర్లక్ష్యం చేస్తున్న వారికి గట్టి హెచ్చరికలే పంపిందని విశ్లేషకులు చెబుతున్నారు. బోర్డు ప్రకటనలో కూడా ఫిట్‌గా ఉన్న ఆటగాళ్లు.. జాతీయ జట్టుకు దూరమైనప్పుడు ఆయా సమయాల్లో జరుగుతున్న దేశవాళీ లీగ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేసింది.

శ్రేయాస్ స్వయంకృతమా?

శ్రేయాస్ తన భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకొంటున్నాడన్న వ్యాఖ్యలు బలంగా వినిపిస్తున్నాయి. రెండో టెస్ట్ తర్వాత వెన్నునొప్పిగా ఉందని తప్పుకొన్నాడు. అయితే జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) మెడికల్ టీమ్ మాత్రం అతను మ్యాచ్‌కు ఫిట్‌గా ఉన్నట్టు నివేదిక ఇచ్చింది. అయినా కూడా ఎంపికకు అందుబాటులో ఉండేందుకు అయ్యర్ నిరాకరించినట్టు సమాచారం. రంజీలు కూడా ఆడకుండా.. నైట్‌రైడర్స్ నిర్వహించిన ప్రీ సీజన్ క్యాంప్‌లో శ్రేయాస్ పాల్గొనడం సెలెక్టర్లకు ఏమాత్రం రుచించలేదట. ఇషాన్‌ను కూడా దేశవాళీ క్రికెట్ ఆడాలని కోచ్ ద్రవిడ్ సూచించాడు. అయితే, హార్దిక్ పాండ్యాతో కలిసి ఐపీఎల్‌కు సన్నద్ధమవుతున్నట్టు సోషల్ మీడియాలో ఫొటోలు వచ్చాయి.

అందరినీ సమంగా చూడాలి

'బీసీసీఐ నిర్ణయాన్ని స్వాగతిస్తా. ప్రతి ఆటగాడూ దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందే. ఖాళీగా ఉన్న సమయంలో కోహ్లీ, రోహిత్ శర్మలు కూడా రాష్ట్రం తరఫున ఆడాలి. అయ్యర్, కిషన్‌లపైనే చర్యలు తీసుకోవడం సబబుకాదు. ఈ విషయంలో అందరికీ ఒకే తరహా నిబంధనలు ఉండాలి.'

కీర్తి ఆజాద్, 1983 వరల్డ్‌కప్ జట్టు సభ్యుడు

క్వార్టర్స్‌కు గాయత్రి జోడీ

జర్మన్ ఓపెన్



ముల్హీమ్ అన్ డెర్ రుహ్ర్ (జర్మనీ): జర్మన్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో గాయత్రి జంట క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల డబుల్స్ రెండో రౌండ్‌లో నాలుగో సీడ్ ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెల జోడీ 21-10, 21-11తో చెక్ జంట కత్రీనా జుజకొవా-సోనియా హొరిన్‌కొవాపై సునాయాసంగా గెలిచింది. కాగా, సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో ఆకర్షి కశ్యప్ 13-21, 14-21తో మియా బ్లిచ్‌ఫీల్డ్ (డెన్మార్క్) చేతిలో, సతీష్ కుమార్ కరుణాకరన్ 18-21, 22-24తో ఎన్గట్ గుయన్ (ఐర్లాండ్) చేతిలో పరాజయం పాలయ్యారు.

గ్రీన్ అజేయ శతకం

ఆసీస్ 279/9
కివీస్‌తో తొలి టెస్ట్



వెల్లింగ్టన్: కామెరూన్ గ్రీన్ (103 బ్యాటింగ్) శతకంతో ఆదుకోవడంతో.. న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా కోలుకొంది. గురువారం ఆరంభమైన మ్యాచ్‌లో మొదటి రోజు ఆటనిలిచే సమయానికి ఆస్ట్రేలియా 279/9 స్కోరు చేసింది. గ్రీన్‌తోపాటు పరుగులేమీ చేయకుండా హాజిల్‌వుడ్ క్రీజులో ఉన్నాడు. మార్ష్ (40), ఖవాజా (33), స్మిత్ (31)లకు చక్కని ఆరంభాలు దక్కినా.. భారీ స్కోర్లుగా మలచలేక పోయారు. మాట్ హెన్రీ 4 వికెట్లు పడగొట్టగా.. విలియమ్, కుగ్గలీన్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు.

కందుకూరులో మీకు మద్దతివ్వను

▸▸ వైసీపీ ఎమ్మెల్యే బుర్రాతో మహీధర్‌రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 29: కందుకూరు వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌కు సిటింగ్ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి షాకిచ్చారు. ఆయనకు మద్దతిచ్చేది లేదని స్పష్టం చేశారు. [illegible]

మాజీ మంత్రి పుల్లారావు కుమారుడి అరెస్టు


శరత్

▸▸ గుంటూరులో అరెస్టుచేసి బెజవాడ తరలింపు

విజయవాడ, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (ఎస్‌డీఆర్‌ఐ) డిప్యూటీ డైరెక్టర్ చేసిన ఫిర్యాదుపై మాచవరం పోలీసులు కేసునమోదు చేశారు. గురువారం తెల్లవారుజామున శరత్‌ను అరెస్టు చేసి విజయవాడ తీసుకొచ్చారు. అయితే ఆయన్ను ఎక్కడ ఉంచిందీ ఆచూకీ చెప్పలేదు. దీంతో ఆందోళన చెందిన పుల్లారావు, టీడీపీ నేతలు పట్టాభి, పిల్లి మాణిక్యాలరావు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, కార్యకర్తలు పోలీసుకమిషనర్ కార్యాలయం వద్ద గురువారం రాత్రి ఆందోళన చేశారు. కార్యాలయం లోపలకు వెళ్లడానికి యత్నించగా.. పోలీసులు గేటు మూసివేశారు. దీంతో వారు అక్కడే బైఠాయించారు. శరత్ ఆచూకీ తెలపాలని నినాదాలు చేశారు. గంట తర్వాత రూరల్ డీసీపీ కంచి శ్రీనివాసరావు వచ్చి పుల్లారావుతోపాటు ముగ్గురు నేతలను లోపలకు తీసుకెళ్లి మాట్లాడారు. మరో గంటలో శరత్‌ను న్యాయాధికారి ఎదుట హాజరుపరుస్తామని డీసీపీ హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు. తర్వాత శరత్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయాక న్యాయాధికారి ఇంట్లో ఆయన ఎదుట హాజరుపరిచారు.

ఎఫ్ఐఆర్‌లో ఏముందంటే..

ఎఫ్ఐఆర్‌లో అవెక్సా కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు కుర్రా జోగేశ్వరరావు, బొగ్గవరపు నాగమణి, మాజీ డైరెక్టర్లు పుల్లారావు కుమారుడు శరత్, బొగ్గవరపు అంకమ్మరావు, బొగ్గవరపు మార్కండేయులు, పత్సమట్ల భీమరాజు, ప్రత్తిపాటి టీనె వెంకాయమ్మలను నిందితులుగా చేర్చారు. వారిపై ఐపీసీ సెక్షన్లు 420, 409, 453, 411, 477(ఎ), 120(బీ) రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేశారు. అవెక్సా కార్పొరేషన్ ఇంతకుముందు శివస్వాతి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఉండేది. దీని ప్రధాన కార్యాలయం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సాగర్ సొసైటీ రెండో నంబర్ రోడ్‌లో 8.2.3269/ఎస్/41లో ప్లాట్ నంబర్ 41లో ఉంది. దీనికి బ్రాంచ్ కార్యాలయాలు విజయనగరం, నెల్లూరులో ఉన్నాయి. ఈ సంస్థ కాంట్రాక్టు పనులను నిర్వహిస్తోంది. జీఎస్టీఐఎన్ 37ఏఏఐసీఎస్9943ఎస్2జడ్‌యు కింద రిజిస్టర్ అయింది. 'ఈ కంపెనీ కొన్ని సంవత్సరాలుగా ఐటీసీ (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) సక్రమంగా చెల్లించడం లేదు. హైదరాబాద్ డీజీజీఐ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ ఇంటెలిజెన్స్) ఈ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రూ.16 కోట్ల జరిమానా విధిస్తూ డిమాండ్ నోటీసులు ఇచ్చారు. అవెక్సా సంస్థ 2017 జూలై నుంచి 2022 మార్చి వరకు ఎలాంటి రశీదులు లేకుండా తప్పుడు మార్గంలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ చేసింది. నాడు డైరెక్టర్‌గా ఉన్న కుర్రా జోగేశ్వరరావు జీఎస్టీ రిటర్న్ 3బిలో తప్పుడు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్‌లోని డీజీజీఐ అధికారుల ముందు విచారణకు ఈ సంస్థ ప్రతినిధులు హాజరుకాలేదు. ఐటీసీని ఈ సంస్థ చాలా తప్పుడు మార్గాల్లో ఉపయోగించుకుంది. జీఎస్టీ చట్టాన్ని సంస్థ ముఖ్య ప్రతినిధులు మరో విధంగా ఉపయోగించుకున్నారు. ప్రభుత్వానికి భారీగా నష్టం కలిగించేలా ఆర్థిక అవకతవకలు చేశారు. దీనిపై డీఆర్ఐ అధికారుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశాం' అని మాచవరం పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై కమిషనర్ రాత్రికి ఒక ప్రకటన విడుదల చేశారు. 'అవెక్సా సంస్థ 2017-22 పరిధిలో సీఆర్‌డీఏ పరిధిలో రోడ్ల నిర్మాణానికి కాంట్రాక్టు తీసుకుంది. ఎలాంటి రోడ్లూ వేయకుండానే బినామీ పేర్లతో ఢిల్లీలో మెటీరియల్ కొనుగోలు చేసినట్లుగా బోగస్ బిల్లులు సృష్టించింది. దీనిని డీజీజీఐ గుర్తించి రాష్ట్ర డీఆర్ఐకి నివేదిక పంపింది. దీనిపై ఆ విభాగం ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. ఐటీసీని పొందేందుకు అవెక్సా మారుమూల గ్రామాల్లో బ్యాంకు ఖాతాలు తెరిచి క్రెడిట్ పొందింది' అని అందులో తెలిపారు.


విజయవాడ సీపీ ఆఫీసు ఎదుట టీడీపీ నేతల ఆందోళన


శరత్‌ను న్యాయాధికారి ముందు హాజరుపరిచేందుకు తీసుకెళ్తున్న పోలీసులు

ఏం జరిగినా సీఎందే బాధ్యత: పుల్లారావు



అంతకుముందు టీడీపీ కార్యాలయంలో పుల్లారావు మీడియాతో మాట్లాడుతూ కన్నీరుపెట్టుకున్నారు. తన కుమారుడికి ఏం జరిగినా సీఎందే బాధ్యతని చెప్పారు. శరత్ ప్రాణాలకు హాని కలుగుతుందన్న ఆందోళన వ్యక్తం చేశారు. 'నా కుమారుడిని తీసుకెళ్లి 14 గంటలు అవుతున్నా ఆచూకీ లేదు. అతడేమైనా హత్యలు చేశాడా.. అత్యాచారాలు చేశాడా? ఆ కంపెనీలో శరత్‌కు ప్రమేయం లేకపోయినా ప్రథమ ముద్దాయిగా పెట్టారు. రాజకీయ కక్ష కారణంగానే ఆచూకీ తెలియజేయడం లేదు. నాకు చంద్రబాబు చిలకలూరిపేట టికెట్ ఇచ్చిన కొన్ని గంటల్లోనే ఈ కేసు నమోదు చేశారు. డీఆర్ఐ విభాగం సీఎం చెప్పుచేతల్లో ఉంటుంది. ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడమే జగన్ లక్ష్యం. ఇటువంటి అక్రమ కేసులను ఆపాలి. నా కుమారుడిని బేషరతుగా విడుదల చేయాలి' అని కోరారు.

శరత్ అక్రమ అరెస్టు
కక్ష సాధింపే!

▸▸ టీడీపీ నేతల్ని వేధిస్తున్నారు: చంద్రబాబు

అమరావతి(ఆంధ్రజ్యోతి), విజయవాడ (వన్ టౌన్), ఫిబ్రవరి 29: మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ అక్రమ అరెస్ట్ ముమ్మాటికీ ప్రభుత్వ కక్షసాధింపు చర్యేనని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. ఎన్నికల వేళ జగన్ కక్షసాధింపు రాజకీయాలు తీవ్రమయ్యాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదంతో, వ్యవస్థల్ని అడ్డం పెట్టుకుని, టీడీపీ నేతల్ని వేధిస్తున్నారని ఆరోపించారు. శరత్ అరెస్ట్ ఇందులో భాగమేనని విమర్శించారు. '40 రోజుల్లో ఇంటికి పోయే వైసీపీ ప్రభుత్వానికి అనుబంధ విభాగ సభ్యులుగా పనిచేస్తే.. అధికారులు మూల్యం చెల్లించక తప్పదు' అని చంద్రబాబు హెచ్చరించారు. కాగా, వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని, బలమైన టీడీపీ నేతలే లక్ష్యంగా సైకో జగన్ పన్నుతున్న కుతంత్రాలను తిప్పికొడతామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ స్పష్టం చేశారు. జగన్ దిగిపోయే ముందైనా సైకో చేష్టలు ఆపకపోతే.. భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. తండ్రిని రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు.

ముగ్గురు ఐఏఎస్‌లకు ఓపీఎస్!

(మొదటి పేజీ తరువాయి)

పది రోజుల క్రితం జరిగిన సమావేశంలోనూ అర్హులైనవారిని ఓపీఎస్‌లోకి తీసుకొస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. ఓపీఎస్ అమలు కోసం వీరంతా ఏడాదిన్నర నుంచి మొరపెట్టుకుంటున్నారు. అయినా వీరిపట్ల ఏమాత్రం కనికరం చూపని ప్రభుత్వం, ఆ ముగ్గురిని మాత్రమే ఓపీఎస్ పరిధిలోకి తీసుకొచ్చింది. కేంద్ర నిబంధనల మేరకు తమను ఓపీఎస్ పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ వారు వినతిపత్రాలు ఇచ్చినట్టే, ఉద్యోగుల తరఫున ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి అనేకసార్లు వినతులు సమర్పించాయి. ప్రభుత్వం వాటిని కనీసం పరిశీలించిన దాఖలాలు కూడా లేవు. ఐఏఎస్ అధికారుల సమస్యలు తప్ప, సాధారణ ఉద్యోగుల గోడు ప్రభుత్వానికి పట్టడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగులకు నమ్మకద్రోహం

అధికారంలోకి వచ్చిన వారంలోగా సీపీఎస్ రద్దు చేస్తానని ఇచ్చిన హామీని సీఎం జగన్ తుంగలో తొక్కారు. ఓపీఎస్ కోసం పోరాడుతున్న ఉద్యోగులకు అంతకంటే లోపభూయిష్ఠమైన జీపీఎస్ విధానాన్ని తెచ్చి ముప్పుతిప్పలు పెడుతున్న ప్రభుత్వం ఇప్పుడు వారికి మరింత నమ్మకద్రోహం చేసింది. సీపీఎస్ అమలుకు 2003 డిసెంబరు 22 కటాఫ్ తేదీ. ఆ రోజు నాటికి ఖాళీగా ఉన్న పోస్టుల్లో చేరిన ఉద్యోగులకు ఓపీఎస్ వర్తిస్తుందని కేంద్రం ధ్రువీకరించింది. ఈ మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు మెమో కూడా పంపింది. ఇలాంటి ఉద్యోగులు అందరినీ ఓపీఎస్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశాలిచ్చింది. తమకు జరుగుతున్న అన్యాయాలపై ఉద్యోగులు, ముఖ్యంగా సీపీఎస్ ఉద్యోగులు నిరసనలు తెలిపిన ప్రతిసారీ కటాఫ్ తేదీ కంటే ముందే వచ్చిన నోటిఫికేషన్ ద్వారా లేదా 2003 డిసెంబరు 22 నాటికి ఉన్న ఖాళీల్లో చేరిన ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తెస్తామంటూ బూటకపు హామీలిస్తున్నారు. దానికి తగ్గట్టుగానే ఇలాంటి ఉద్యోగులు ఎంతమంది ఉన్నారో శాఖల వారీగా, కేడర్ల వారీగా వివరాలు పంపాలంటూ ఒక సర్క్యులర్ ఇచ్చి ప్రభుత్వం ఒక్క పూట హడావుడి చేస్తుంది. తర్వాత దీని గురించి పట్టించుకొనే నాథుడే ఉండటం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'జేపీ'కి 1,250 కోట్ల రాయితీ!

▸▸ ఇసుకలో కోట్లు దండుకున్నారని తేలిపోయింది: పట్టాభిరాం

అమరావతి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ జేబులు నింపడం కోసం జేపీ వెంచర్స్ సంస్థకు రూ.1,250 కోట్ల రాయితీ ఇచ్చి ఇసుక టెండర్లు కట్టబెట్టారని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి ఇసుకలో జగన్ అండ్ కో రూ.వేల కోట్లు దండుకొన్నారని అధికారికంగా తేలిపోయిందని ఆ పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం ఆరోపించారు. గనుల శాఖ డైరెక్టర్ కేంద్రంలోని జీఎస్టీ విభాగానికి రాసిన లేఖతో ఈ అవినీతి భాగోతం బయటకు వచ్చిందన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం పట్టాభిరాం విలేకరులతో మాట్లాడారు.

జగన్‌పై పోటీకి నేను సిద్ధం!: దస్తగిరి

విజయవాడ(ధర్నాచౌక్), ఫిబ్రవరి 29: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి జై భీమ్ రావు భారత్ పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ గురువారం కండువా కప్పి ఆయనను ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి జగన్‌పై దస్తగిరి పోటీ చేస్తారని జడ శ్రావణ్‌కుమార్ ప్రకటించారు.

ఢీ అంటే ఢీ

▸▸ ప్రసంగాల సరళి మార్చిన చంద్రబాబు

▸▸ జగన్ డైలాగులపై పంచులతో ఎదురుదాడి

▸▸ 'సిద్ధం'అని జగన్ అంటే, సై అంటూ కౌంటర్

▸▸ 'వై నాట్' అంటూ ప్రశ్నల వర్షం

▸▸ కేడర్‌లో జోష్ పెంచుతున్న బాబు మాటలు

▸▸ సోషల్ మీడియాలోనూ ట్రెండింగ్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల వేళ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తన ప్రసంగాల సరళి మార్చారు. ఢీ అంటే ఢీ అంటూ మాటలతో మంటలు రేపుతున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డైలాగులను అదే ఊపుతో తిప్పికొడుతూ పంచ్‌లతో ఎదురు దాడి చేస్తున్నారు. ఈలలు, కేకలతో సభా ప్రాంగణం మోతెక్కేలా చేస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు గతంలో తన ప్రసంగాల్లో పంచ్ డైలాగులకు పెద్దగా ప్రాధాన్యం ఇచ్చేవారు కాదు. తాను అనుకొన్న విషయాన్ని విపులంగా జనానికి అర్థమయ్యేలా చెప్పాలని తాపత్రయపడేవారు. దీంతో ఆయన ప్రసంగాలు సుదీర్ఘంగా సాగేవి. కానీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయన ఆ పద్ధతిని మార్చేశారు. లెక్కలు, అంకెలు ఎత్తివేసి సూటిగా ఘాటుగా మాట్లాడుతున్నారు. 'రా... కదలి రా' పేరుతో జరిగిన సభల్లో ఆయన ఈ మార్పు చూపించారు. ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి ఎంతో కసరత్తు చేసి తన ప్రసంగాల్లో వాడుతున్న డైలాగులపై చంద్రబాబు వెంటనే మాటల తూటాలు పేలుస్తున్నారు. ఉదాహరణకు తమ తొలి ఎన్నికల సన్నాహక సభ భీమిలి బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ, పద్మవ్యూహంలో చిక్కుకోవడానికి తాను అభిమన్యుడిని కానని... అర్జునుడినని వ్యాఖ్యానించారు. దీనిపై పీలేరు సభలో చంద్రబాబు వెంటనే కౌంటర్ వేశారు. 'అయ్యా పురాణ పురుషా... నువ్వు అభిమన్యుడివి కాదు. ఆయన తండ్రి అర్జునుడివి కాదు. నువ్వు ఈ రాష్ట్రం పాలిట భస్మాసురుడివి. నీకు వేరే పద్మవ్యూహాలు అక్కర్లేదు. నీ నెత్తిన నువ్వు పెట్టుకొంటున్న చెయ్యి చాలు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య ద్వారా చంద్రబాబు తన పార్టీ శ్రేణులకు ఒక లైన్ ఇచ్చేశారు. జగన్ తాను ఎప్పుడు అర్జునుడినని చెప్పుకొన్నా ఆయన భస్మాసురుడని జవాబు ఇవ్వడానికి టీడీపీ నేతలు సిద్ధమైపోయారు. జగన్ తరచూ తన సభల్లో ప్రజలను ఉద్దేశించి..'నేను మీ బిడ్డను' అని వ్యాఖ్యానిస్తుంటారు. 'జగన్ మీబిడ్డ కాదు...కేన్సర్ గడ్డ' అని చంద్రబాబు కూడా ప్రతి సభలో ఎదురు దాడి చేస్తున్నారు. కేన్సర్ గడ్డ మాదిరిగా వివిధ వర్గాల ప్రజల జీవితాలను జగన్ ఎలా అతలాకుతలం చేస్తున్నారో కూడా ఉదాహరణలు ఇస్తున్నారు. భీమిలి సభ సమయంలో 'సిద్ధం' అనే ప్రచార వ్యూహాన్ని జగన్ శిబిరం ఎంచుకొని రాష్ట్రం అంతా అదే డైలాగుతో ఫ్లెక్సీలు పెట్టింది. భీమిలి సభలో కూడా దానినే హైలైట్ చేసింది. ఎన్నికల యుద్ధానికి తాము సిద్ధం అన్న థీమును వ్యక్తం చేయడానికి ఆ థీమ్‌ను ఆ పార్టీ వ్యూహకర్తలు ఎంచుకొన్నారు. దీనికి కూడా చంద్రబాబు తన సభల్లో కౌంటర్ ఇచ్చారు. 'సై' అన్న నినాదాన్ని ఆయన తనవైపు ఎంచుకొని వదిలారు. 'నిన్ను పాతర వేయడానికి యువత, రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, బాధిత వర్గాలన్నీ సిద్ధం. విజయ పతాకం ఎగరవేసే విజయయాత్రకు మేం సై' అని ఆయన ప్రకటించారు. వైఎస్ షర్మిల, పవన్ కల్యాణ్... చంద్రబాబు తరపు స్టార్ క్యాంపెయినర్లని జగన్ చేసిన ఆరోపణపై కూడా చంద్రబాబు తేలిక పదాలతో ఎదురుదాడి చేస్తున్నారు. 'ప్రజలే మాకు స్టార్ క్యాంపెయినర్లు. ఉద్యోగాలు లేని యువత, అభివృద్ధి లేని రాష్ట్రం, దగ్గాపడ్డ ప్రజలు, భద్రత లేని రాష్ట్రం, ఆగిపోయిన ప్రాజెక్టులు, పారిపోయిన పరిశ్రమలే మాకు స్టార్ క్యాంపెయినర్లు' అని ఆయన చెబుతున్నారు. తమ ప్రభుత్వం తొంభై ఎనిమిది శాతం హామీలు అమలు చేసిందని, తమకు విశ్వసనీయత ఉందని తన సభల్లో జగన్మోహన రెడ్డి చేస్తున్న ప్రకటనలపై కూడా చంద్రబాబు పూర్తి స్థాయిలో సన్నద్ధమై ప్రచార సమరం చేస్తున్నారు. వివిధ అంశాలపై గతంలో జగన్ చెప్పిన మాటలు, చేసిన వాగ్దానాలను ఆయన తన సభల్లో వీడియో వేసి చూపిస్తున్నారు. పెద్ద తెరలపై వాటిని ప్రజల ముందు ప్రదర్శిస్తున్నారు. 'కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెచ్చావా? మద్య నిషేధం అమలుచేశావా? సీపీఎస్ రద్దు అయిందా? జాబ్ క్యాలెండర్ ఇచ్చావా? పోలవరం పూర్తి చేశావా? రాజధాని కట్టావా? కరెంటు బిల్లులు తగ్గించావా? తొంభై ఎనిమిది శాతం హామీల్లో ఇవి లేవా' అని ఆయన ప్రశ్నిస్తున్నారు. 'వైనాట్ 175' అని జగన్ అంటుండగా... దీనిపై బుధవారం జరిగిన 'జెండా' సభలో చంద్రబాబు ఘాటుగా విరుచుకుపడ్డారు. 'వైనాట్ పులివెందుల?' అంటూ, 'వైనాట్ మెగా డీఎస్సీ, వైనాట్ జాబ్ క్యాలెండర్, వైనాట్ మద్య నిషేధం, వైనాట్ సీపీఎస్ రద్దు' అంటూ చంద్రబాబు ఒక్కో ప్రశ్న సంధిస్తుండగా సభకు వచ్చిన జనం ఉర్రూతలూగారు. మారిన ప్రసంగాల సరళి సామాజిక మాధ్యమాల్లో చంద్రబాబుకు ఆదరణ పెంచిందని, గతంతో పోలిస్తే వీక్షకుల సంఖ్య భారీగా పెరిగిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. రాబోయే రోజుల్లో ఆయన దూకుడు మరింత పెరగబోతోందని తెలిపాయి.



సంక్షేమం ముసుగులో
వైసీపీ దోపిడీ

▸▸ రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయింది: పురందేశ్వరి

అమరావతి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని, సంక్షేమం పేరుతో రాష్ట్ర ప్రభుత్వమే పేదల సొమ్మును దోచుకుంటోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. గురువారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులకు రాష్ట్రస్థాయి వర్క్‌షాపు, మైనార్టీ మోర్చా రాష్ట్రస్థాయి సమావేశాల్లో ఆమె ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని ఆమె చెప్పారు. కేంద్రం ఏం చేస్తుందో.. రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికలు ఇక ఎంతో దూరంలో లేవని, 50 రోజుల్లోనే ఎన్నికలకు వెళ్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో బీజేపీ మాత్రమే ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ ఎన్నికల తర్వాత బీజేపీ బలీయమైన శక్తిగా అవతరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ చేయడం లేదనే అపోహను తొలగించాల్సిన బాధ్యత మీడియా ప్యానలిస్టులపై ఉందన్నారు. మతం పేరుతో ఓట్లు దండుకునే సిద్ధాంతం కాంగ్రెస్ పార్టీదేనని విమర్శించారు. ట్రిపుల్ తలాక్ రద్దుతోపాటు మైనారిటీలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు.

వీఆర్ఎస్ తీసుకున్న 24 గంటల్లోనే
వైసీపీలోకి ఇంతియాజ్!

▸▸ సీఎం జగన్ సమక్షంలో చేరిక

▸▸ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జిగా నేడో రేపో ప్రకటన

అమరావతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద పదవీవిరమణ (వీఆర్ఎస్) తీసుకున్న 24 గంటల్లోపే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ వైసీపీలో చేరిపోయారు. వచ్చే ఏడాది మే 31 వరకు సర్వీసు ఉన్నా.. ఆయన బుధవారం ఉదయం వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేయడం.. మధ్యాహ్నానికి ప్రభుత్వం అంగీకరించడం.. సాయంత్రానికి వీఆర్ఎస్‌ను ఆమోదిస్తూ సీఎస్ జవహర్‌రెడ్డి జీవో 477 జారీచేయడం తెలిసిందే. అంతే వేగంతో ఆయన గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇక్కడి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కర్నూలు వైసీపీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తో కలిసి ఇంతియాజ్ సీఎంతో సమావేశమయ్యారు. జగన్ ఆయనకు వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హఫీజ్‌ఖాన్ స్థానంలో కర్నూలు అసెంబ్లీ సీటు ఇన్‌చార్జిగా ఇంతియాజ్‌ను నేడో రేపో జగన్ ప్రకటిస్తారని వైసీపీ ముఖ్యనేతలు చెబుతున్నారు.

నేడు తిరుపతిలో కాంగ్రెస్ బహిరంగసభ

▸▸ ఏఐసీసీ నేత సచిన్ పైలట్, పీసీసీ చీఫ్ షర్మిల హాజరు

తిరుపతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ బహిరంగసభ జరగనుంది. 2014 ఎన్నికల సమయంలో తిరుపతిలో నరేంద్ర మోదీ. ... బీజేపీ ప్రధాన మంత్రి అభ్యర్థి హోదాలో ఏపీకి ప్రత్యేక హోదాపై హామీ ఇచ్చిన చోటే ఈ సభను నిర్వహించనున్నారు. అప్పటి మోదీ హామీలను ప్రజలకు గుర్తు చేయడంతోపాటు వాటి అమలుపై కాంగ్రెస్ నేతలు....మోదీని ఈ సందర్భంగా నిలదీయనున్నారు. ప్రత్యేక హోదాపై డిక్లరేషన్ విడుదల చేస్తారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలతోపాటు రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు ఈ సభలో పాల్గొననున్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో 2014 ఎన్నికల సందర్భంలో బీజేపీ నిర్వహించిన బహిరంగసభలో మోదీ పాల్గొన్నారు. తాము అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తామని ఆ సభలో ఆయన హామీ ఇచ్చారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటిస్తామని కూడా వాగ్దానం చేశారు. ఇప్పుడు అదే స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగసభ ఏర్పాటుచేసింది. దీనికోసం భారీగా జన సమీకరణ చేయాలని, 30వేల మందితో సభ జరపాలని నేతలు ప్రయత్నిస్తున్నారు.

ఏపీఎన్జీజీవో
నూతన అధ్యక్షుడిగా శివారెడ్డి

విజయవాడ, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్ అండ్ గజిటెడ్ ఆఫీసర్స్ (ఏపీఎన్‌జీజీఓ) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కేవీ శివారెడ్డి, చౌదరి పురుషోత్తమనాయుడు ఎంపికయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు బండి శ్రీనివాసరావుకు మార్చి నెలలో పదవీ విరమణ ఉండడంతో.. ఆయన తన బాధ్యతల నుంచి తప్పుకోగా, ఇప్పటి వరకు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న కేవీ శివారెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గురువారం ఏపీఎన్‌జీఓ భవన్‌లో రాష్ట్ర సెక్రటేరియట్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వీరిద్దరినీ కో ఆప్షన్ విధానంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాధ్యక్షులుగా వి.దస్తగిరి రెడ్డి (కర్నూలు), ఉపాధ్యక్షుడిగా బి.వెంకటేశ్వర్లు (నెల్లూరు) ఎన్నికయ్యారు. శివారెడ్డి మాట్లాడుతూ, ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం నుంచి రాబట్టడమే తమ కర్తవ్యంగా ముందుకు సాగుతామన్నారు. ఏపీఎన్‌జీఈఓ అధ్యక్షుడిగా అమూల్యమైన సేవలు అందించిన బండి శ్రీనివాసరావును తాడేపల్లిలో మార్చి 6న ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు.

రోత ముఠా... ఫేక్ రాత!

- పదేపదే 'ఆంధ్రజ్యోతి' లోగోతో ఫేక్ వార్తల సృష్టి
- నీలి మీడియాకు విశ్వసనీయత లేదని ఒప్పుకొన్నట్లే!
- పవన్‌కు నాలుగో భార్య అంటూ తప్పుడు కథనం
- 'జెండా' సభపైనా వైసీపీ ఫేక్ వీడియోలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అంతా నీచమే! పేటీఎం ఫేక్ బతుకులే! విపక్ష నేతలపై బురదచల్లేందుకు తప్పుడు వార్తలను సృష్టించడం, వాటికి 'ఆంధ్రజ్యోతి', 'వే టు న్యూస్' వంటి ప్రముఖ మీడియా లోగోలు వాడుకోవడం! ఇదే పాడు పద్ధతి! సొంత రోత మీడియాను నమ్మరనీ, దానికి విశ్వసనీయత లేదని వారికీ తెలిసిపోయింది. అందుకే... నిజాలను నిక్కచ్చిగా రాసే 'ఆంధ్రజ్యోతి' పేరుతో ఫేక్ వార్తలను ప్రచారంలోకి తెస్తున్నారు. 'కాలకేయుల్లా' మారిన వైసీపీ సోషల్ మీడియా విభాగం ఇప్పటికే అన్ని విలువలను వదిలేసింది. తాజాగా... జనసేన అధిపతి పవన్ కల్యాణ్ నాలుగో భార్య అంటూ ఒక మహిళ పేరు తెరపైకి తెచ్చి, నానా నీచపు రాతలు రాసి, అదంతా 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైనట్లుగా ఒక పోస్టును సృష్టించారు. బుధవారం జరిగిన 'జెండా' సభలో సీఎం జగన్‌పై పవన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. 'జగన్ దృష్టిలో నేనంటే... రెండు విడాకులు, మూడు పెళ్లిళ్లు. నాలుగో పెళ్లి అని కూడా అంటున్నారు. నాలుగో భార్య ఎవరో... జగనేనేమో' అంటూ ముఖ్యమంత్రికి చురకలు అంటించారు. దీంతో... వైసీపీ విలవిల్లాడిపోయింది. ఆ వెంటనే... పవన్ కల్యాణ్ నాలుగో భార్య అంటూ ఒక మహిళ ఫొటోతో తప్పుడు వార్త సృష్టించి, అది 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైనట్లుగా ఫేక్ ప్రచారానికి తెరలేపారు. జగన్‌కు సొంత మీడియా సంస్థ ఉంది. రోత రాతలు రాసే పత్రిక ఉంది. వాళ్లు చెప్పింది, నమ్మింది నిజమైతే... ఆ మీడియాలోనే రాసుకోవచ్చు. లేదా... ఫేక్ వార్తలకు నీలి, కూలి మీడియా లోగోలు వాడుకోవచ్చు. కానీ... పనిగట్టుకుని పదే పదే 'ఆంధ్రజ్యోతి' పేరునే వాడుకుంటున్నారు. 'ఆంధ్రజ్యోతి, ఈనాడు'ను జగన్ అన్ని సభల్లో స్మరించుకుంటుండగా... ఆయన సోషల్ మీడియా విభాగం 'ఆంధ్రజ్యోతి'ని ఇలా వాడుకుంటోంది. అంటే... జగన్ సొంత మీడియాలో వచ్చిన వార్తలను ఎవరూ నమ్మరని, 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైందని చెబితేనే విశ్వసిస్తారని వారూ గ్రహించారన్న మాట!

సభ జరుగుతుండగానే...

తాడేపల్లిగూడెం వద్ద బుధవారం టీడీపీ-జనసేన ఉమ్మడి సభ ముగియక ముందే వైసీపీ సోషల్ మీడియా ఫేక్ దాడి మొదలుపెట్టింది. వాయిస్ మార్ఫింగ్, తప్పుడు పత్రికా ప్రకటనలతో ప్రజలను గందరగోళానికి గురిచేసేందుకు ప్రయత్నించింది. 'టీడీపీ-జనసేన విన్నింగ్ టీమ్. వైసీపీ చీటింగ్ టీమ్' అని చంద్రబాబు పేర్కొనగా... దీనికి రివర్స్‌లో అన్నట్లుగా వాయిస్ మార్ఫి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. పొత్తులో 24 సీట్లను ఎందుకు తీసుకున్నామో పవన్ కల్యాణ్ 'జెండా' సభలో వివరంగా చెప్పారు. కానీ... 'నా నిర్ణయంతో ఏకీభవించకపోతే వైసీపీలో చేరిపోండి' అని జనసేన శ్రేణులపై పవన్ మండిపడినట్లుగా నీలి ముఠా సోషల్ మీడియాలో ఒక ఫేక్ ప్రకటనను విడుదల చేసింది. దీనిపై టీడీపీ, జనసేన వెంటనే అప్రమత్తమయ్యాయి. వైసీపీ ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దంటూ అప్పటికప్పుడు ప్రజలకు సూచించాయి.

రాక్షస కక్ష!

(మొదటి పేజీ తరువాయి)

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చీఫ్ కూడా ఆయనే! ఆయన నుంచి ఒక అసాధారణ ప్రతిపాదన వచ్చింది. అది అమలైతే.... 'విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్' విభాగం ఒక అసాధారణ శక్తిగా మారుతుంది. దానిని జగన్ సర్కారు 'అరాచక శక్తి'గా మార్చడమూ ఖాయంగా కనిపిస్తోంది.

ఇదీ స్కెచ్...

రాష్ట్రంలోని అన్ని కీలక, ఇంజనీరింగ్ విభాగాల్లో విజిలెన్స్ వింగ్ ఉంటుంది. తమ శాఖలో జరిగిన లోటుపాట్లపై ఒక కన్నేసి ఉంచుతుంది. ఇక... రాష్ట్ర స్థాయిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఉంటుంది. మీడియాలో వచ్చే వార్తలు, తమకు అందే ఫిర్యాదులతోపాటు సుమోటోగా కూడా స్పందించి ఆయా అంశాలపై విచారణ జరపవచ్చు. ప్రభుత్వానికి నష్టం కలిగించే చర్యలను గుర్తించి బాధ్యులపై చర్యలకు సిఫారసు చేయవచ్చు. దీనిపై అంతిమ నిర్ణయం మాత్రం ప్రభుత్వానిదే. ప్రస్తుతం ఈ విభాగానికి కొల్లి రఘురామిరెడ్డి అధిపతిగా ఉన్నారు. ఈనెల 5వ తేదీన ప్రభుత్వానికి ఒక అసాధారణ ప్రతిపాదన పంపించారు. పది పేజీల లేఖలోని అంశాలను క్లుప్తంగా చెప్పాలంటే... 'రాష్ట్రంలోని అన్ని కీలక శాఖలకు చెందిన అధికారాలను నాకే అప్పగించండి. నేను సూపర్ పవర్‌గా మారి... అన్ని రకాల అక్రమాలను అరికట్టి, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా అడ్డుకుంటా!' అని తెలిపారు. దీని ప్రకారం... పన్నులు, పన్నేతర విభాగాలన్నింటిపైనా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి పట్టు లభిస్తుంది. ప్రభుత్వ నిధులు, ఆస్తులు, సహజ వనరులు... ఇలా ఏ రూపంలో ప్రభుత్వానికి నష్టం వాటిల్లినా, అది ఏ శాఖ పరిధిలోనిదైనా రంగంలోకి దిగుతుంది. ఎక్కడైనా చొరబడి, తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించి, స్వాధీనం చేసుకుని, అవసరమైతే అరెస్టు చేసే అధికారాలు లభిస్తాయి. ఆ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలోని గెజిటెడ్ ఆఫీసర్లకు అధికారాలు ఇవ్వాలని కొల్లి రఘురామిరెడ్డి కోరారు.

తమ పరిధిలోకి తేవాలంటూ 'కొల్లి' కోరిన చట్టాలు ఇవే...

1. ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ చట్టం-2017,
2. ఆంధ్రప్రదేశ్ విలువ ఆధారిత పన్ను చట్టం-2005,
3. ఆంధ్రప్రదేశ్ టాక్స్ ఆన్ ప్రొఫెషన్స్, ట్రేడ్స్, కాలింగ్స్ మరియు ఉపాధి చట్టం-1987
4. కేంద్ర అమ్మకం పన్నుల చట్టం-1956
5. ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం-1968
6. భారతీయ స్టాంప్‌చట్టం-1899
7. రిజిస్ట్రేషన్ చట్టం-1908
8. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ డ్యూటీ యాక్ట్-1939
9. గనులు, ఖనిజాల చట్టం-1957
10. ఆంధ్రప్రదేశ్ మోటారు వాహనాల పన్ను చట్టం-1963
11. సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం-2001
12. ఆంధ్రా ఏరియా టౌన్‌ప్లానింగ్ చట్టం-1920
13. ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం-1967

అన్నీ ఆయన పరిధిలోకే...

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఏయే చట్టాల ప్రకారం కొత్త అధికారాలు కట్టబెట్టవచ్చో కూడా కొల్లి రఘురామిరెడ్డి వివరించారు. ఏకంగా 12 ప్రభుత్వ శాఖలు, వాటి పరిధిలోని 13 చట్టాల అమలు బాధ్యత తమకే కావాలని కోరారు. రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ జీఎస్టీ, వాణిజ్య పన్నులు, రవాణా, సొసైటీ రిజిస్ట్రేషన్, టౌన్ ప్లానింగ్, అటవీ, ఎక్సైజ్, విద్యుత్తు, గనులు, ఆర్థిక శాఖకు సంబంధించిన పలు చట్టాలను ఉదహరించారు. వాటన్నింటి ప్రకారం రాష్ట్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్‌కు అధికారాలు కట్టబెట్టారని... విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు 'అంతకుమించి' పవర్స్ కావాలని ప్రతిపాదించారు. అంటే... రాష్ట్రంలోని అన్ని కీలక శాఖలు చేసే పనులన్నీ తామే చేస్తానని చెప్పడమే.

ఇదీ ఆయన చెప్పిన కారణం..

"విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దృష్టికి వచ్చిన అనేక ఆరోపణలపై విచారణలు చేసే సమయంలో గోప్యత పాటిస్తాం. కానీ... కొన్ని శాఖల నుంచి వచ్చే సమస్యల వల్ల రహస్యాలను కాపాడే విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రాష్ట్ర సచివాలయం, విభాగాధిపతులు, కలెక్టరేట్లు, ఇతర విభాగాల్లోని రికార్డులు, సమాచారం తీసుకునే అధికారం మాకు ఉంది. అయితే... ఇది కేవలం ఎగ్జిక్యూటివ్ అధికారం మాత్రమే. దీనికి చట్టబద్ధమైన బలం లేదు" అని కొల్లి వివరించారు. అందుకే... విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు మరిన్ని కోరలు తొడగాలని కోరారు.

పెద్దల సూచన మేరకేనా...

రాష్ట్రంలో ఏసీబీ, లోకాయుక్త, ఇంకా అనేకానేక స్వతంత్ర సంస్థలు పనిచేస్తున్నాయి. కీలక శాఖలకు సొంతంగా విజిలెన్స్ విభాగాలు ఉన్నాయి. ఆయా శాఖలకు చట్టబద్ధమైన అధికారాలు ఉన్నాయి. అవేవీ ఇతర శాఖల విధుల్లో తలదూర్చడానికి వీల్లేదు. ఇతరుల అధికారాలు తమకు ఇవ్వాలని కోరడానికి లేదు. అలా కోరడమంటే ఆయా శాఖలన్నీ విఫలమయ్యాయి అని చెప్పడమే. కానీ... ఇప్పుడు అన్ని శాఖల అధికారాలను తమకు ఇవ్వాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చీఫ్ అధికారికంగా లేఖ రాయడం గమనార్హం. ఒక ఐపీఎస్ అధికారి నుంచి ఇలాంటి ప్రతిపాదనలు రావడం అసాధారణమని, ప్రభుత్వ పెద్దల సూచన మేరకే ఆయన ఈ లేఖ రాసి ఉండొచ్చని ప్రభుత్వ పాలనపై పూర్తి అవగాహన ఉన్న వారు చెబుతున్నారు. కొల్లి ఇలా లేఖ రాయడమే ఆలస్యం... సచివాలయంలో ఫైలు కూడా కదలడం దీనికి బలం చేకూరుస్తోంది. అనేక చట్టాలు, విభాగాలకు సంబంధించింది కావడంతో న్యాయ శాఖ పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.

విపక్షాలే లక్ష్యం...

జగన్ ఇప్పటికే అన్ని కీలక విభాగాలను కక్ష సాధింపు చర్యలకు ఉపయోగించుకుంటున్నారు. ఇప్పుడు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను 'సూపర్ పవర్'గా మార్చేస్తున్నారు. అదే జరిగితే... విపక్ష నేతలు, గిట్టని వ్యక్తులు, సంస్థలకు చెందిన కార్యాలయాలు, నివాసాల్లోకి చొరబడి సోదాల పేరుతో వేధించవచ్చు. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల పరిధి, జీఎస్టీ చెల్లింపులు, ఆర్థిక లావాదేవీలు, పెట్టుబడులు, వస్తువుల ఉత్పత్తి, రవాణా, పన్నుల మదింపు, పన్నుల పరిశీలన, వృత్తిపన్ను, ట్రేడర్లు, ఉపాధి కల్పన పరిధిలోని విభాగాల్లో ఖాతాలు, పత్రాల పరిశీలన, తనిఖీలు, అవసరాన్ని బట్టి అరెస్టులు, అవసరాన్ని బట్టి ఆస్తుల జప్తు, కేంద్ర అమ్మకం పన్ను చట్టం ప్రకారం అవసరమైతే ఏదైనా సంస్థ చెల్లించిన పన్నును పునఃసమీక్షించడం, ఎక్సైజ్ చట్టం ప్రకారం ముందస్తు వారెంట్ లేకుండానే అరెస్టు చేయడం.... ఇలా అనేక మితిమీరిన అధికారాలు 'విజిలెన్స్'కు దక్కుతాయి. ఈ లెక్కన ఇడ్లీ బండి నుంచి కార్పొరేట్ కంపెనీల వరకు అన్నీ ఈ విభాగం పరిధిలోకి వస్తాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నుంచి... అదీ కొల్లి రఘురామిరెడ్డి నుంచి ఈ ప్రతిపాదన రావడం గమనార్హం. ఎందుకంటే... 'జగన్ శాసిస్తారు. కొల్లి పాటిస్తారు' అనే పేరు ఇప్పటికే ఉంది. ఎన్నికల ముందు విపక్ష నేతలను మరింతగా ఇబ్బంది పెట్టేందుకే తాజా ప్రతిపాదనను తెరపైకి తెచ్చారనే అనుమానం కలుగుతోంది.

ఓట్లెందుకు తీసేశారు?

- పిటిషనర్ల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నారా?
- అవి 'మూస' ఉత్తర్వులు.. పరుచూరు కేసులో హైకోర్టు వ్యాఖ్య



అమరావతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా నుంచి పిటిషనర్ల పేర్లను తొలగిస్తూ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్వో) ఇచ్చిన ఉత్తర్వులు మూసధోరణిలో ఉన్నాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఓట్ల తొలగింపు విషయంలో పిటిషనర్ల అభ్యంతరాలు పరిగణలోకి తీసుకున్నారా.. లేదా? ఏ కారణంతో వారి పేర్లను ఓట్ల జాబితా నుంచి తొలగించారు తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ)ని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 5కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశాలిచ్చింది. ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా, సంబంధిత ఓటర్ల నుంచి వివరణ తీసుకోకుండా ఫాం-7 దరఖాస్తుల ఆధారంగా ఇష్టారీతిన తమ పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని పేర్కొంటూ బాపట్ల జిల్లా పరుచూరు నియోజకవర్గం పరుచూరు మండల పరిధిలోని తిమ్మరాజుపాలేనికి చెందిన బి.గౌతవి, మరో 10మంది హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఇదే నియోజకవర్గం పరిధిలోని అన్నంబొట్లవారిపాలెం, తిమ్మరాజుపాలెం, దేవరపల్లి, బోడవాడ, అడుసుమల్లి, నాగులపాలెం గ్రామాలకు చెందిన మరికొందరు కూడా ఓట్ల తొలగింపుపై పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. జాబితా నుంచి ఓట్లను తొలగిస్తూ ఈర్వో జారీ చేసిన ఉత్తర్వులను అప్పిలేట్ అథారిటీలో సవాల్ చేసేందుకు పిటిషనర్లకు వెసులుబాటు ఇచ్చారు. అప్పీల్ వేసిన మూడువారాల్లో దానిని పరిష్కరించాలని అథారిటీకి స్పష్టం చేశారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్లు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఇది గురువారం విచారణకు రాగా అప్పీల్ దాఖలు చేసినవారి తరఫున న్యాయవాది పదిరి రవితేజ వాదనలు వినిపించారు. పిటిషనర్లు స్థానికంగా నివాసం ఉండడం లేదంటూ ఒకే వ్యక్తి గంపగుత్తగా ఫాం-7 దరఖాస్తులు చేశారని.. వారు స్థానిక గ్రామస్తులమని నిరూపించుకునేందుకు ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతా పుస్తకాలను ఎన్నికల అధికారులకు సమర్పించారని.. అయినా వారి అభ్యంతరాలను ఈఆర్వో పట్టించుకోలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఏ కారణంతో ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తున్నారో పేర్కొనకుండా ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఈసీ తరఫు న్యాయవాది శివదర్శన్ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు స్థానికంగా నివాసం ఉండడం లేదని.. అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకున్నాకే ఓటర్ల జాబితా నుంచి పిటిషనర్ల పేర్లను తొలగించారన్నారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఓటర్ల జాబితా నుంచి పిటిషనర్ల పేర్లను తొలగిస్తూ ఎన్నికల అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు మూసధోరణిలో ఉన్నాయని తెలిపింది.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై తీర్పు రిజర్వు

పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పాత పోలింగ్ కేంద్రాలను మరోచోటకు మార్చే విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన రూల్స్/ మార్గదర్శకాలను జిల్లా ఎన్నికల అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొంటూ నరసరావుపేట నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చదలవాడ అరవింద్‌బాబు, వ్యాపారి తమ్మిశెట్టి బుల్లిబాబు, పత్తికొండ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యామ్‌బాబు, మరికొందరు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్,జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, న్యాయవాదులు జవ్వాజి శరత్‌చంద్ర, టి.వేణుగోపాల్ వాదనలు వినిపించారు. రెండు కిలోమీటర్ల దూరంలోపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఈసీ నిబంధనలు చెబుతున్నా, 4 నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారని తెలిపారు. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. పోలింగ్ కేంద్రం నిర్దిష్ట దూరంలో ఉండాలనడానికి ఎలాంటి నిబంధనలూ లేవన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- 10.52లక్షల మంది విద్యార్థులు

అమరావతి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈనెల 20 వరకు జరుగుతాయి. మొత్తం 10,52,221 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అందులో మొదటి సంవత్సరం 5,17,617 మంది, రెండో సంవత్సరం 5,34,604 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఇందుకోసం 1559 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇంటర్ విద్యామండలి గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో 105 కేంద్రాలు అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో, 57 కేంద్రాలు సున్నితమైన ప్రాంతాల్లో ఉన్నట్లు వివరించింది. పరీక్షలపై సందేహాలకు 08645-277707, 18004251531 నంబర్లతో తాడేపల్లిలోని కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

465 కంపెనీల సీఆర్పీఎఫ్ బలగాలు కావాలి: సీఎస్

- ఎన్నికల బందోబస్తుపై కేంద్ర హోంశాఖ కాన్ఫరెన్స్

అమరావతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పటిష్ఠ బందోబస్తుకుగాను రాష్ట్రానికి 465 కంపెనీల సీఆర్పీఎఫ్ బలగాలు అవసరమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కేంద్ర హోంశాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. వివిధ రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీలు, సీఈవోలు, హోంశాఖ కార్యదర్శులతో గురువారం ఢిల్లీ నుంచి కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బందోబస్తు ఏర్పాటుకు 465 కంపెనీల సీఆర్పీఎఫ్ బలగాలు, 58 కంపెనీల ఎస్‌ఏపీ(స్పెషల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్) బలగాలు అవసరం ఉందని వివరించారు. ఎస్‌ఏపీకి సంబంధించి ప్రభుత్వం 32 కంపెనీల బలగాలు మాత్రమే ఉన్నాయని, మరో 26 కంపెనీల ఎస్‌ఏపీ బలగాలను పంపాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

అమరావతి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 2023-24 వరకు ఆస్తి పన్ను (భవనాలు, ఖాళీ స్థలాలు) బకాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే 2023-24లోని బకాయిలు, ప్రస్తుత సంవత్సరంలో ఆస్తి పన్ను డిమాండ్‌పై ఇప్పటికే చెల్లించిన వడ్డీని పన్ను చెల్లింపుదారులకు వాపసు ఇవ్వరని, ఆ మొత్తాన్ని భవిష్యత్తు ఆస్తి పన్నుకు సర్దుబాటు చేస్తారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

జగన్‌లాంటి అబద్ధాలకోరును చూడలేదు: అచ్చెన్న



నందిగాం, ఫిబ్రవరి 29: ముఖ్యమంత్రి జగన్ రెడ్డి లాంటి అబద్ధాల కోరును చూడలేదంటూ రాష్ట్రంలోని ఐదుకోట్ల మంది ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం శ్రీకాకుళ జిల్లా నందిగాం మండలం పెద్దబాణాపురంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంపద పెంచి, సృష్టించి పంచినప్పుడే నిజమైన నాయకుడు అవుతారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులపాల్జేసి.. తన రాజకీయ లబ్ధి కోసం కొందరికి మాత్రమే బటన్ నొక్కుతున్నారన్నారు. ఉద్యోగాలు లేవు, పరిశ్రమలు లేవు, స్వయం ఉపాధి వంటివి లేక వ్యవస్థలు కుంటుపడ్డాయని, దీంతో ప్రజలు ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురుచూస్తున్నారని చెప్పారు. దుర్మార్గంగా ఉన్న వైసీపీ పాలనను బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేస్తుంటే.. జగన్ మాత్రం ప్రతిపక్షనేతల్ని తిట్టిన వారికి ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకులు వలంటీర్లు, పోలీసులు వ్యవస్థలు లేకుండా గ్రామాల్లో మాట్లాడగలరా అని ప్రశ్నించారు. జనసేన, టీడీపీ పొత్తును చెడగొట్టాలని ప్రయత్నించి విఫలమైన వైసీపీ నేతలు.. ఇప్పుడు తమకు ఓటమి తప్పదని వణికిపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్ సరేనంటే ప్రభుత్వ కార్యాలయమే!

- కాదంటే పర్యాటకానికే ఉపయోగిస్తాం
- రుషికొండ భవనంపై రోజా వ్యాఖ్యలు
- శారదా పీఠాధిపతితో కలిసి ప్రారంభోత్సవం



రుషికొండలో భవనం ప్రారంభోత్సవంలో మంత్రులు రోజా, అమర్నాథ్, శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర, వైవీ సుబ్బారెడ్డి

విశాఖపట్నం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రుషికొండలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన పర్యాటక శాఖ భవన సముదాయాన్ని సీఎం క్యాంపు కార్యాలయంగా ఉపయోగించుకోవచ్చని త్రిసభ్య కమిటీ ఇప్పటికే సిఫారసు చేసిందని, సీఎం జగన్ సరేనంటే సంతోషంగా ప్రభుత్వ కార్యాలయంగా మార్చేస్తామని పర్యాటక మంత్రి రోజా చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా రుషికొండలో నిర్మించిన భవనాన్ని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతితో కలిసి ఆమె గురువారం ఉదయం ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. త్రిసభ్య కమిటీ ప్రతిపాదనకు సీఎం అంగీకరించకపోతే భవనాలను పర్యాటకుల కోసమే ఉపయోగిస్తామన్నారు. కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జడ్) అనుమతితోనే వీటిని నిర్మించామని చెప్పారు. ఐటీ, పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ.. భవనాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలో కొద్దిరోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఏపీటీడీసీ ఎండీ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు. సర్వమత ప్రార్థనలు చేసి ఈ భవనాన్ని ప్రారంభించినట్లు ప్రకటించినా.. విడుదల చేసిన ఫొటోల్లో ఎక్కడా క్రైస్తవ, ముస్లిం మత పెద్దలు కనిపించలేదు.

దారిపొడవునా పోలీసు తనిఖీలు

రుషికొండలో ప్రభుత్వ కార్యక్రమం జరిగితే ఆ మార్గాన్ని పోలీసులతో నింపేస్తున్నారు. విద్యాలయాలు, ఐటీ కంపెనీల ఉద్యోగులను కూడా అడ్డగిస్తున్నారు. గురువారం కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. పోలీసులు ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, అనుమానితులను రుషికొండ వైపు వెళ్లకుండా వెనక్కి పంపించారు. మీడియా ప్రతినిధులను రుషికొండ పరిసరాల వరకు చేరనివ్వలేదు. రుషికొండ రహదారికి ఇవతలి వైపు నిల్చొని లోపలకు వెళ్తున్న వాహనాలను 'ఆంధ్రజ్యోతి' విలేకరి ఫొటోలు తీయగా. ఆ ఫోన్‌ను ఓ పోలీసు అధికారి లాక్కున్నారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ రుషికొండకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసి, ముందుగానే హౌస్ అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. అప్పటికే ఆయన ఇంటి నుంచి బయటకు వచ్చేయడంతో రుషికొండ వరకు వెళ్లకుండా ఆపేశారు. సీఎం జగన్ పర్యటనల్లో భద్రత పేరుతో హడావుడి చేసే పోలీసులు.. ప్రభుత్వ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూడా అడ్డంకులు కల్పించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

సీఎం ఆఫీసుకని చెప్పే ధైర్యం లేక..మంత్రుల నాలుక మడత

వైసీపీలో అధినేత నుంచి మంత్రుల వరకు 'చేసేది ఒకటి.. చెప్పేది మరొకటి'గా ఉంటోంది. దీనిని చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నా వారి తీరులో మార్పు కనిపించడం లేదు. ప్రతిపక్షంలో ఉండగా రాష్ట్ర రాజధానిగా అమరావతిని అంగీకరించి, అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పల్లవి అందుకున్నారు. విశాఖ పరిపాలన రాజధాని అని ప్రకటించారు. ఇక్కడ సీఎం క్యాంపు కార్యాలయం కోసమని రుషికొండపై ఉన్న పర్యాటక శాఖకు చెందిన అందమైన హరిత రిసార్ట్‌ను కూలగొట్టి రూ.450 కోట్లతో రాజభవనం నిర్మించుకున్నారు. కానీ, న్యాయస్థానాల్లో కేసులు ఉండడంతో అది సీఎం క్యాంపు కార్యాలయమేనని చెప్పేధైర్యం చేయలేకపోతున్నారు. అందుకే ప్రారంభోత్సవానికి జగన్ ముఖం చాటేశారు.

కోడ్ వస్తుందనే హడావుడి..

ఇంకొద్దిరోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశముంది. ఆ వెంటనే కోడ్ అమల్లోకి వస్తే రుషికొండ భవనాన్ని ప్రారంభించే అవకాశం ఉండదు. ఎన్నికల తర్వాత ఏమవుతుందో తెలియదు కాబట్టి ఇప్పుడు హడావుడిగా ప్రారంభోత్సవం చేసేశారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వ భవనాలనూ పీఠాధిపతులతో కలిసి ప్రారంభించిన దాఖలాలు లేవు. కానీ జగన్‌కు రాజగురువుగా వ్యవహరిస్తున్న శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతితో రుషికొండ భవనాన్ని ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. అందులో తొలి అడుగు పెట్టింది సీఎం చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి, శారదా పీఠాధిపతే కావడం గమనార్హం.

9.88 ఎకరాలు.. ఏడు బ్లాకులు



రుషికొండలో పర్యాటక శాఖ నిర్మించిన భవనం

9.88 ఎకరాల్లో 1,48,413 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనంలోని ఏడు బ్లాకులకు.. వేంగి-ఏ, వేంగి-బీ, కళింగ, గజపతి, విజయనగర-ఏ, విజయనగర-బీ, విజయనగర-సీ అని పేర్లు పెట్టారు. నిర్మాణ పనులు మూడు దశల్లో పూర్తి చేశారు. తొలుత స్థలం అభివృద్ధి (కొండకు గుండు కొట్టడం), తర్వాత స్లోప్ ప్రొటెక్షన్ (చెట్లను నరికేసి వాటి స్థానంలో ఆకుపచ్చటి జియో మ్యాట్ వేయడం), ఆఖరుగా స్ట్రక్చర్లు, ఆర్కిటెక్చర్, ఇంటీరియర్, ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టారు. నీటి సరఫరా కోసం రెండు సంపులు, వ్యర్థ జలాల శుద్ధి, పునర్వినియోగం కోసం మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మించారు. విద్యుత్ సదుపాయం కోసం కంటెయినర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. 1010 కేవీఏ సామర్థ్యం కలిగిన జనరేటర్లు మూడు పెట్టారు. స్థలం చదును, నిర్మాణాలు, మౌలిక వసతుల కోసం రూ.365.24 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి రోజా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే పర్యాటక శాఖ రూ.450 కోట్లతో ఈ విలాసవంతమైన భవనాలు నిర్మించింది. గతంలో ఉన్న ఏపీటీడీసీ హరిత రిసార్ట్‌ను కూలగొట్టి 2020లో పనులు మొదలుపెట్టింది. వీటికి 2021లో కోస్తా నియంత్రణ మండలి ఆమోదం లభించింది. మహా విశాఖ నగర పాలక సంస్థ 2022లో నిర్మాణాలకు అనుమతులిచ్చింది. అగ్నిమాపక శాఖ నిరుడు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం జారీ చేసింది. అయితే పనులు పూర్తి కాకుండా, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ కాకుండానే శారదాపీఠాధిపతి చేతుల మీదుగా ప్రారంభించారు.

బ్లాకుల్లో ఇవీ..

వేంగి-ఏ: సెక్యూరిటీ, బ్యాక్ ఆఫీసు, సూట్ రూమ్‌లు, రెస్టారెంట్

వేంగి-బీ: అతిథుల గదులు, సమావేశ మందిరాలు, రెస్టారెంట్‌తో కూడిన బిజినెస్ హోటల్

కళింగ: రిసెప్షన్ కమ్ వెయిటింగ్ ఏరియా, లగ్జరీ సూట్‌లు, సమావేశ మందిరం, బాంకెట్ హాల్స్

గజపతి: హౌస్ కీపింగ్, కెఫేటేరియా, వ్యాపార కేంద్రం.

విజయనగర-ఏ, బీ, సీ: ప్రెసిడెన్షియల్ సూట్, విల్లా సూట్లు, స్పా, ఫిట్‌నెస్ సెంటర్, బాంకెట్ హాల్.

తెలంగాణలో 'మెగా' డీఎస్సీ

- 11,062 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ వచ్చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. గత ప్రభుత్వం 5,089 ఖాళీలతో విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రేవంత్ సర్కారు రద్దు చేసి, అదనపు పోస్టులతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యర్థి ఒకటికి మించి పరీక్షలు రాయాలనుంటే అన్నింటికీ వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి దరఖాస్తుకు ఫీజు రూ.1000గా నిర్ణయించారు. టీచర్ పోస్టుల భర్తీలో 95 శాతం స్థానికతను అమలు పరచనున్నారు. ఆయా జిల్లాల్లోని పోస్టులకు రోస్టర్ విధానాన్ని అమలు చేయనున్నారు. పరీక్ష తేదీలను త్వరలో ప్రకటిస్తారు. 20 మార్కులతో టెట్ వెయిటేజీ ఉంటుంది. రాత పరీక్షను 80 మార్కులకు పెడతారు. ప్రశ్నకు అర మార్కు చొప్పున మొత్తంగా 160 ప్రశ్నలుంటాయి. 100 మార్కులకు అభ్యర్థులు మెరిట్ జాబితాను రూపొందించి..నియామకాలను చేపట్టనుంది.

వయోపరిమితి ఎంత?

గత నోటిఫికేషన్‌తో పోల్చితే తాజా నోటిఫికేషన్‌లో వయోపరిమితిని రెండేళ్లు పెంచారు. ఈ మేరకు టీచర్ పోస్టుల అభ్యర్థి వయసు 01/07/2023 నాటికి 18 ఏళ్ల నుంచి 46 ఏళ్ల మధ్య ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మెన్ కేటగిరీ వారికి మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఈడబ్ల్యూఎస్, ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లు, పీహెచ్‌సీలకు 10 ఏళ్ల వెసులుబాటు ఉంటుంది.

టీచర్ పోస్టుల వివరాలు...

పోస్టు పేరు	ఖాళీల సంఖ్య
స్కూల్ అసిస్టెంట్	2,629
లాంగ్వేజ్ పండిట్	727
ఫిజికల్ ఎడ్యుకేషన్	182
ఎస్టీటీ	6,508
ఎస్ఏ (స్పెషల్ ఎడ్యుకేషన్)	220
ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)	796
మొత్తం	11,062

పెరిగిన వేడి

- కర్నూలులో 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

విశాఖపట్నం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): శీతాకాలం ముగియడంతో వేసవి వేడి తీవ్రత మొదలైంది. ఐదారు రోజుల నుంచి రాయలసీమలో కొనసాగుతున్న వేడి వాతావరణం గురువారం కోస్తాకు విస్తరించింది. అయితే ఉదయం నుంచి కోస్తాలో పలుచోట్ల దట్టంగా మంచుకురిసింది. తరువాత మంచుతెరలు తొలగిపోవడంతో సాయంత్రం వరకు అనేక ప్రాంతాల్లో ఉక్కపోతతోపాటు ఎండ తీక్షణంగా కాసింది. రాయలసీమలో రాత్రి సమయంలో కూడా వేడి వాతావరణం కొనసాగింది. నైరుతి దిశగా వీచిన పొడిగాలులతో రాయలసీమలో గాలిలో తేమశాతం గణనీయంగా పడిపోవడంతో మరింత వేడి నెలకొంది. గురువారం కర్నూలులో 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో ఎండ తీవ్రత పెరుగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

నవరత్నాలు ఎక్కడ అమలయ్యాయి?

● లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధినేత

విజయవాడ: పెత్తందారుల గురించి పదేపదే మాట్లాడుతున్నవాళ్లు ప్రభుత్వ సొమ్మును అదే పెత్తందారులకు దోచిపెడుతున్నారని, రాష్ట్రంలో నవరత్నాలు ఎక్కడా అమలు కావటం లేదని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ విమర్శించారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మాజీ ఐఏఎస్ అధికారిగా 2700 కిలోమీటర్లు పాదయాత్ర చేశానని, పేదల బాధలు చూశానన్నారు. సెంటు స్థ లంలో నిర్మిస్తున్న ఇళ్లకు గాలి, వెలుతురు రావడం లేదన్నారు. ఈ కాలనీలను మురికివాడలుగా తయా రు చేస్తున్నారన్నారు.

బస్టేషన్ మరుగుదొడ్డిలో వ్యక్తి మృతి

వన్‌టౌన్: పండిట్ నెహ్రూ బస్టేషన్‌లోని మరుగుదొడ్డిలో జంగారెడ్డి గూడేనికి చెందిన లంకా వెంక ట నాగకుమార్ (55) అనుమానాస్పద రీతిలో మృ తి చెందాడు. ఈ మేరకు మృతుడి కుమారుడు హరి వెంకటసాయి ఫణీంద్ర గురువారం కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడికి భార్య, కుమా రుడు, ఇద్దరు కుమార్తెలు. ఇతను ఒక పత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. హైబీపీ ఉండడంతో అనారోగ్యానికి గురయ్యాడు. బుధవారం ఉదయం 6.30 గం టలకు అమరావతి వెళుతున్నానని ఇంట్లో చెప్పి బ యలుదేరాడు. వస్తానన్న సమయానికి రాకపోవడం తో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్పందించలే దు. కుమారుడు తండ్రి ఫోన్‌ను ట్రాక్ చేయడంతో బస్టాండ్‌లో ఉన్నట్టు గుర్తించారు. దీంతో నగరంలో ఉన్న దగ్గరి బంధువు రాఘవ ప్రసాద్‌కు సమాచా రం ఇవ్వడంతో అయన బస్టేషన్‌కు వచ్చి వెదికాడు. చివరికి ఎర్రవైల్ బ్లాక్ వద్ద ఉన్న బాత్‌రూమ్‌లో చనిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యులు నగరానికి వచ్చి ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించారు. కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్య కారణాలతోనే చనిపోయినట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

రసాయన, జీవరసాయన విధానాలపై సమావేశం

లబ్బీపేట: సిద్ధార్థ మహిళా కళాశాలలో రసాయన శాస్త్రం, జీవరసాయన శాస్త్రం విభాగాల సం యుక్త ఆధ్వర్యంలో ఆధునిక వ్యాధులకు వ్యతిరేకం గా ఔషధ లక్ష్యాల అభివృద్ధి కోసం రసాయన, జీవరసాయన విధానాలపై అంతర్జాతీయ సమావేశంలో రెండో రోజు పలు అంశాలను విద్యార్థులకు సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు వివరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య నాగార్జున వర్సిటీ అసిస్టెం ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. వెంకట ప్రసుజ మాట్లాడుతూ ఔషధాల ఆవిష్కరణ, అభివద్ధి ప్రక్రియలో లక్ష్యాలను ఎలా గుర్తించాలి, వివిధ దశలు, అంతర్దశలు, ఔషధాల అభివృద్ధి ప్రక్రియలో ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలను వివరించారు. డా.విజయ సారథి సెట్‌లూరి, కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్. కల్పన, జీవరసాయన శాస్త్ర విభాగాధిపతి ఎ.హరిక, రసాయన శాస్త్ర విభాగాధిపతి ఎమ్.సుభాషిని పాల్గొన్నారు.

మినీ జాబ్ మేళాలో 12 మందికి ఉద్యోగాలు

పెనమలూరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), కృష్ణా జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు గురువారం పోరం కి హ్యాపీ మైండ్స్ శిక్షణా కేంద్రంలో మినీ జాబ్ మేళా నిర్వహించినట్టు అధికారులు డీ విక్టర్‌బాబు, ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. విక్టర్‌బాబు మాట్లాడుతూ అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ మేళా ని ర్వహిస్తున్నామన్నారు. మొత్తం 31మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 12మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. తుర్లపాటి మధు, శంకర్ పాల్గొన్నారు.

బాలుడిని క్షేమంగా ఇంటికి చేర్చిన పోలీసులు

మచిలీపట్నం టౌన్: పార్కులో ఆడుకునేందుకు వెళ్లిన బాలుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పో లీసులు ఆ బాలుడిని గుర్తించి క్షేమంగా ఇంటికి తీసు కొచ్చారు. నిర్మలా హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న చింతా చక్రధర్ శ్రీనివాసనగర్‌కు సమీపంలో నివసిస్తున్నారు. బుధవారం సాయంత్రం పార్కులో ఆడుకునేం దుకు వెళ్లి తిరిగి రాలేదు. చల్లపల్లిలోని తన పిన్ని ఇంటికి వెళుతున్న బాలుడిని పోలీసులు తీసుకొచ్చారు.







ఏపీటీఎఫ్ ధర్నాలో మాట్లాడుతున్న భానుమూర్తి, భవన నిర్మాణ కార్మికుల ధర్నాలో నినాదాలు చేస్తున్న నేతలు, ప్లకార్డులు చేపట్టి ధర్నా చేస్తున్న హెల్త్ ఆఫీసర్లు

మా సమస్యలు పరిష్కరించాలి

● ఏపీటీఎఫ్ నేతల ధర్నా

ధర్నాచౌక్, ఫిబ్రవరి 29: ఉద్యమాల పట్ల ఉదాసీన వైఖరితో ఏమరుపాటుగా ఉంటే పోరాడి సాధించుకున్న హక్కులు కోల్పోతామని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కే.భానుమూర్తి తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ధర్నాచౌక్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగం నేడు విధ్వంసకర విధానాలతో నిండి ఉందని, దీన్ని అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధానకార్యదర్శి సయ్యద్ ఖాసీం మాట్లాడుతూ ఎవరితో చెప్పకుండా ఏపీజేఏసీ నాయకత్వం 27న నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని విరమించిందని విమర్శించారు. పీఆర్సీ కమిషన్ ప్రకటన కంటి తుడుపు చర్యని, ఐఆర్ ప్రకటించాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు చెల్లించాలని, జీవో 117, సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పాత విధానంలో ఇవ్వాలని, ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నేతలు వి.రాధిక, ఎం.అనిత అబ్దుల్ నయీమ్, టి.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. ధర్నా అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో గురువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ దేశమంతా ఒకే తరహాలో సంక్షేమ బోర్డు సౌకర్యాలు ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996ను లేబరు కోడ్‌లలో కలపకుండా అమలు చేయాలన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లోని 40వేల క్లైమ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలన్నారు. సిమెంట్, కలప, పెయింట్, ఎలక్ట్రికల్ తదితర భవన నిర్మాణానికి సంబంధించిన వస్తువుల రేట్లు తగ్గించాలన్నారు. సోనారాజు, రమణ, సాంబశివరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ధర్నా

తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు స్థానిక ధర్నాచౌక్‌లో గురువారం ధర్నా చేపట్టారు. తమ సమస్యలపై అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదని వాపోయారు. కమ్యూనిటీ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్ (నేషనల్ హెల్త్ మిషన్)లో ఐదేళ్ల నుంచి పనిచేస్తున్నామని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు వేతనాలు పెంచి తమకు మాత్రం పెంచలేదన్నారు. 6 నెలల నుంచి బకాయిపడ్డ ఇన్‌సెంటివ్స్, క్లినిక్ అద్దెలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగుల భద్రత దృష్ట్యా చర్య లేకుండా నిర్మానుష్యమైన ఊరికి వెలుపల కట్టిన హెల్త్ క్లినిక్ క్వార్టర్లలో నివాసం ఉండాలని రాష్ట్ర అధికారులు ఆర్డర్లు జారీ చేశారన్నారు. అందుకు హెచ్‌ఆర్ఏ కూడా తమకు వస్తున్న ఇన్‌సెంటివ్స్ నుంచి కోత పెట్టారన్నారు. తమకు జీతం కూడా సరిగా అందజేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యక్షుడు పులి ప్రేమ్, కార్యదర్శి రాజేశ్వరి, కోశాధికారి సిద్దయ్య ప్రసంగించారు. ఐద్వా ప్రధానకార్యదర్శి రమాదేవి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కే ధనలక్ష్మీ, నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ఓటమి తప్పదు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఫిబ్రవరి 29: టీడీపీ-జనసేన పార్టీల కూటమి సూపర్‌హిట్ అని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి పులివెందుల్లో ఓటమి తప్పదని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ-జనసేన ఉమ్మడి సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని టీడీపీ, జనసేన పార్టీలు చేతులు కలిపింది వ్యక్తిగత ప్రయోజనాలు కోసం కాదని, 5కోట్ల ఆంధ్రుల ప్రజల భవిష్యత్ కోసమేనన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ఈ రెండు పార్టీలు చేతులు కలిపాయన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్ని హత్యచేసి మృతదేహాన్ని ఆయన ఇంటికే డోర్ డెలివరి చేశారని ఆరోపించారు. పేదల ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్లను జగన్ అధికారంలో రాగానే మూసేశారన్నారు. దళిత వైద్యుడు సుధాకర్ ఫేస్‌మాస్క్ అడిగినందుకు వైసీపీ ప్రభుత్వం ఆయన్ను మానసిక వికలాంగుడిగా ముద్ర వేసి చంపేసిందని విమర్శించారు. వైసీపీ వేధింపులు భరించలేక అంతర్జాతీయ క్రికెట్ హనుమ విహారి పారిపోయాడన్నారు. జగన్‌కు ఎందుకు ఓటు వేయాలో ఆ పార్టీ నేతలు స్పష్టం చేయాలన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టామన్నారు. రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలో తమ వద్ద బ్లూ ప్రింట్ ఉందని, తాము అధికారంలోకి వచ్చాక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. టీడీపీ-జనసేన పొత్తు సూపర్ హిట్ అని, టీడీపీ విన్నింగ్, వైసీపీ లూసింగ్ అని గద్దె రామ్మోహన్ ధీమా వ్యక్తం చేశారు.

ఎఫ్ట్రానిక్స్‌కు సీఐఐ గ్లోబల్ ఏఐ అవార్డు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 29: ఎఫ్‌ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు సీఐఐ ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవార్డు లభించింది. ఈ విషయాన్ని సంస్థ ఎండీ దాసరి రామకృష్ణ తెలిపారు. బృందావన్ కాలనీలో సంస్థ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. ఈనెల 26న ఢిల్లీలో జరిగిన సీఐఐ సమావేశంలో ఉత్తమ టెక్నాలజీ కింద తమ సంస్థకు అవార్డు లభించిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెయింటెనెన్స్ సిస్టమ్ రంగాల్లో తమ సంస్థ అత్యుత్తమ సేవలందించిందన్నారు. ఐబీఎం ఎండీ సందీప్ పటేల్ నుంచి సంస్థ ఈడీ భవానీ శంకర్, మార్కెటింగ్ మేనేజర్ మార్కండేయ వెంకట్ అవార్డుఅందుకున్నారన్నారు.





ఐబీఎం ఎండీ సందీప్ పటేల్ నుంచి అవార్డు అందుకుంటున్న సంస్థ ఈడీ భవానీ శంకర్, మార్కెటింగ్ మేనేజర్ మార్కండేయ వెంకట్, మాట్లాడుతున్న రామకృష్ణ

యాప్‌లోకి ఎంఎస్ఎంఈల సమాచారం

● ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశాలు

పెనమలూరు, ఫిబ్రవరి 29: జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎంఎస్ఎంఈ సర్వే అండ్ రిపోర్టు మొబైల్ యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిల్లీరావు ఎంపీడీవోలను, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం కలెక్టర్ డిల్లీరావు మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పరిశ్రమల శాఖ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఎస్ఎంఈల ఫార్మలైజేషన్‌లో భాగంగా రాష్ట్రంలోని అన్ని ఎంఎస్ఎంఈల సర్వేకోసం ప్రభుత్వం పరిశ్రమల శాఖ ద్వారా జీవో 24వ ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. తద్వారా ఎంఎస్ఎంఈల పనితీరును మెరుగుపరిచి అభివృద్ధిని వేగవంతం చేసి ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహకాలు రాయితీలు, విధివిధానాలు తెలుసుకొనేందుకు వీలుంటుందన్నారు. సచివాలయాల పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అమెనిటీ కార్యదర్శులు సదరు యాప్‌లో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. మార్చి 20లోగా వివరాల నమోదును పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని ఎంఎస్ఎంఈలను సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫాంలోకి తేవడం ద్వారా ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానం చేయాలన్నారు. పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు సీతారాం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆవును బతికించిన వైద్యురాలికి కృతజ్ఞలు

విద్యాధరపురం, విజయవాడ, ఫిబ్రవరి 29: భవానీపురంలోని టీడీపీ 40వ డివిజన్ అధ్యక్షుడు పొనుగుపాటి చిన సుబ్బయ్యకు చెందిన ఆవు కనలేక చాలా ఇబ్బంది పడింది. లోపల దూడ అడ్డం తిరగడంతో నరకయాతన పడింది. ఆవు దాదాపు ప్రాణాలు వదిలిందని ఖననం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇంతలో సంచార పశు వైద్యశాల ఆయన పాక వద్దకు వచ్చింది. అందులోని వైద్యులు ప్రథమ చికిత్స చేశారు అనంతరం పశువుల వైద్యురాలు డాక్టర్ మౌనికారెడ్డి సహకారంతో ఆవును గన్నవరంలోని వెటర్నరీ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేసి చనిపోయిన దూడను బయటకు తీసి ఆవును బతికించారు. దీంతో చిన సుబ్బయ్య ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆవుకు పూజలు చేశారు.



డాక్టర్ మౌనికారెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్న చినసుబ్బయ్య

బ్యాడ్మింటన్‌లో రష్మితకు కాంస్యం

విజయవాడ స్పోర్ట్సు: నగరానికి చెందిన షట్లర్ దోనేపూడి రష్మిత ఖేలో ఇండియా వర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో కాంస్యంతో సత్తా చాటింది. చెన్నైలోని ఎస్ఆర్ఎం వర్సిటీకి ప్రాతినిధ్యం వహించిన రష్మిత గౌహతిలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సెంటర్‌లో జరిగిన పోటీల్లో బుధవారం జరిగిన పోటీల్లో కాంస్యం సాధించింది. రష్మితను కేడీబీఏ అధ్యక్ష, కార్యదర్శులు పోలినేని అంకమ్మ చౌదరి, పర్సా శ్రీనివాస్ అభినందించారు.



సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం

మాచవరం, ఫిబ్రవరి 29: సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌ను కళాశాల వైద్యుల సం ఘం ప్రతినిధులు గురువారం సత్కరించారు. ఆసుపత్రిలో ని అన్ని విభాగాలకు, బోధనపరంగా అవసరమైన కంప్యూటర్లు, ఎల్‌సీడీ ప్రొజెక్టర్లు, ప్రింటర్లు, రైటింగ్ బోర్డు, స్టేషనరీ సమకూర్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆసుపత్రిలోని ఆయన కార్యాలయంలో శాలువా కప్పి ఆయనను సత్కరించారు.



డాక్టర్ సుధాకర్‌కు శాలువా కప్పి సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

ఒకటో డివిజన్‌కు ఫుట్‌బ్రిడ్జే గతి..?

● బుడమేరు కాల్వపై వంతెన మంజూరైన మాట వాస్తవం కాదా! ● రూ.11 లక్షల వ్యయంతో మరమ్మతులు

గుణదల: ఒకటో డివిజన్‌లో మూడొంతుల ప్రాంతం కాల్వకట్లపైనే ఉంది. తాజాగా బుడమేరు కాల్వకు అవతల పక్కనున్న పంటపొలాలు నివేశ స్థలాలుగా మారడంతో కాలనీలు ఏర్పడ్డాయి. గుణదల నుంచి నున్న వెళ్లేందుకు ఇటుగానే ప్రయాణాలు ఎక్కువగా జరుగుతుంటాయి. దీనికి తోడు మచిలీపట్నం రైల్వే ట్రాకు ఉండటంతో నిత్యం ఇటు ప్రయాణాలు ఎక్కువ. దీంతో రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. గుణదల నుంచి నున్న వెళ్లేందుకు వీలుగా మూడు కాల్వలు.. రైల్వే ట్రాకు దాటుకుని సమాంతరంగా ఆర్‌వోబీ వంతెన నిర్మాణానికి ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ దిశగా గుణదల సెంటర్ నుంచి వంతెన సెంటర్ వరకు ఏలూరు రోడ్డు రైవస్ కాల్వకు మధ్యనున్న నివాసాలను గడచిన 4 నెలల క్రితమే వీఎంసీ అధికారులు తొలగించారు. ఆర్‌వోబీ వంతెన నిర్మాణంతోపాటుగా గుణదల బుడమేరు కాల్వపై నున్న ఫుట్‌బ్రిడ్జి స్థానంలో మరో వంతెన నిర్మాణం జరగనుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పత్రికా ప్రకటన చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. బుడమేరు కాల్వపై ఉన్న ఫుట్‌బ్రిడ్జిపై నాలుగు రోజులుగా రాకపోకలు నిలిపేసి మరమ్మతులు చేస్తున్నారు. ఇందుకుగాను రూ.11 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు వీఎంసీ అధికారులు చెబుతున్నారు. అదేంటని ఎమ్మెల్యే విష్ణును అడగ్గా ఆర్వోబీ వంతెన నిర్మాణ సమయంలో ఇక్కడున్న ఫుట్‌బ్రిడ్జిని తొలగించి దానిస్థానంలో నూతన వంతెన నిర్మాణం చేశామన్నారు. అయితే ఫుట్‌బ్రిడ్జికి మరమ్మతులు చేసి మళ్లీ దానిస్థానంలో కొత్త వంతెన నిర్మాణం చేపడతారనేది ఉత్తిమాటేనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకటో డివిజన్‌వాసులకు ఫుట్‌బ్రిడ్జి మాత్రమే అందుబాటులో ఉంటే కాలనీల్లోకి రాలేవని, అభివృద్ధి చెందిన కాలనీలున్నా వంతెన నిర్మాణం చేపట్టరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తుప్పు పట్టేందుకు వీలున్న నాసిరకం ఇనుము వాడకంతో తక్కువ కాలంలోనే మళ్లీ ఫుట్‌బ్రిడ్జి తుప్పుపట్టిపోవడం ఖాయమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





బుడమేరు కాల్వపై ఫుట్ బ్రిడ్జి నిర్మాణానికి అమర్చుతున్న గడ్డర్లు, పాతపిల్లర్లపైనే గడ్డర్లు లేని తాత్కాలిక ఫుట్‌బ్రిడ్జి నిర్మాణ పనులు

డ్రైవింగ్ రంగానికి దేశవిదేశాల్లో ఉపాధి అవకాశాలు మెండు

● 'అమ్మ' మాజీ అధ్యక్షుడు ఎండీ బొబ్బా నారాయణరావు

పటమట, ఫిబ్రవరి 29: డ్రైవింగ్ రంగానికి దేశవిదే శాల్లో ఉపాధి అవకాశాలు పెరిగాయని, మంచి శిక్షణతో మాత్రమే రహదారి ప్రమాదాలను నివారించే వీలుందని ఆంధ్రా మోటార్స్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) మాజీ అధ్యక్షుడు, అరుణ ఫైనాన్స్ ఎండీ బొబ్బా నారాయణరావు అన్నారు. ది కృష్ణా డిస్ట్రిక్టు లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్ అంపాపురంలో 1068వ బ్యాచ్ ట్రైనీలకు గురువారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రహదారులు, వాహనాలు చాలా అభివృద్ధి చెందాయని, ఏసీ క్యాబిన్లతో కూడిన వాహనాలు రాబోతున్నాయని, కిలోమీటరుకు గానీ గంటకు గానీ డ్రైవర్లకు డబ్బులు చెల్లించే విధానం వచ్చిందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజు మాట్లాడుతూ కుటుంబాన్ని నడిపే తండ్రి కూడా డ్రైవర్ లాంటివాడేనని, రవాణా వాహనాలు నడిపే డ్రైవర్ల సామాజిక బాధ్యత ప్రశంసనీయమన్నారు. రోడ్ సేఫ్టీ సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులకు అమ్మ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు వడ్డమూడి వెంకటేశ్వరరావు, సుంకర చంద్రశేఖర్, అమ్మ మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావు సర్టిఫికెట్లను అందజేశారు. రక్తదానం చేసిన ట్రైనీలకు వై.వీ.ఈశ్వరరావు, కోనేరు వెంకట రమేష్, కోనేరు రామారావు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.



ట్రైనీలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న బొబ్బా నారాయణరావు

కొనసాగుతున్న దుర్గా సౌందర్యలహరి

విజయవాడ కల్చరల్: తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగుతున్న దుర్గా సౌందర్యలహరి శతావధానం నా లుగో రోజుకి చేరింది. వేదపాఠశాల విద్యార్థులతో ప్రారంభమైంది. 30 దత్తపదులు, 30 సమస్యా పూరణలు, వర్ణలు, ఆశువులు, అ ప్రస్తుత ప్రసంగాలు పూర్తయ్యాయి. రసజ్ఞ మనోజ్ఞం సాగుతున్న ఈ అవధాన కార్యక్రమానికి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుపరిపాలన ప్రాధాన్యత తీసుకుని మంత్రి అడిగిన ప్రశ్నకి అవధాని సమాధానం ఇస్తూ ప్రభుత్వాలు ధర్మ కార్యాలు చేసి అభివృద్ధిపథంలో రాష్ట్రాన్ని నడిపించాలని చెబుతూ, బహుజన హితమే రాగం - సర్వజన హితమే యోగమని మకుటంతో మంచి సందేశం ఆశువుగా ఆలపించారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో రామారావు పాల్గొన్నారు.

రేపు చిత్రకళా ప్రదర్శన, వర్క్‌షాప్

ధర్నాచౌక్: చిత్రకారులు చిత్రకళలో నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకునేందుకు మార్చి 2న చిత్రకళా ప్రదర్శన, వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు డ్రీమ్ వర్క్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేశ్వరంలోని కేఎల్ వర్సిటీ ఆవరణలో అనంత్ డైమండ్స్, కేఎల్ వర్సిటీతో కలిసి ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. పాల్గొనేవారికి షీట్లు, రంగులు అందిస్తామని బ్రష్‌లు ఎవరికివారే తెచ్చుకోవాలన్నారు. గతంలో నిర్వహించిన 11వ జాతీయ స్కూల్, కళాశాల విద్యార్థుల చిత్రలేఖనం పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 95029 44913 నంబర్‌ను సంప్రదించాలని ప్రదర్శన నిర్వాహకుడు, చిత్రకారుడు రమేష్ కోరారు.

విద్యార్థుల ఆలోచనలకు పదునుపెట్టే సైన్స్ ఎక్స్‌పో

● జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు

లబ్బీపేట, ఫిబ్రవరి 29: విద్యార్థులకు సైన్స్ ఎక్స్‌పో ప్రోత్సాహకంగానూ, వైవిధ్య భరితమైన ఆలోచనలకు పదునుపెట్టేలా ఉంటాయని జిల్లా విద్యాశాఖాధికారి డీవీ సుబ్బారావు అన్నారు. గురువారం బిషప్ అజరయ్య బాలికల పాఠశాలలో ఏపీ ఈఎండీపీ 2023-24 డిస్టిక్ లెవల్ ఎక్స్‌పో జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా, వ్యవస్థాపకులుగా తయారవడానికి ఇలాంటి ఎక్స్‌పోలు ప్రేరణ కలిగిస్తాయన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో-2 ఎం.విజయ రామారావు, డీసీఈబీ కార్యదర్శి షేక్ ఉమర్ అలీ, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎం.హుస్సేన్, ఏపీ ఈఎండీపీ మేనేజర్ జంపాన భాను కిరణ్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేసిన సుబ్బారావు

ధరల పెంపుపై తెలుగు మహిళల నిరసన



నల్ల దుస్తులు ధరించి నెల్లూరు నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 29 : వైసీపీ పాలనపై నెల్లూరు నగరంలో మహిళలు కన్నెర్ర చేశారు. గురువారం సాయంత్రం నల్లదుస్తులు ధరించిన మహిళలు గాంధీ బొమ్మ నుంచి ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ నేత నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శన స్టోన్‌హౌస్‌పేటలోని జలకన్య విగ్రహం వరకు కొనసాగింది. అక్కడ ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిత్యావసరాలు, కరెంటు బిల్లులు, ఆర్టీసీ చార్జీలు, వంటగ్యాస్ రేట్లను విపరీతంగా పెంచేశారని విమర్శించారు. ఆఖరికి చేతకాని పాలన వల్ల చెత్తపై కూడా పన్ను వేయటం దారుణమన్నారు.

ఎన్నికల్లో జగన్‌ను ఓడిద్దాం

గ్రామ వ్యవస్థలను కాపాడుకునేందుకు ముందుకు రావాలి: వైవీబీ

అరసవల్లి, ఫిబ్రవరి 29: 'వైసీపీ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైపోయింది. గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి పనులు లేవు. అందుకే రానున్న ఎన్నికల్లో జగన్‌ను ఓడించి గ్రామ వ్యవస్థలను కాపాడుకునేందుకు పార్టీలకు అతీతంగా అందరూ ముందుకు రావాలి' అని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు పిలుపునిచ్చారు. గురువారం శ్రీకాకుళంలో కలెక్టరేట్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా.. సర్పంచ్‌లు ధర్నా చేపట్టారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12,918 గ్రామాల్లోని 3.50 కోట్ల మంది గ్రామీణ ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. జగన్.. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కాజేశారని ఆరోపించారు. కలెక్టర్‌ను కలిసి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.



ముగిసిన రబీ.. సాగు 75శాతమే!

- విపత్తు నష్టాలు, పెట్టుబడుల భారం
- అందని ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా
- ఖరీఫ్‌లో చీడపీడల ప్రభావంతో సతమతం
- సాగు తగ్గించిన రైతులు

అమరావతి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రబీ పంట కాలం ముగిసింది. ఈ సీజన్‌లో 75శాతమే పంటలు సాగయ్యాయి. 58లక్షల ఎకరాల లక్ష్యం కాగా, 41.75లక్షల ఎకరాల్లోనే రైతులు పంట పండించారు. దాదాపు 16లక్షల ఎకరాలు ఖాళీగా మిగిలాయి. ఏడాదంతా తీవ్ర వర్షాభావంతో సాగునీటి సమస్య ఏర్పడటం, పెరిగిన పెట్టుబడులు, కూలీల కొరత, వ్యక్తిగత యంత్రపరికరాలు అందరికీ అందుబాటులో లేకపోవడంతోపాటు, ఖరీఫ్‌లో చీడపీడలతో సతమతమై, చాలా మంది రైతులు రబీ సాగుకు ఆసక్తి చూపలేదు. అలాగే నిరుడు కరువు, మిచౌంగ్ తుఫాన్‌కు జరిగిన పంట నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా అందక సాగు తగ్గించినట్లు తెలుస్తోంది. రబీ ప్రారంభంలో వేసిన పంటలు తుఫాన్‌తో దెబ్బతినడంతో కొందరు మళ్లీ విత్తనమే వేయలేదు. దీంతో పాటు వాతావరణం అనుకూలించక, కృష్ణా, గోదావరి డెల్టాల్లో సార్వా వరి కోతలు ఆలస్యం కావడం, పెన్నా ఆయకట్టు, నెల్లూరు ప్రాంతంలో ఇప్పుడు వరి కోతలు జరుగుతుండటంతో రైతులు ఈ సీజన్‌లో అన్ని పంటలూ సాగు చేయలేకపోయారు. దీంతో రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ నూరు శాతం పంటల సాగవ్వలేదు. 45-94 శాతం మధ్య.. 11 జిల్లాల్లో సగటున 70శాతమే రబీ సాగు జరిగింది. ఈ సీజన్‌లో 20లక్షల ఎకరాల్లో వేయాల్సిన దాళ్వా వరి 16లక్షల ఎకరాలకే పరిమితమైంది. 22 లక్షల ఎకరాల్లో పండించే అపరాల పంటలు 4లక్షల ఎకరాల్లో తగ్గాయి. 8.5లక్షల ఎకరాల్లో వేసే చిరుధాన్యాలు, 3.55 లక్షల ఎకరాల్లో వేయాల్సిన నూనె గింజల పంటలు లక్ష ఎకరాల చొప్పున తగ్గాయి. వరిలో ఆకు ముడత, మొక్కజొన్నలో గులాబీపురుగు అధికంగా ఉన్నాయి. పత్తితీతలు పూర్తవ్వగా, అపరాల కోతలు సాగుతున్నాయి. మిర్చిని కల్లాల నుంచి మార్కెట్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం వరి, ఉద్యాన పంటలేసిన రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

సైకోసురుడి నుంచి విముక్తే అందరి లక్ష్యం

- రాష్ట్రం కోసమే బాబు, పవన్ ఏకమయ్యారు
- జగన్ మొగుడు పవన్ కల్యాణే.. ఎంపీ రఘురామ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): సైకోసురుడి పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించడమే అందరి లక్ష్యం కావాలని ఎంపీ రఘురామకృష్ణ రాజు పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ భేషజాలను మరచి రాష్ట్ర భవిష్యత్తు కోసం ఏకమయ్యారన్నారు. అలాగే రెండు పార్టీల కార్యకర్తలు, నాయకులు కూడా భేషజాలను పక్కన పెట్టి, అరమరికలు లేకుండా కూటమి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. గురువారం, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రఘురామ మీడియాతో మాట్లాడుతూ.. ఉత్తరాల రాయుళ్లకు, వైసీపీ కోవర్టులకు బహిరంగంగా పవన్ కల్యాణ్ ఇచ్చిన పంచ్ ఆర్డినరీ పంచ్ కాదన్నారు. ఎన్నికల యుద్ధానికి జన సైన్యాన్ని ఆయన సిద్ధం చేశారన్నారు. కులతత్వం లేని పవన్ అభిమానుల మధ్య కులతత్వాన్ని రెచ్చగొట్టడం అవసరమా అని ప్రశ్నించారు. ఒక కులం మద్దతుతో అది చేద్దాం... ఇది చేద్దామని చెప్పే వారు, ఎవరికి మద్దతు ప్రకటిస్తున్నారో చెప్పాలన్నారు. కులాల గోడలు నిలువునా ఛేదించి, రాష్ట్ర ప్రజలను, అన్ని కులాల వారిని విధ్వంస పాలకుడు, సైకోసురుడి బారి నుంచి కాపాడుదామని చంద్రబాబు, పవన్ ఎటువంటి భేషజాలకు పోకుండా కలిసి ముందుకు వస్తే స్వాగతించాల్సింది పోయి, కొందరు విచిత్రమైన ప్రతిపాదనలు తెరపైకి తీసుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. రెండున్నర ఏళ్ల పాటు మాకు అధికారం ఇవ్వాలని, అలాగే కాపులకు అధికంగా ఎమ్మెల్యే సీట్లను కేటాయించాలని రకరకాల ప్రతిపాదనలతో పవన్‌ను కొంతమంది మానసికంగా వేధించారన్నారు. పవన్ పెళ్లిళ్ల గురించి తరచూ జగన్ విమర్శించడంపై ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ బహుశా నా నాల్గవ పెళ్లాం... జగన్మోహన్ రెడ్డి నేమో అని సెటైర్ వేశారని.. జగన్మోహన్ రెడ్డి మొగుడు పవన్ కల్యాణ్ అనుకునే విధంగా ఓవర్ నైట్ ట్రెండ్ మారిపోయిందని చెప్పారు. రుషికొండపై జగన్ తన నివాస సముదాయాన్ని నిర్మించుకొని, ఇప్పుడు దాన్ని టూరిజం ప్రాజెక్టుకని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాలేదు

- గ్రూప్-1 పరీక్షల్లోనూ కుట్ర కోణం: సీపీఐ రామకృష్ణ

అమరావతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి జగన్ వంద శాతం ప్రచారం చేసుకుని.. కేవలం 20 శాతం మంది రైతులకే డబ్బులు జమ చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. మిగిలిన 80 శాతం మంది రైతులు బ్యాంకులకు వెళ్లగా డబ్బులు జమ కాలేదని తెలుసుకుని నివ్వెర పోయారని తెలిపారు. వడ్డీ చెల్లింపు కింద రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రూ.3 వేల కోట్లు జమ చేయాల్సి ఉంటే.. 20 శాతం నిధులు మాత్రమే జమ చేశారని తెలిపారు. గురువారం విజయవాడలోని దాసరి భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పిన జగన్.. యువతను మోసం చేశారని మండిపడ్డారు. ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ ప్రకటన మేరకు 1,48,880 మంది అభ్యర్థులు కొత్త సిలబస్‌తో గ్రూప్-1 పరీక్షకు ప్రిపేర్ అయ్యారని, ఇప్పుడు పాత సిలబస్ ప్రకారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రకటించడం వెనుక కుట్ర కోణం ఉందని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం, ఏపీపీఎస్సీ చైర్మన్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పొత్తులు, సీట్లపై ఈ వారంలోనే స్పష్టత

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కలిసి పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నామని, ఈ నెల మొదటి వారంలోనే పొత్తులు, సీట్ల సర్దుబాటుపై స్పష్టత ఇస్తామని రామకృష్ణ తెలిపారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సీఎం జగన్మోహన్‌రెడ్డే కారణమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా డిక్లరేషన్‌పై శుక్రవారం తిరుపతిలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ సభకు, విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చేపట్టిన 'చలో సీఎం కార్యాలయం ముట్టడి' కార్యక్రమానికి సీపీఐ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.

వీసా, పాస్‌పోర్ట్‌ల రద్దు!

- ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన రైతు నిరసనకారుల పట్ల హరియాణా పోలీసుల నిర్ణయం

చండీగఢ్, ఫిబ్రవరి 29: పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్న డిమాండ్‌తో రైతులు చేపట్టిన ఆందోళనలో భాగంగా హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న రైతు నిరసనకారులతోపాటు పంజాబ్-హరియాణా సరిహద్దు వెంబడి ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించిన వారిపై కొరడా ఝుళిపించేందుకు హరియాణా పోలీసులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా వారి పాస్‌పోర్టులతోపాటు వీసాలను రద్దు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు వారి వీసాలు, పాస్‌పోర్టులను రద్దు చేయాలని సంబంధిత మంత్రిత్వ శాఖ, ఎంబసీని కోరనున్నట్టు అంబాలా డీఎస్పీ జోగిందర్ శర్మ పేర్కొన్నారు. వారి ఫొటోలు, పేరు, చిరునామాను పాస్‌పోర్ట్ కార్యాలయంలో ఇవ్వనున్నట్టు చెప్పారు. రైతుల నిరసన పేరుతో పంజాబ్ నుంచి హరియాణాకు వస్తున్న నిరసనకారులతోపాటు హింసకు పాల్పడుతున్న వారిని సీసీటీవీ, డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించినట్టు చెప్పారు.

అడ్డగోలు బదిలీలు

డబ్బులిస్తే చాలు.. అర్హతలేనివారికి అందలం!

- మున్సిపల్ శాఖలో నిబంధనలకు పాతర

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'డబ్బులిస్తే ఎవరిని ఎక్కడి నుంచి ఎక్కడికైనా బదిలీ చేస్తారు.. నచ్చినవారికి అందలమెక్కించి అందినకాడికి దండుకుంటున్నారు.. ప్రధానంగా ఎన్నికల ప్రక్రియలో పట్టణాల్లో కీలకంగా ఉన్న అధికారులను అవసరమైన చోట్ల వైసీపీ ఆదేశాలతో ఇష్టారీతిగా బదిలీ చేస్తున్నారు.. ఓటర్ల జాబితాలను తారు మారు చేసేందుకు తమకు అనుకూలమైన అధికారులను నియమించి అడ్డగోలుగా పదోన్నతులు కల్పిస్తున్నారు.. అధికారపార్టీ నేతలు కావాలనుకుంటే.. అర్హత లేని సీనియర్ అసిస్టెంట్లను, ఆడిట్ అధికార్లను కమిషనర్లుగా నియమిస్తున్నారు'.. ఇవీ మున్సిపల్‌శాఖపై వస్తున్న ఇబ్బడి ముబ్బడి ఆరోపణలు!! నిజమే.. తాడేపల్లిగూడెం లాంటి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీకి పశుసంవర్ధక శాఖకు చెందిన ఓ సీనియర్ అసిస్టెంట్‌ను కమిషనర్‌గా నియమించారంటే.. బదిలీల్లో ప్రభుత్వం ఏ మేరకు నిబంధనలు అనుసరించిందో.. పై ఆరోపణలను బట్టి ఇట్టే అర్థం చేసుకోవచ్చు!!

మున్సిపల్‌శాఖలో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ అడ్డగోలుగా తయారైంది. మున్సిపల్ కమిషనర్ల బదిలీలు ఇష్టారీతిగా చేపడుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో చేపట్టిన కమిషనర్ల బదిలీల ప్రక్రియతో మున్సిపల్ మంత్రి, ఉన్నతాధికారులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీల పేరుతో ఇష్టం లేని వారిని నిబంధనలు తుంగలో తొక్కి.. ప్రాధాన్యం లేని పోస్టుల్లోకి విసిరిపారేస్తున్నారు. ఓ వైపు ఆ శాఖ మంత్రి, మరో వైపు మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారి ఇష్టారాజ్యంగా దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే రెండు విడతలు మున్సిపల్ కమిషనర్ల బదిలీలు జరిగాయి. తమకు నచ్చనివారిని అప్రాధాన్య పోస్టుల్లో నియవిస్తూ.. నచ్చినవారిని అందలమెక్కిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు.

ఇవి కొన్ని ఉదాహరణలు..

తాడిపత్రిలో పనిచేస్తున్న స్పెషల్‌గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌ను ఆముదాలవలస నగర పంచాయతీకి బదిలీ చేసి నిబంధనలను తుంగలో తొక్కారు. తమ వాడనుకున్న కాకినాడ కార్పొరేషన్ సెక్రటరీ మాత్రం పదోన్నతి ఇచ్చి మరీ అక్కడే కొనసాగించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తుంగలో తొక్కి అధికారపార్టీ నేతల సిఫారసులతో బదిలీ చేయకుండా నిలిపేశారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల్లో కూడా బదిలీలు అడ్డగోలు జరిగాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒంగోలు కార్పొరేషన్ నుంచి వైఎస్ఆర్ తాడిగడపకు బదిలీ చేయించుకునేందుకు ఓ కమిషనర్ పాతిక లక్షలు ఖర్చు పెట్టుకున్నారని ప్రచారం జరుగుతోంది. భీమవరం కమిషనర్ విషయంలో అయితే ఇష్టారీతిగా వ్యవహరించారు. ఓ ఎంపీడీఓను భీమవరం కమిషనర్‌గా నియమించి అక్కడి నుంచి విజయవాడకు బదిలీ చేశారు. ఆ తర్వాత విజయవాడ నుంచి భీమవరంకు బదిలీ చేశారు. డబ్బులిస్తే ఎవరిని ఎక్కడి నుంచి ఎక్కడికైనా మున్సిపల్ శాఖలో బదిలీ చేయవచ్చన్న ఆరోపణలు వస్తున్నాయి. తాడేపల్లిగూడెం లాంటి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీకి పశుసంవర్ధకశాఖకు చెందిన ఓ సీనియర్ అసిస్టెంట్‌ను నియమించారు. ఇతర శాఖల అధికారులపై ఉన్న ప్రేమ సొంత శాఖకు సంబంధించిన వారిపై ఉన్నతాధికారులకు, మంత్రికి లేదని మున్సిపల్ అధికారులు వాపోతున్నారు.

మున్సిపల్‌శాఖలో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ ఆశాఖ ఉన్నతాధికారులు ఇతర శాఖల అధికారులపై ఎక్కడలేని అభిమానం చూపిస్తున్నారు. తమపట్ల శీతకన్ను వేసి.. సుమారు 40 మంది ఇతర శాఖల అధికారులను కమిషనర్లుగా తీసుకున్నారని, సొంత శాఖలో కమిషనర్లను ప్రాధాన్యత లేని పోస్టుల్లో నియమించారని ఇక్కడి అధికారులు వాపోతున్నారు. ఇతర శాఖల అధికారులకైతే ఎలాంటి పోస్టులకైనా కొరత లేదని, సొంత శాఖ సిబ్బంది అంటే మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులకు చీదరింపుగా ఉందని ఆక్రోశిస్తున్నారు.

ఎన్నికల్లో లబ్ధికి అనర్హులకు పదోన్నతులు!

టౌన్‌ప్లానింగ్ అధికారుల పదోన్నతుల విషయంలో మున్సిపల్‌శాఖ అడ్డగోలుగా వ్యవహరించింది. సొమ్ములు తీసుకుని ఏకంగా అర్హత లేని వారికి పదోన్నతులు కల్పించిందని ఆరోపిస్తున్నారు. ఆరేళ్ల సర్వీసు ఉన్న అసిస్టెంట్ టౌన్‌ప్లానింగ్ అధికారులను పదోన్నతిపై డిప్యూటీ డైరక్టర్లుగా నియమించాలని సర్వీసు రూల్స్ నిబంధనలు చెప్తున్నాయి. అయితే మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఈ నిబంధనలకు తిలోదకాలిచ్చారు. కొద్దిమంది అసిస్టెంట్ డైరెక్టర్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు రెండేళ్ల సర్వీసు మాత్రమే ఉన్నప్పటికీ వారికి పదోన్నతి కల్పించాలని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా ఆరేళ్ల సర్వీసును రెండేళ్లకు తగ్గించి మరీ పదోన్నతులు కల్పించేందుకు మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి అనుమతించారు. ఇది సర్వీసు నిబంధనలకు విరుద్ధమని తెలిసినా ఉత్తర్వులు జారీచేశారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అసిస్టెంట్ డైరెక్టర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బి.గురవారెడ్డి, కేఆర్ మధు, ఈ.బాలాజీ, జి.రామకృష్ణుడు, ఎన్.హరిబాబు, జెడ్ సుధాకర్‌లను డీడీ టౌన్‌ప్లానింగ్ అధికారులుగా అడహాక్ పదోన్నతులు కల్పించాలని మున్సిపల్‌శాఖ మెమో జారీచేసింది. అయితే ఈ విధానం మిగతా వారికి వర్తించదని, కేవలం వారికి మాత్రమేనని మెమోలో పేర్కొనడం గమనార్హం. ఇటీవలనే జీవీఎంసీ నుంచి పార్వతీపురానికి బదిలీ అయిన ఓ అధికారిని మళ్లీ ఎన్నికల కమిషన్ ఆదేశాలనే సాకు చూపించి చీరాలకు మార్చారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నరసరావుపేటలో బదిలీలు వైసీపీ నేతల ఇష్టారీతిగా చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ ఎం.రామ్మోహన్‌రావును ఇటీవల బదిలీ చేశారు. ఆయన జూన్‌లో ఇక్కడ కమిషనర్‌గా చేరారు. ఎన్నికల్లో వైసీపీకి సహకరించరన్న ఉద్దేశంతో అధికార పార్టీ నేతలు ఆయనను బదిలీ చేయించారు. ఆయన స్థానంలో ఆడిట్ అధికారిని నియమించారు.

బాంబు పేలుళ్ల కేసులో కరీం తుండా నిర్దోషి

జైపూర్, ఫిబ్రవరి 29: వరుస బాంబు పేలుళ్ల కేసులో దావూద్ ఇబ్రహీం అనుచరుడు అబ్దుల్ కరీం తుండా (81) నిర్దోషి అని గురువారం అజ్మీర్‌లోని టాడా కేసుల ప్రత్యేక కోర్టు తీర్పు చెప్పింది. బాబ్రీ మసీదు కూల్చివేతకు ఏడాదయిన సందర్భాన్ని పురస్కరించుకొని 1993 డిసెంబరు 5, 6 తేదీల అర్ధరాత్రి అయిదు చోట్ల వరుస బాంబు పేలుళ్లు చోటు చేసుకున్నాయి. హైదరాబాద్, లఖ్‌నవూ, కాన్పూర్, సూరత్, ముంబయిల్లోని అయిదు రైళ్లలో ఆ బాంబులు పెట్టారు. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా, పలువురు గాయపడ్డారు. పోలీసులు తుండాతో పాటు ఇర్ఫాన్ అలియాస్ పప్పు, హమీదుద్దీన్‌లపై కేసులు పెట్టారు. తుండాకు వ్యతిరేకంగా ఎలాంటి రుజువులు చూపట్టలేకపోవడంతో ఆయనను విడుదల చేస్తున్నట్టు జడ్జి తెలిపారు. మిగిలిన ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.

క్రిమినల్ ఉద్దేశం ఉంటేనే ఆత్మహత్యకు ప్రేరేపించినట్టు...

- దాన్ని నిరూపిస్తేనే శిక్ష విధించాలి
- వివాహిత సూసైడ్ కేసులపై సుప్రీంకోర్టు స్పష్టత
- 30 ఏళ్ల అనంతరం భర్తకు విముక్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: నేరపూరిత ఉద్దేశం ఉందని నిరూపిస్తే తప్ప ఆత్మహత్యను ప్రేరేపించారన్న కారణంతో ఎవరినీ శిక్షించలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భార్య ఆత్మహత్యకు కారకుడయ్యాడన్న ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తిని నిర్దోషిగా ప్రకటిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. పెళ్లయిన ఏడేళ్లలోపు ఎవరైనా మహిళ ఆత్మహత్య చేసుకుంటే అందుకు భర్త, అత్తింటివారి వేధింపులే కారణమని భావించాల్సి ఉంటుందని ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లోని సెక్షన్ 113ఏ చెబుతోంది. దీని ఆధారంగా విధిస్తున్న శిక్షలపై స్పష్టత ఇస్తూ పై వ్యాఖ్యలు చేసింది. 1992లో ఓ జంటకు వివాహం జరిగింది. 1993 నవంబరు 19న ఆమె విషం తాగి ఆత్మహత్య చేసుకొంది. మరణించే సమయానికి ఆమెకు ఆరు నెలల శిశువు ఉంది. రేషన్ షాపు పెట్టుకోవడానికి సొమ్ము తీసుకురావాలంటూ నిత్యం వేధించిన కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్టు కేసు నమోదయింది. విచారణ జరిపిన కర్నాల్‌లోని అదనపు సెషన్స్ జడ్జి కోర్టు..ఆత్మహత్యకు ప్రోత్సహించారన్న కారణంతో ఐపీసీలోని సెక్షన్ 306 కింద శిక్ష విధిస్తూ 1998లో తీర్పు చెప్పింది. అనంతరం పంజాబ్-హరియాణా హైకోర్టు ఈ శిక్షతో ఏకీభవించింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం విచారణ జరిపింది. కేవలం ఆత్మహత్యను ప్రేరేపించారని పేర్కొంటే సరిపోదని, దానివెనక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో క్రిమినల్ ఉద్దేశాలు ఉన్నాయని నిరూపించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. పెళ్లయిన ఏడేళ్లలోపు ఆత్మహత్య చేసుకుంటే అందుకు వేధింపులే కారణమని సెక్షన్ 113ఏ వర్తింపజేసే సమయంలో కోర్టులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. వ్యాపారం కోసం సొమ్ము తీసుకురావాలని అడగడం తప్ప ఇతరత్రా కారణాలేవీ లేనప్పుడు దానినే క్రూరత్వమో, వేధింపులుగానో పరిగణించలేమని తెలిపింది. సున్నిత మనస్కులైన కొందరు చిన్న విషయానికే కోపం తెచ్చుకొని ప్రాణాలు తీసుకుంటుంటారని, అలాంటి వాటిని కూడా గమనించాలని పేర్కొంది. ప్రస్తుత క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో కేసు విచారణే పెద్ద శిక్షగా మారిందని, గత 30 ఏళ్లుగా అతడు ఎదుర్కొన్న ఇబ్బందులను అర్థం చేసుకోగలమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. శిక్ష నుంచి ఎవరూ తప్పించుకోలేరని, కానీ దాన్ని చట్టానికి అనుగుణంగా నిర్ధరించాల్సి ఉంటుందని పేర్కొంది.

శరద్ పవార్ విందు రాజకీయం

- సీఎం, డిప్యూటీలకు ఆహ్వానం

పుణె, ఫిబ్రవరి 29: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ చంద్ర పవార్) అధ్యక్షుడు శరద్ పవార్ ఆకస్మికంగా విందు రాజకీయాలకు తెరతీశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉపముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడణవీస్, అజిత్ పవార్‌లను తన ఇంటికి భోజనాలకు ఆహ్వానించారు. పుణే జిల్లా బారామతిలోని తన నివాసంలో శనివారం భోజనం చేయాలని కోరారు. బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ కాలేజీలో నమో మహా రోజ్‌గార్ మేళవాకు ఆ ముగ్గురు అగ్రనేతలు హాజరు కానున్నారు. దాంతో తన నివాసం గోవింద్ బాగ్‌లో లంచ్‌కు రావాలంటూ సీనియర్ పవార్ ఆహ్వానించారు. మరోవైపు ఆ అధికారిక కార్యక్రమంలో శరద్ పవార్ కుమార్తె, బారామతి ఎంపీ సుప్రియా సూలే పాల్గొననున్నారు.

మేం ఉద్యోగం ఇస్తాం..
జీతం మీరు ఇవ్వండి!

- ఆర్అండ్‌బీ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో వింత
- రాష్ట్ర వ్యాప్తంగా 467 పోస్టుల భర్తీకి జీవో జారీ
- జీతాల చెల్లింపు బాధ్యత ఎస్ఈలదేనని లింకు
- అతిథిగృహాల ఆదాయంతో చెల్లించాలని మెలిక
- ప్రతినెలా ఏకంగా రూ.70 లక్షల వరకూ భారం
- గెస్ట్‌హౌస్‌లను ఉచితంగా వాడేస్తున్న వీఐపీలు
- జిల్లా కేంద్రాల్లోనే 5 వేలకు మించని ఆదాయం
- చాలాచోట్ల నయా పైసా కూడా రావడం లేదు
- జీతాలు ఎలా చెల్లించాలని ఎస్ఈల ఆవేదన

రోడ్లు భవనాల శాఖ పరిధిలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 467 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్తగా వచ్చే ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.15వేలు చొప్పున అతిథి గృహాల ఆదాయం నుంచి జీతంగా ఇవ్వాలని జీవోలో పేర్కొన్నారు. అంటే వీరికి జీతాలకు నెలకు రూ.70లక్షల వరకూ ఖర్చవుతుంది. అధికార లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 139 ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లు ఉన్నాయి. ఈ లెక్కన ఒక్కోదాని నుంచి సగటున రూ.50వేలకు పైగా జీతం చెల్లించాల్సి ఉంటుంది. పైసా కూడా ఆదాయం లేని అతిథిగృహాలు ఈ మొత్తాన్ని ఎలా చెల్లిస్తాయో ప్రభుత్వమే చెప్పాలి.


ఆర్అండ్‌బీ అతిథి గృహం

అనంతపురం సిటీ: ఏటా జాబ్ కేలండర్ అన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలన్నీ భర్తీ చేస్తామన్నారు. పోలీసు ఉద్యోగాలు, మెగా డీఎస్సీ.. అబ్బో ఒకటేమిటి ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అన్నీ మర్చిపోయారు. నాలుగున్నరేళ్ల పాటు ఆ ఊసెత్తకుండా ఎన్నికలు దగ్గర పడటంతో ఇప్పుడు అరకొర పోస్టులతో నోటిఫికేషన్లు ఇస్తూ హడావుడి చేస్తున్నారు. నిరుద్యోగులను మభ్య పెట్టేందుకు ఒక వింత జీవో జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు భవనాల శాఖ పరిధిలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 467 పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. జీతాలు మాత్రం ఆర్అండ్‌బీ శాఖ చెల్లిస్తుందని చెప్పకుండా లింకు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్అండ్‌బీ అతిథి గృహాల నుంచి వచ్చే ఆదాయం నుంచి కొత్త సిబ్బందికి జీతాలు చెల్లించాలని జీవోలో పేర్కొంది. ఈ బాధ్యతను ఆయా జిల్లాల ఎస్ఈలకు ప్రభుత్వం అప్పగించింది. 'ఉద్యోగాల భర్తీ మా బాధ్యత.. జీతాల చెల్లింపు ఎస్ఈల బాధ్యత' అన్నట్లుగా వ్యవహరిస్తోంది. పోనీ.. కొత్తగా నియమించే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇచ్చేంత ఆదాయం అతిథిగృహాల నుంచి వస్తుందా.. అంటే అదీ లేదు. వీటికి వచ్చే ఆదాయం చాలా చాలా తక్కువ. చాలాచోట్ల ఒక్కోదానికి నెలకు రూ.3వేలు కూడా రావడం లేదు. కొన్నింటికి అసలు ఆదాయమే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జీతాలు ఎక్కడినుంచి చెల్లించాలని ఎస్ఈలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

33 వేల దరఖాస్తులు

రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలో వాచ్‌మెన్-139, ఆఫీస్ సబార్డినేట్-170, శానిటరీ వర్కర్-158 పోస్టులు మొత్తం 467 ఉన్నాయని, వీటిని అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్టు ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఫిబ్రవరి 22 నుంచి 28వ తేదీ వరకు ఆయా జిల్లాల్లోని ఆర్అండ్‌బీ ప్రధాన కార్యాలయాల్లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో జిల్లాల వారీగా ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 33వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. ఈ పోస్టులకు విద్యార్హత పదో తరగతి అని నోటిఫికేషన్‌లో పేర్కొన్నా.. బీటెక్, ఎంటెక్, పీజీ, డిగ్రీ పూర్తి చేసినవారు కూడా దరఖాస్తు చేశారు.

ఆదాయం అంతంతే

రాష్ట్రవ్యాప్తంగా 139 ఆర్అండ్‌బీ అతిథి గృహాలు ఉన్నాయి. వీటి నుంచి ఎక్కడా పెద్దగా ఆదాయం లేదని ఎస్ఈలే చెబుతున్నారు. వీటిలో దిగే వీఐపీలు ఎవరూ అద్దె చెల్లించడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, జేసీలు వంటివారు వస్తే.. అద్దె అడిగే సాహసం సిబ్బంది చేయలేకపోతున్నారు. చాలామంది వీఐపీలు పైసా చెల్లించకుండా అతిథిగృహాలను వాడుకుని దర్జాగా వెళ్లిపోతున్నారు. వారిని డబ్బులు అడిగితే 'అంతే సంగతులు' అని ఉద్యోగులే అంటున్నారు. కొందరు మాత్రం తమ పరిస్థితిని అర్థం చేసుకుని నామమాత్రంగా నగదు చెల్లిస్తారని చెబుతున్నారు. 26 జిల్లాల్లోనూ ఇదే తంతు సాగుతోంది. జిల్లా కేంద్రాల్లో ఉన్న అతిథి గృహాలకు నెలకు రూ.2000 నుంచి రూ.5 వేల వరకు ఆదాయం వస్తోంది. కానీ నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న వాటికి రూ.2వేలు కూడా రావడం లేదు. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. అతిథి గృహాల నుంచి వచ్చే ఆదాయం నుంచి కొత్త సిబ్బందికి జీతాలు చెల్లించాలని జీవోలో పేర్కొనడం ఏంటని కొందరు ఎస్ఈలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్అండ్‌బీ అతిథి గృహాలు

రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో ఉన్నవి: 139
వీటి సగటు ఆదాయం నెలకు: రూ.2,000 లోపు
కొత్తగా జీతాలకు అయ్యే ఖర్చు: రూ.50వేలకు పైగా

పోస్టుల వివరాలు

ఆఫీస్ సబార్డినేట్:	170
వాచ్‌మెన్:	139
శానిటరీ వర్కర్:	158
మొత్తం పోస్టులు:	467
ఒక్కో పోస్టుకు వేతనం:	రూ.15,000

ఇదెక్కడి జీవో?

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆర్అండ్‌బీలో పరిస్థితి దారుణంగా తయారైంది. చేసిన పనులకు బిల్లులు కావడం లేదు. శాఖాపరంగా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. ఇప్పుడు ఉద్యోగాల భర్తీ పేరిట హడావుడి చేయడం, జీతాల చెల్లింపు బాధ్యతలను ఎస్ఈలపై మోపడం విమర్శలకు తావిస్తోంది. 'ఇప్పటి వరకూ చాలా నోటిఫికేషన్‌లు చూశాం. కానీ ఇలాంటి నోటిఫికేషన్‌ను ఏ ప్రభుత్వమూ విడుదల చేయలేదు' అని పలువురు ఎస్ఈలు వాపోతున్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులను మభ్యపెట్టేందుకే ప్రభుత్వం గిమ్మిక్కు జీవో జారీ చేసిందనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగాల భర్తీతో పాటు జీతాల చెల్లింపు బాధ్యత కూడా తీసుకోవాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

వైసీపీ అభ్యర్థులు పారిపోతున్నారు

- అందుకే రోజుకో అభ్యర్థిని మారుస్తున్నారు: టీడీపీ

అమరావతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): 'అధికారంలో ఉన్న పార్టీ రోజుకో అభ్యర్థిని మార్చుకోవాల్సిన దిక్కుమాలిన పరిస్థితిని ఈ రాష్ట్రంలో మొదటిసారి చూస్తున్నాం. ఎంపిక చేసిన అభ్యర్థులు పారిపోతుంటే రోజుకో కొత్త అభ్యర్థిని వెతుక్కొని తెచ్చి ప్రకటించుకోవాల్సి వస్తోంది' అని అధికార వైసీపీని ఉద్దేశించి తెలుగుదేశం పార్టీ ఎద్దేవా చేసింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా గురువారం విలేకరులతో మాట్లాడారు. జగన్‌కు తన ఓటమి కళ్ల ముందు కనిపిస్తోందని, దాన్ని ఆపాలన్న ఆరాటంలో అభ్యర్థుల ఎంపికను ఒక ప్రహసనంగా మార్చారని అన్నారు. చిత్తూరు వ్యక్తిని తెచ్చి ఒంగోలులో, నెల్లూరు నేతను తీసుకువెళ్లి నర్సరావుపేటలో, వేమూరు వ్యక్తిని తీసుకువెళ్లి సంతనూతలపాడులో పెడుతున్నారని, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ చూడని చోద్యాలు చూపిస్తున్నారని పేర్కొన్నారు. ఆ పార్టీ పరిస్థితి ఇంత ఘోరంగా తయారవడం వల్లే వైసీపీ నేతలు టీడీపీ, జనసేన పార్టీల ముందు క్యూ కడుతున్నారని నాగుల్ మీరా వ్యాఖ్యానించారు. ఎన్నికల తర్వాత జగన్ బెంగుళూరు ప్యాలెస్‌కు పరారు కావడం ఖాయమని, తాడేపల్లి ప్యాలెస్‌లో సామాన్లు సర్దడం ఇప్పటికే మొదలుపెట్టారని అన్నారు.

గూడెం సభ చూసి వణుకు: మాణిక్యాలరావు

తాడేపల్లి గూడెం సభ చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో పిల్లులకు వణుకు మొదలైందని టీడీపీ అధికార ప్రతినిధి పి. మాణిక్యాలరావు ఎద్దేవా చేశారు. 'ఈ సభలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాట్లాడిన మాటలకు సమాధానం చెప్పడానికి ఏకంగా ఐదుగురు మంత్రులు వచ్చారు. వారు ఎంత భయపడుతున్నారో దీన్ని బట్టే తెలుస్తోంది. ఎన్ని కుయుక్తులు పన్నినా వైసీపీ పని అయిపోయింది. వై నాట్ జాబ్ క్యాలెండర్.. వై నాట్ డిఎస్సీ.. వై నాట్ ఉచిత ఇసుక.. అని చంద్రబాబు ప్రశ్నిస్తే ఆ పార్టీ నేతలు కిక్కురుమనడం లేదు. చీటింగ్ గ్యాంగ్ కథ ముగిసిపోయింది' అని ఆయన వ్యాఖ్యానించారు.

లక్ష్మీ పార్వతి పరువు తీస్తున్న పేర్ని నాని: నాదెండ్ల బ్రహ్మం

సొంత పార్టీలో ఉన్న లక్ష్మీ పార్వతి పరువును వైసీపీ నేత పేర్ని నాని గంగలో కలుపుతున్నారని టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం వ్యాఖ్యానించారు. 'హూ కిల్డ్ బాబాయ్ అని మేం అడుగుతుంటే హూ కిల్డ్ ఎన్టీఆర్ అని పేర్ని నాని ప్రశ్నిస్తున్నారు. ఎన్టీఆర్ చనిపోయినప్పుడు ఆయన ఇంట్లో పక్కన లక్ష్మీ పార్వతి ఉన్నారు. కాబట్టి ఆమెనే అడగాలి. పేర్ని నాని మాటలు వింటే ఎన్టీఆర్ మరణంలో లక్ష్మీ పార్వతిని అడ్డు పెట్టుకొని రాజశేఖరరెడ్డి ఏదైనా చేశారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి' అని ఆయన అన్నారు. జగన్ ఇప్పటివరకూ తనకు సీటు ఖరారు చేయకపోవడంతో మంత్రి రోజాకు మతి భ్రమించిందని, జగన్‌ను కాకా పట్టడానికి ఆమె నానా తంటాలు పడుతున్నారని బ్రహ్మం ఎద్దేవా చేశారు. 60 రోజుల తర్వాత ఆమెకు పూర్తి విశ్రాంతి దొరుకుతుందని, హాయిగా టీవీ షోల్లో పాల్గొనవచ్చని సూచించారు.

రష్యా వార్‌జోన్‌లోనే 20 మంది భారతీయులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 29: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా వార్‌జోన్‌లోనే ఇంకా 20 మంది భారతీయుల చిక్కుకొని ఉన్నారని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. వారిని వీలైనంత త్వరగా తీసుకురావడానికి రష్యా అధికారులతో కేంద్రం సంప్రదింపులు జరుపుతోందని గురువారం వెల్లడించింది. ఉద్యోగాల కోసమని రష్యాకు వెళ్లిన కొందరు భారత యువకులు.. అక్కడి పరిస్థితుల నేపథ్యంలో రష్యా తరఫున ఉక్రెయిన్‌తో యుద్ధంలో పాల్గొనాల్సి వచ్చింది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ సుఫియాన్ కూడా ఉన్నాడు. ఇక్కడి ఏజెంట్లు రష్యాలో ఉద్యోగమని చెప్పి.. ఆ దేశ సైన్యంలో చేర్చారని సుఫియాన్ కుటుంబం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఆ ఏజెంట్లపై చర్యలు తీసుకొని రష్యాలో చిక్కుకున్న వారిని వెనక్కి తీసుకురావాలని కోరింది. 'రష్యా వార్‌జోన్‌లో చిక్కుకున్న వారిని సాధ్యమైనంత త్వరగా రప్పించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. రష్యాలోని భారతీయులు జాగ్రత్తగా ఉండాలి.. యుద్ధ ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లవద్దని మరోసారి హెచ్చరిస్తున్నాం' అని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వ్యాఖ్యానించారు.

కోర్టు అనుమతి లేనిదే డేరా బాబాకు పెరోల్ ఇవ్వొద్దు

చండీగఢ్, ఫిబ్రవరి 29: జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచా సౌధా చీఫ్ గుర్మీత్ రాం రహీంకు హరియాణా సర్కారు పలుమార్లు పెరోల్ ఇచ్చి తాత్కాలికంగా విడుదల చేస్తుండడాన్ని పంజాబ్-హరియాణా హైకోర్టు ప్రశ్నించింది. ఇకపై కోర్టు అనుమతి లేకుండా పెరోల్ ఇవ్వకూడదని ఆదేశించింది. రేప్ కేసులో ముద్దాయి అయిన ఆయన 20 ఏళ్లపాటు జైలులో ఉండాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో ఆయనను తొమ్మిది సార్లు విడుదల చేసింది. జనవరిలో 50 రోజుల పాటు పెరోల్ ఇచ్చింది. ఆ గడువు మార్చి 10న ముగియనుంది.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 1 మార్చి 2024



టీఎస్ లాసెట్ అండ్ పీజీఎల్‌సెట్ నోటిఫికేషన్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- లా కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన ఎంట్రెన్స్ టెస్ట్‌ల నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మూడేళ్లు/అయిదేళ్ల ఎల్‌ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి టీఎస్ లాసెట్ 2024; రెండేళ్ల ఎల్‌ఎల్ఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి టీఎస్ పీజీఎల్‌సెట్ 2024 రాయాల్సి ఉంటుంది. వీటిని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షల్లో సాధించిన మెరిట్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా లా ప్రోగ్రామ్‌లు అందించే యూనివర్సిటీలు, అనుబంధ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

టీఎస్ లాసెట్

అర్హత: అయిదేళ్ల ఎల్‌ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే లాసెట్ రాయాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 45 శాతం మార్కులు తప్పనిసరి. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసినవారు, ఇంటర్ చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే లాసెట్‌కు కనీసం 45 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో అంతకన్నా తక్కువ మార్కులు ఉండి 45 శాతానికి మించిన మార్కులతో పీజీ/బీఈడీ పూర్తిచేసినవారు; ప్రస్తుతం డిగ్రీ చివరి ఏడాది పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఎటువంటి ప్రాథమిక విద్య లేకుండా ఓపెన్ యూనివర్సిటీల నుంచి నేరుగా ఇంటర్/డిగ్రీ/పీజీ పూర్తి చేసినవారు; ఓయూ నుంచి బీఏ ఎక్స్‌టర్నల్ గ్రాడ్యుయేట్స్; వన్ సిటింగ్ విధానంలో డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. వయోపరిమితి నిబంధనలు లేవు.

పరీక్ష వివరాలు: ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ నుంచి 30; రెండో పార్ట్‌లో కరెంట్ అఫైర్స్ నుంచి 30; మూడో పార్ట్‌లో ఆప్టిట్యూడ్ ఫర్ ద స్టడీ ఆఫ్ లా నుంచి 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 'మ్యాచింగ్' ప్రశ్నలు కూడా ఇస్తారు. అయిదేళ్ల ప్రోగ్రామ్‌నకు నిర్వహించే టెస్ట్‌లో ఇంటర్ స్థాయిలో; మూడేళ్ల ప్రోగ్రామ్‌నకు నిర్వహించే పరీక్షలో డిగ్రీ స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. పరీక్ష సమయం గంటన్నర. నెగెటివ్ మార్కులు లేవు. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 42 మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్, తెలుగు లేదా ఇంగ్లీష్, ఉర్దు మాధ్యమాల్లో ఇస్తారు.

టీఎస్ పీజీఎల్‌సెట్

అర్హత: మూడేళ్లు/అయిదేళ్ల వ్యవధిగల ఎల్‌ఎల్‌బీ/బీఎల్ కోర్సులు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు కౌన్సెలింగ్ నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

పరీక్ష వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జ్యూరిస్ప్రుడెన్స్, కాన్‌స్టిట్యూషనల్ లా అంశాల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు అడుగుతారు. రెండో పార్ట్‌లో పబ్లిక్&ప్రైవేట్ ఇంటర్నేషనల్ లా, బిజినెస్ అండ్ కార్పొరేట్ లా, లేబర్ లా, క్రైమ్స్ అండ్ టార్ట్స్, అలైడ్ లా విభాగాలకు సంబంధించి ఒక్కోదానిలో 16 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 30 మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** లాసెట్‌కు రూ.900(దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600); పీజీఎల్‌సెట్‌కు 1100 (దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 20 నుంచి 25 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 30 నుంచి
- **టీఎస్ లాసెట్ 2024, టీఎస్ పీజీఎల్‌సెట్ 2024 తేదీ:** జూన్ 3
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, కరీంనగర్, సిద్దిపేట్, సత్తుపల్లి, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, నర్సంపేట్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, కర్నూలు తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **వెబ్‌సైట్:** lawcet.tsche.ac.in

ఆర్ఐఎంసీలో ప్రవేశానికి ఏపీపీఎస్సీ ఆహ్వానం

డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)లో ఎనిమిదో తరగతి(2025 జనవరి టర్మ్) ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) వెబ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. స్థానిక బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, వైవా, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాలనుంచి 2025 జనవరి 1 నాటికి ఏడోతరగతి ఉత్తీర్ణులు/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు 2025 జనవరి 1 నాటికి పదకొండున్నరేళ్ల నుంచి పదమూడేళ్ల మధ్య ఉండాలి.

రాత పరీక్ష వివరాలు: మొత్తం మార్కులు 400. ఇంగ్లీష్ నుంచి 125, మేథమెటిక్స్ నుంచి 200 జనరల్ నాలెడ్జ్ నుంచి 75 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు సమాధానాలను హిందీ లేదా ఆంగ్ల మాధ్యమంలో రాయవచ్చు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి వైవా వోస్ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. ఇందులో ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలు పరీక్షిస్తారు. ఇందులో కూడా అర్హత సాధించినవారికి మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం: విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించగానే ఆర్ఐఎంసీ దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్, పాత ప్రశ్నపత్రాలను స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతుంది. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి ఏపీపీఎస్సీ చిరునామాకు పంపించాలి. దరఖాస్తు ఫీజును డీడీ ద్వారా కూడా ఆర్ఐఎంసీకి పంపవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.555
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** మున్సిపల్ కార్పొరేషన్/గ్రామ పంచాయతీ జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్; నివాసం, కులం ధ్రువీకరణ పత్రాలు; బోనఫైడ్ సర్టిఫికెట్; ఆధార్ కార్డ్; విద్యార్థి ఫొటోలు 2
- **ఏపీపీఎస్సీ చిరునామా:** అసిస్టెంట్ సెక్రటరీ(ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్టీఏ ఆఫీస్ దగ్గర, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, ఎంజీ రోడ్, విజయవాడ- 520010, ఆంధ్రప్రదేశ్
- **ఆర్ఐఎంసీ చిరునామా:** రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్, గర్హి కంటోన్మెంట్, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్-248003
- **పరీక్ష తేదీ:** జూన్ 1 ❑ **పరీక్ష కేంద్రం:** విజయవాడ
- **వెబ్‌సైట్:** www.rimc.gov.in, https://psc.ap.gov.in

తెలంగాణ గిరిజన గురుకుల సైనిక పాఠశాలలో అడ్మిషన్స్

వరంగల్ జిల్లా-అశోక్‌నగర్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల సైనిక పాఠశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా ఆరోతరగతి, ఇంటర్(ఎంపీసీ) మొదటి సంవత్సరంలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న బాలురు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌ల ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం బోధన ఉంటుంది. మిలిటరీ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తారు. ఎన్‌డీఏ, ఎస్ఎస్‌బీ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తారు. వసతి, భోజనం, బోధన ఉచితం. యూనిఫాం, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, బెడ్డింగ్ మెటీరియల్ అందిస్తారు. వార్షిక పరీక్షలకు ఫీజు చెల్లించనవసరం లేదు.



సీట్ల వివరాలు: ఆరోతరగతిలో 80 సీట్లు, ఇంటర్(ఎంపీసీ)లో 80 సీట్లు ఉన్నాయి. ఒక్కో తరగతిలో ఎస్టీ విద్యార్థులకు 58; ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఇతరులకు ఒక్కో వర్గానికి అయిదు; గురుకులం ఎంప్లాయీ, స్పోర్ట్స్ కోటాల కింద ఒక్కో దానికి ఒక సీటు ప్రత్యేకించారు.

అర్హత: కుటుంబ వార్షిక ఆదాయం పట్టణాల్లో రూ.2,00,000; గ్రామాల్లో రూ.1,50,000 మించకూడదు. తెలుగు మీడియం విద్యార్థులు కూడా పరీక్ష రాయవచ్చు. నిర్దేశించిన మేరకు శారీరక ప్రమాణాలు(ఎత్తు, బరువు) ఉండాలి.

- ఆరోతరగతిలో చేరాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి అయిదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. విద్యార్థులు 2012 ఏప్రిల్ 1 నుంచి 2014 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.
- ఇంటర్(ఎంపీసీ) మొదటి ఏడాదిలో ప్రవేశానికి గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి ఉత్తీర్ణులు/ప్రస్తుతం పరీక్షలు రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు 2007 ఏప్రిల్ 1 నుంచి 2009 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం మూడు గంటలు.

- ఆరోతరగతి ఎంట్రెన్స్ టెస్ట్‌లో తెలుగు నుంచి 20, ఇంగ్లీష్ నుంచి 30, మేథమెటిక్స్ నుంచి 30, సైన్స్ నుంచి 10, సోషల్ స్టడీస్ నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలను అయిదో తరగతి స్టేట్ సిలబస్ ప్రకారం ఇస్తారు.
- ఇంటర్(ఎంపీసీ) ఎంట్రెన్స్ టెస్ట్‌లో ఇంగ్లీష్ నుంచి 20, మేథమెటిక్స్ నుంచి 40, ఫిజిక్స్ నుంచి 20, కెమిస్ట్రీ నుంచి 15, బయాలజీ నుంచి 5 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలను ఎనిమిది నుంచి పదోతరగతి స్టేట్ సిలబస్ ప్రకారం ఇస్తారు.
- ఎంట్రెన్స్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ప్రకారం విద్యార్థులను 1:3 నిష్పత్తిలో స్క్రీనింగ్ చేసి ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌కు పంపుతారు.

ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్: ఆరోతరగతిలో చేరే విద్యార్థులకు 6 మీటర్ల షటిల్ రన్, 100 మీటర్ల స్ప్రింట్, హారిజాంటల్ జంప్, జంప్ అండ్ టచ్, టచింగ్ టోస్ వంటి ఈవెంట్లు నిర్వహిస్తారు.

- ఇంటర్(ఎంపీసీ)లో చేరే విద్యార్థులకు 2.4 మీటర్ల రన్నింగ్, స్కిప్పింగ్, పుషప్స్ అండ్ సిటప్స్, చిన్ అప్స్ రోప్ క్లయింబింగ్ ఈవెంట్లు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 18
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 1 నుంచి
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 7
- **విద్యార్థుల మెరిట్ జాబితా విడుదల:** ఏప్రిల్ 24
- **ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లు:** మే 1 నుంచి 6 వరకు
- **అశోక్‌నగర్ సైనిక పాఠశాల అడ్మిషన్ తేదీ:** జూన్ 12
- **వెబ్‌సైట్:** www.tgtwgurukulam.telangana.gov.in

జాబ్ కార్నర్

బెల్‌లో టెక్నీషియన్స్

పంచకుల(హరియాణా)లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. శాశ్వత ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 14

ట్రేడులు: ఎలక్ట్రానిక్ మెకానిక్, ఎలక్ట్రికల్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మ్యాన్

అర్హత: ఎస్ఎస్ఎల్‌సీ, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వేతనం: నెలకు రూ.21,500 నుంచి రూ.82,000

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.250. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ఎక్స్ సర్వీస్‌మన్ అభ్యర్థులకు మినహాయింపు ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: మార్చి 13

వెబ్‌సైట్: https://bel-india.in

నాబార్డులో స్పెషలిస్ట్ పోస్టులు

ముంబయిలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, ప్రధాన కార్యాలయం.... దేశ వ్యాప్తంగా నాబార్డ్ శాఖల్లో కింద పేర్కొన్న స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 31

1. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్
2. ప్రాజెక్ట్ మేనేజర్
3. లీడ్ ఆడిటర్
4. అడిషనల్ చీఫ్ రిస్క్ మేనేజర్
5. సీనియర్ అనలిస్ట్
6. రిస్క్ మేనేజర్
7. సైబర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ స్పెషలిస్ట్
8. డేటాబేస్ అండ్ ఆపరేటింగ్ సిస్టమ్స్ స్పెషలిస్ట్
9. ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ బ్యాంకింగ్ స్పెషలిస్ట్
10. ఎకనామిస్ట్
11. క్రెడిట్ ఆఫీసర్
12. లీగల్ ఆఫీసర్
13. ఈటీఎల్ డెవలపర్
14. డేటా కన్సల్టెంట్
15. బిజినెస్ అనలిస్ట్
16. పవర్ బీఐ రిపోర్ట్ డెవలపర్
17. స్పెషలిస్ట్ - డేటా మేనేజ్‌మెంట్
18. ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ కన్సల్టెంట్ - టెక్నికల్
19. ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ కన్సల్టెంట్ - బ్యాంకింగ్

అర్హత: సంబంధిత విభాగాల్లో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, సీఏ/సీఎఫ్ఏ/ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.50. మిగతా వారందరికీ రూ.800.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 10

వెబ్‌సైట్: https://www.nabard.org/

ఈఎస్ఐసీలో సీనియర్ రెసిడెంట్స్

వాపి(గుజరాత్)లోని ఈఎస్ఐసీ హాస్పిటల్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 13

విభాగాలు: అనస్తీషియా, ఐ, మెడిసిన్, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, రేడియాలజీ, సర్జరీ.



అర్హత: సంబంధిత విభాగంలో పీజీ లేదా పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ.1,21,454

వయోపరిమితి: 45 ఏళ్లు మించకూడదు

ఇంటర్వ్యూ తేదీ: మార్చి 7

వెబ్‌సైట్: https://vapihospital.esic.gov.in/

ఆర్ఎఫ్‌సీఎల్‌లో ప్రొఫెషనల్ పోస్టులు

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్), రామగుండం ప్లాంట్... వివిధ విభాగాల్లో రెగ్యులర్ ప్రాతిపదికన ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 27

పోస్టులు: అసిస్టెంట్ మేనేజర్, సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అడిషనల్ సీఎంఓ, సీనియర్ మెడికల్ ఆఫీసర్.

విభాగాలు: కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కెమికల్ ల్యాబ్, మెటీరియల్స్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, హ్యూమన్ రిసోర్స్, మెడికల్, సేఫ్టీ.

అర్హత: పోస్టును అనుసరించి బీఈ, బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ), పీజీ, డిప్లొమా, సీఏ, సీఎంఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 20

వెబ్‌సైట్: https://www.rfcl.co.in/

చిట్టి కథ



ఏనుగు- చిట్టి చీమలు

అడవిలో ఓ ఏనుగు ఉండేది. అది మదపుటేనుగు. ఎవరి మాటా వినేది కాదు. చెట్లను పీకేసి రోడ్డుకు అడ్డంగా వేసేది. గట్టిగా అరిచేది. ఎదురుగా వచ్చిన జంతువులను తొండంతో ఈడ్చి కొట్టేది. దీంతో ఏనుగుతో స్నేహం భయంకరమే అన్నట్లు అన్ని జంతువులు అనుకునేవి. గజరాజును నేనని గర్వం ఏనుగుకు ఉండేది.


జంతువులనే కాదు.. అడవి మనుషులను కూడా ఇబ్బంది పెట్టే ఏనుగు. దీంతో అడవి అంతా తానే అన్నట్లుండేది ఈ ఏనుగు. పండ్ల చెట్లను కూడా పీకేసేది. అడ్డూ అదుపు లేకుండా ఉండే దాని తీరు చూసి అన్నీ జడుసుకునేవి. ఈ ఏనుగు ప్రతి పది రోజులు ఓ ప్రాంతంలో ఉండే ఆ తర్వాత మరో ప్రాంతానికి వెళ్లిపోయేది. ఆ ప్రాంతాన్ని ధ్వంసం చేసిన తర్వాతనే వెళ్లిపోయేది.




ఒక రోజు ఏనుగు నిద్రపోయే చోటు చీమలపుట్ట పడింది. ఈ చీమలన్నీ నా దగ్గర ఉన్నాయేంటీ? అని ఆ ఏనుగు ఆ పుట్టను తొక్కేసింది. చిన్న చీమలు కాబట్టి ఏమీ చచ్చిపోలేదు. మూడు రోజుల్లో అదే ప్రాంతంలో మరో పుట్టను పెట్టాయి చీమలు. ఏనుగు కోప్పడింది. దగ్గరలో ఉండే నదిలోని నీళ్లను తొండంతో పీల్చుకుని వచ్చేది. ఆ నీటిని ఆ పుట్టమీద వదిలేసేది. చీమలన్నీ కొట్టుకుపోయేవి. ప్రాణాలు వదిలేవి కొన్ని. ఇలా నిత్యం నీళ్లతో చీమలను ఇబ్బందిపెట్టే స్థాయికి ఏనుగు వచ్చింది. ఏనుగు లాంటి జంతువు.. ఈ చీమలమీద ప్రతాపమేంటీ అని కొన్ని జంతువులు నవ్వుకున్నాయి. అయినా పట్టించుకోలేదు.

ఇక ఆ ప్రాంతం వదలి వెళ్లిపోకముందు ఒక రోజు ఏనుగు నిద్రపోతూ ఉంది. క్షణాల్లో చీమల గుంపు ఏనుగు తొండలోకి వెళ్లి కరవటం ప్రారంభించాయి. ఏనుగుకు దిక్కుతోచక పరుగెత్తింది. కరవటం ఆపలేదు చీమలు. నీళ్లలోకి పరిగెత్తి నీళ్లు పీల్చాలన్న ఆలోచన కూడా కలగలేదు ఆ ఏనుగుకు. అంతలా బాధపడింది. చివరికి తనతప్పు తెలుసుకుంది. చిన్న చీమలేనని గర్వంతో వీగిపోయాను. ఇవి బుద్ధి చెప్పాయని.. తెలుసుకుంది ఆ ఏనుగు.

10 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



పిల్లులు ఎన్ని?



డైలీ సుడోకు - 243

	4	7					5	
	9	5	7		2	4		
				5		1		
	5		8	6				4
		4				5		
8				7	5		6	
		2		4				
		9	2		7	8	4	
	1					3	7	

సుడోకు - 242 సమాధానం

8	4	3	2	9	6	7	1	5
1	9	7	3	8	5	6	4	2
6	5	2	4	1	7	3	8	9
9	1	5	6	7	3	8	2	4
4	3	8	5	2	9	1	7	6
2	7	6	8	4	1	5	9	3
3	8	4	1	5	2	9	6	7
5	2	9	7	6	8	4	3	1
7	6	1	9	3	4	2	5	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.